నమస్తే తెలంగాణ
తాజా వార్తలు,
ఈ పేపర్ కోసం
ntnews.com
చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

గురువారం 2.4.2020 • సంపుటి 9 • సంచిక 278 • వెల. రూ. 6.50 | కరీంనగర్ పేజీలు : 12 | శ్రీరామనవమి

సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.25, శార్వరి సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం నవమి అ.రా. 2.44 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: పునర్వసు రాత్రి 7.29 వరకు, తదుపరి పుష్యమి, అమృతఘడియలు: సాయంత్రం 5.04 నుంచి 6.41 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.48 నుంచి 3.20 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.07 నుంచి సాయంత్రం 4.47 వరకు, వర్జ్యం: ఉదయం 7.29 నుంచి 9.05 వరకు, తిరిగి తె.జా. 3.13 నుంచి 4.46 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline




# ఢిల్లీ నుంచే తాజా లొల్లి



కరోనాపై పోరాటానికి సీఎంఆర్ఎఫ్‌కు రూ.7.5 కోట్ల నగదు, రూ.2.5 కోట్ల విలువైన శానిటైజర్లు, కోటి విలువైన ఔషధాల విరాళానికి సంబంధించిన పత్రాలను బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందిస్తున్న అరబిందో ఫార్మా వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి, డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డి

## మరో 30 కేసులు, మూడు మరణాలు

- నిజాముద్దీన్ నుంచే పెరిగిన కరోనా.. వైరస్ తీవ్రత, వ్యాప్తి కూడా ఎక్కువే
- రాత్రి 12.30 దాకా సీఎం ఉన్నతస్థాయి భేటీ.. అన్ని విభాగాల పనితీరుపై పూర్తిసమీక్ష
- అలక్ష్యంగా వ్యవహరించేవారిపై తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కరోనా వైరస్‌పై పోరాటంలో ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోసారి పిలుపునిచ్చారు. లాక్‌డౌన్‌కు సహకరిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూనే, కరోనా సద్దుమణగలేదనీ, మరిన్నిరోజులపాటు దాని తీవ్రత కొనసాగే సంకేతాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని హెచ్చరించారు. అందువల్ల ప్రజలు ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దనీ, తమకేం కాదనే భావన ఎంతమాత్రం తగదనీ హితవు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లనుంచి బయటకు రావద్దని సూచించారు. తెలంగాణలో కరోనా పరిస్థితిపై ముఖ్యమంత్రి బుధవారం పలుమార్లు సమీక్షించారు. చివరి సమావేశం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 12.35 దాకా కొనసాగింది. పలువురు ఉన్నతాధికారులు, మంత్రులు ఇందులో పాల్గొన్నారు. విదేశాల నుంచి వచ్చిన వారి కన్నా, ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ప్రార్థనల్లో పాల్గొని వచ్చిన వారిలో కరోనా తీవ్రత అధికంగా ఉన్నట్టు గుర్తించారు. ఢిల్లీకి వెళ్లి వచ్చినవారికి, వారినుంచి సమీప బంధువులకు, ఇతరులకు వైరస్ ముప్పు ఎక్కువగా కొనసాగుతున్నట్టు అంచనావేశారు. విదేశాల నుంచి వచ్చినవారు చికిత్సకు పూర్తిస్థాయిలో స్పందిస్తున్నారని, అనేకమందికి నయం చేసి పంపిస్తున్నామని, బుధవారం కూడా 11 మందికి నయంచేసి డిశ్చార్జి చేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. నిజాముద్దీన్‌కు వెళ్లి వచ్చిన వారికే వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నదని తెలిపారు. అందువల్లే ఆంధ్రప్రదేశ్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. తెలంగాణలో తాజాగా బయటపడ్డ మరో 30 పాజిటివ్ కేసులు కూడా నిజాముద్దీన్‌కు సంబంధించినవేనని పేర్కొన్నారు. మరణించిన వారు కూడా అక్కడికి వెళ్లివచ్చినవారేనని నివేదించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నిజాముద్దీన్ ప్రార్థనలకు వెళ్లి వచ్చినవారిని, వారి సన్నిహితులను పూర్తిస్థాయిలో పరీక్షించాలని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ఢిల్లీ ప్రార్థనల్లో పాల్గొన్నవారు, వారితో కాంటాక్ట్‌లోకి వెళ్లిన వారు.. ఎవరున్నా తక్షణమే ప్రభుత్వానికి, వైద్యులకు తెలియజేయాలని సూచించారు. కరోనా వైరస్ ఎంతమందికి సోకినా చికిత్స చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పునరుద్ఘాటించారు. ప్రభుత్వంపై భరోసా ఉంచి సదరు వ్యక్తులంతా తక్షణమే అధికారవర్గాలకు రిపోర్టుచేయాలనీ, తగిన చికిత్స చేయించుకొని, ప్రాణాలు కాపాడుకోవాలని

మిగతా 2వ పేజీలో



కరోనా అనుమానితులను దవాఖానకు తరలిస్తున్న దృశ్యం

### ఢిల్లీకి వెళ్లొచ్చినవారు వెంటనే తెలియజేయాలి

- వారి సన్నిహితులు కూడా తక్షణం రిపోర్టు చేయాలి
- ఎంతమందికైనా చికిత్స చేసేందుకు ఏర్పాట్లు సిద్ధం
- అందువల్ల బాధితులు వెంటనే డాక్టర్లను సంప్రదించాలి
- ఇది అత్యంత కీలక దశ.. లాక్‌డౌన్‌కు జనం సహకరించాలి
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఇల్లు వదలి బయటకు రాకూడదు
- పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

## వైద్య, పోలీసు, పారిశుద్ధ్య సిబ్బందికి పూర్తి వేతనాలు

- ఇన్సెంటివ్ కూడా..
- రేపో మాపో ముఖ్యమంత్రి ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా పోరులో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దివారాత్రాలు పనిచేస్తున్న వైద్య సిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య సిబ్బందికి ఈ నెల (మార్చి) పూర్తి వేతనం చెల్లించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. నగరాలు, పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి ఈ నెల పూర్తి వేతనం లభించనున్నది. అసాధారణ

మిగతా 2వ పేజీలో

# 2 వారాలు కీలకం

- అజాగ్రత్తకు మూల్యం తప్పదు.. బయటకొస్తే బతుకుమీద ఆశ వదులుకొన్నట్లే
- నిర్లక్ష్యంతోనే అగ్రరాజ్యాలు ఆగమాగం.. అందుకే అమెరికా, యూరప్ దేశాల్లో మృత్యుకేళి
- ముందుజాగ్రత్తతోనే పరిస్థితి మెరుగు.. స్వీయనియంత్రణే సురక్షితం

కొంచెం అజాగ్రత్త.. మహమ్మారికి మనల్ని ఆహారం చేస్తుంది. కొంచెం నిర్లక్ష్యం.. యమపాశం మనకు ఉచ్చు బిగించేలా చేస్తుంది. విశ్వమారి మనకు మీటరు దూరంలో నిలుచుని ఉన్నది. ఏ చిన్న అవకాశమిచ్చినా కబళించేందుకు సిద్ధంగా ఉన్నది. చదువుకున్నోళ్ల నిర్లక్ష్యానికి.. సామూహిక ప్రార్థనల అలక్ష్యానికి యావత్ సమాజం మూల్యం చెల్లించుకోవలసిందేనా? ఒక్క రెండువారాలు అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తే.. కనిపించని మృత్యుక్రిమి.. కనిపించకుండానే పారిపోతుంది. ఎంతో అభివృద్ధి చెంది విర్రవీగుతున్న దేశాల అజాగ్రత్త కారణంగా కరోనా వాటిని ఎంత కల్లోలపరిచిందో చూశాం. రోజుల వ్యవధిలోనే వేలమందిని బలితీసుకొన్న వైనాన్నీ కంటున్నాం. ఇవన్నీ చూస్తూ కూడా మనం జాగ్రత్త పడకపోతే.. రాష్ట్ర ప్రభుత్వం జారీచేస్తున్న మార్గదర్శకాలను పాటించకపోతే.. మనల్ని మనం కరోనాకు బలిచేసుకొన్నవాళ్లమవుతాం. మనతోపాటు మన సమాజాన్నీ అల్లకల్లోలంచేసినవాళ్లమవుతాం. ప్రస్తుతం మనముందున్న కర్తవ్యమల్లా ఒక్కటే. స్వీయ నియంత్రణ అనుసరించటం. ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించడం. రెండే రెండువారాలు జాగ్రత్తగా ఉంటే.. మనల్ని ముప్పిరిగొన్న ముప్పునుంచి సురక్షితంగా బయటపడుతాం.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మనం ఇప్పుడు సంధి కాలంలో ఉన్నాం. ఒకవైపు కరోనా కథాకళి ఆడుతున్నది. మరోవైపు దాన్ని తిప్పికొట్టడానికి తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మనం చేయాల్సిన పనల్లా ఒక్కటే. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలకు మద్దతు పలుకడం. మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించడం. ఇందులో ఎంతమాత్రం తొట్రుపడినా.. తెలంగాణ మరో ఇటలీ, ఇరాన్, అమెరికా మాదిరిగా అతలాకుతలమవుతుంది. క్షణమాత్రంలో కోట్లమందికి వ్యాపించే వైరస్ సామూహిక మానవ హననానికి దారితీస్తుంది. విద్యావంతులు, అన్నీ తెలిసినవాళ్ల నిర్లక్ష్యం వల్లనే వ్యాప్తిచెందిన కరోనా వైరస్.. ఇప్పుడు అమాయకుల పాలిట ప్రాణసంకటంగా మారింది. అత్యంత

మిగతా 2వ పేజీలో

### దేశంలో 24 గంటల్లో కొత్తగా 450 కేసులు

### వణుకుతున్న ఏపీ

- బుధవారం ఒక్కరోజే 67 మందికి పాజిటివ్
- 111కి చేరిన కరోనా కేసులు



### ప్రేమ్‌జీ విరాళం 1,125 కోట్లు

12

### పరీక్షలు లేకుండానే పైతరగతులకు

- 8వ తరగతి వరకూ అవకాశం: సీబీఎస్‌ఈ
- 9, 11 తరగతులకు ఇంటర్నల్స్ ఆధారంగా

### జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష వాయిదా

7



### మారటోరియం తర్వాత బాదుడే!

- భారమంటున్న బ్యాంకులు
- వాయిదాకాలానికి వడ్డీ: ఎస్బీఐ
- అదనపు ఈఎంఐల ద్వారా వసూలు
- చెల్లింపులే శ్రేయస్కరం: హెచ్‌డీఎఫ్‌సీ
- విరామం కావాలంటే చెప్పాల్సిందే

12






### కరోనా వైరస్‌పై కనిపించని యుద్ధం

- కేసులెన్ని వచ్చినా వైద్యానికి ఏర్పాట్లు
- ముప్పూటలా సీఎం పర్యవేక్షణ
- ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం
- రాష్ట్రంలో సామూహిక వ్యాప్తి లేదు
- దేశానికే దిక్సూచిలా తెలంగాణ
- నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో మంత్రి ఈటల రాజేందర్


3

## కరంటోళ్లకు దండాలు

- లాక్‌డౌన్‌లోనూ విధుల్లో సిబ్బంది.. భారీగా డిమాండ్ పెరిగినా కోతల్లేవు
- 50,461 మంది శ్రమకు ఫలితం.. 31మంది ఎస్సెల్డీసీలో విధులు.. అక్కడే బస

ఓ వైపు మండుతున్న ఎండలు .. మరోవైపు లాక్‌డౌన్‌తో ఇండ్లకే పరిమితమైన ప్రజలు.. వర్క్ ఫ్రం హోంలు! టీవీ చూడాలి, ఫ్యాను తిరుగాలి, ఏసీ నడవాలి.. పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్ ఉంటేనే నీళ్లు! అన్నింటికి మించి కరోనాపై పోరాటంలో దవాఖానలు, పరిశోధన కేంద్రాలు నిరాటంకంగా నడవాలి. అంటే 24 గంటలూ కరంట్ ఉండాలి. కష్టాలను ఇష్టంగా స్వీకరిస్తున్న 50,461 మంది విద్యుత్ సిబ్బంది చేస్తున్న కనిపించని కఠోర శ్రమ ఫలితంగానే ప్రజలంతా ఇండ్లలో ఉండగలుగుతున్నారు! విద్యుత్‌శాఖకు గుండెకాయ లాంటి స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్సెల్డీసీ)లో పదిరోజులుగా ఉద్యోగులు స్వీయ నిర్బంధంలో ఉన్నారు. కరోనా సోకిందనే అనుమానంతో కాదు.. అసలుదాని బారిన పడకుండా ఉండేందుకే! పోలీసు, పారిశుద్ధ్య సిబ్బంది, వైద్యుల శ్రమ కనిపిస్తున్నది. కానీ బయటికి కనిపించకుండా నిరంతరం శ్రమిస్తూ కోతల్లేని విద్యుత్‌ను ఇంటింటికీ అందిస్తున్న కరంటోళ్లకు.. కృతజ్ఞతలు చెప్పాల్సిందే!

2



లాక్‌డౌన్-డే 10

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం | | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|---|---|---|
| హైదరాబాద్ | 38.2°c | 26.2°c | మెదక్ | 34.0°c | 24.0°c |
| కరీంనగర్ | 38.0°c | 24.0°c | ఆదిలాబాద్ | 36.4°c | 21.5°c |
| వరంగల్ | 38.5°c | 24.0°c | నిజామాబాద్ | 38.9°c | 25.5°c |
| రంగారెడ్డి | 37.0°c | 25°c | మహబూబ్‌నగర్ | 38.8°c | 25.3°c |
| నల్లగొండ | 39.0°c | 24.0°c | ఖమ్మం | 40.0°c | 26.0°c |



## రైస్ పాలసీ క్రెడిట్ సీఎం కేసీఆర్‌దే

- సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళమిచ్చిన రామోజీరావుకు కృతజ్ఞతలు
- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో రైస్ పాలసీ క్రెడిట్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. రైస్ పాలసీని తీసుకురావాలనే సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని అభినందిస్తూ అక్షయపాత్ర సహ వ్యవస్థాపకుడు మోహన్‌దాస్.. మంత్రి కేటీఆర్‌కు ట్వీట్‌చేశారు. చిన్న రాష్ట్రాలు సమర్థ నాయకత్వం ద్వారా మంచి పరిపాలనను అందిస్తున్నాయని కొనియాడారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్.. ఆ క్రెడిట్ అంతా సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్.. ఒడిశా రాష్ట్ర ప్రజలకు 85వ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అత్యద్భుతమైన సంస్కృతి సంప్రదాయాలు, వారసత్వ సంపద ఉన్న రాష్ట్రమని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ట్విట్టర్ ద్వారా ఆకాంక్షించారు. కరోనా వైరస్‌పై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పోరుకు మద్దతుగా నిలిచి సీఎం సహాయనిధికి రూ.10 కోట్లు విరాళం ప్రకటించిన రామోజీ సంస్థల అధిపతి రామోజీరావుకు కృతజ్ఞతలు తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వివిధ జిల్లాల్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కూలీలకు, వలస జీవులకు అండగా నిలుస్తున్నవారిని అభినందించారు. మంత్రి కేటీఆర్ ఎప్పటికప్పుడు సాయం కోరినవారికి స్పందిస్తూ అండగా నిలుస్తున్నారు. అడగగానే తమను ఆదుకున్నందుకు అనేకమంది ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

## సీసీఎంబీలో 260 కరోనా పరీక్షలు

- గంటకు 50 నిర్ధారణ టెస్టులు చేసే సామర్థ్యం
- ఇతర రాష్ట్రాల శాంపిళ్లనూ పరీక్షించేందుకు సిద్ధం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ).. కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలను ముమ్మరం చేసింది. మంగళ, బుధవారాల్లో దాదాపు 260 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు పూర్తిచేసింది. గాంధీ, ఉస్మానియా దవాఖానల నుంచి వస్తున్న శాంపిళ్లను సీసీఎంబీలోని 12 రియల్ టైమ్ పీసీఆర్‌ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. సీసీఎంబీకి గంటకు 50 కరోనా నిర్ధారణ పరీక్షలు చేసే సామర్థ్యం ఉన్నది. సీసీఎంబీలో నిర్ధారణ పరీక్షలు మొదలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వానికి మరింత వెసులుబాటు లభించింది. ఇతర రాష్ట్రాల శాంపిళ్లను కూడా పరీక్షించడానికి సీసీఎంబీ సిద్ధంగా ఉన్నది. సంస్థ డైరెక్టర్ రాకేశ్‌మిశ్రా ఆధ్వర్యంలో కొవిడ్ జన్యుక్రమాన్ని కనుగొనడానికి కూడా శాస్త్రవేత్తల బృందం సన్నాహాలు చేస్తున్నది.

## పూర్తి వేతనాలు

మొదటిపేజీ తరువాయి...

పరిస్థితుల్లో కరోనా మహమ్మారిని పారదోలడానికి అహరహం శ్రమిస్తున్న వీరి రుణం తీర్చుకోలేనిదైనా.. వీరి సేవలకు గుర్తింపుగా ప్రోత్సాహకాలు ఇవ్వాలని కూడా సీఎం నిర్ణయించారు. ఈ ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకట్రెండు రోజుల్లో స్వయంగా ప్రకటించనున్నారు. కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యలు.. ఇతర అంశాలపై బుధవారం సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### లోకం పోకడ




తాటకిని ఒక్కేటున కూల్చావు, రావణుడిని వధించావు, అలాగే కరోనాను సంహరించు తండ్రీ!

# కరంటోళ్లకు దండాలు

- లాక్‌డౌన్‌లోనూ విధుల్లో సిబ్బంది, కార్మికులు
- డిమాండ్ పెరిగినా కోతల్లేవు
- 50,461 మంది శ్రమ ఫలితం
- నిర్బంధంలోనే 31 మంది విద్యుత్ ఉద్యోగులు
- ఎస్‌ఎల్డీసీలో విధులు.. బస



స్వీయ నిర్బంధంలో ఉండి ఎస్‌ఎల్డీసీ కంట్రోల్‌రూంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ వ్యాప్తంగా 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించేందుకు 50,461 మంది ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది, ఇంజినీర్లు, ఆర్టిజన్లు శ్రమిస్తున్నారు. సుమారు 6 లక్షల కిలోమీటర్ల విద్యుత్ లైన్లను, 348 ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లను, 33 కేవీ సామర్థ్యం ఉన్న 3,026 సబ్‌స్టేషన్లను, 7.28 పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. 24.3 లక్షల వ్యవసాయ, 1.1 కోట్ల గృహ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా శ్రమిస్తున్నారు. 21 రోజులకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన తొమ్మిది లక్షల టన్నుల బొగ్గు, ఆయిల్‌ను సమకూర్చుకొన్నారు. రాష్ట్రంలో 1.54 కోట్ల విద్యుత్ వినియోగదారులున్నారు. వీరిలో 1.1 కోట్ల మంది గృహవినియోగదారులే. లాక్‌డౌన్‌లో కారణంగా ప్రజలంతా ఇండ్లలోనే ఉంటున్నందున 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు. యాసంగి పంట చేతికొచ్చే సమయంలో 24.3 వ్యవసాయ కనెక్షన్లకు 24 గంటలు విద్యుత్ అందిస్తున్నారు. ఉత్పత్తి కేంద్రాల్లో ఆటంకాలు రాకుండా..అత్యధిక పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్‌ఫ్యాక్టర్)తో విద్యుత్ ఉత్పత్తిచేస్తూ గృహ, వ్యవసాయ రంగాలకు 24 గంటలపాటు విద్యుత్ అందించడంలో అప్రమత్తంగా ఉన్నారు.


### ఆదాయం కోల్పోతున్నా ఆగని ఉత్పత్తి

రాష్ట్రంలో మొత్తం విద్యుత్ కనెక్షన్లలో దాదాపు 20 లక్షల వరకు ఉన్న పరిశ్రమలు, వాణిజ్య వినియోగదారుల నుంచి ప్రతి నెలా విద్యుత్ సంస్థలకు సుమారు రూ.1350 కోట్ల ఆదాయం వస్తున్నది. లాక్‌డౌన్‌తో పరిశ్రమలు మూతపడి వాణిజ్య వినియోగదారుల నుంచి వచ్చే ఆదాయం ఆగిపోయింది. మరోవైపు ప్రజలు ఇండ్లకే పరిమితమవడంతో డిమాండ్ పెరిగింది. 2019 మార్చిలో దాదాపు 10 వేల మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉండగా, పరిశ్రమలు మూతపడిన ప్రస్తుత పరిస్థితుల్లోనూ అంతే డిమాండ్ ఉన్నది. ఆదాయం తగ్గిపోయినప్పటికీ, ప్రభుత్వం ఇస్తున్న భరోసాతో విద్యుత్‌సంస్థలు ముందుకుసాగుతున్నాయి. సాధారణంగా ఏటా మార్చినెలలో అకాలవర్షాలు, గాలి దుమారాలతో విద్యుత్‌వ్యవస్థ దెబ్బతింటుంది. విద్యుత్‌స్థంభాలు నేలకూలి, కరంటు తీగలు తెగిపడుతాయి. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ ముందుజాగ్రత్తగా 50 వేల విద్యుత్‌స్థంభాలను సిద్ధంగా ఉంచారు. రాత్రీపగలనే తేడాలేకుండా ఎక్కడ ఇబ్బంది వచ్చినా మరమ్మతులు చేయాలని కిందిస్థాయి ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి.

### స్వీయ నిర్బంధంలో ఎస్‌ఎల్డీసీ

రాష్ట్రం మొత్తానికి విద్యుత్ సరఫరాతోపాటు దక్షిణాది గ్రిడ్‌లో వైఫల్యం రాకుండా చూసే స్టేట్ లెవల్ డిస్పాచ్ సెంటర్ (ఎస్‌ఎల్డీసీ) కార్యాలయం స్వీయనిర్బంధంలో ఉన్నది. విద్యుత్‌సౌధలోని ఎస్‌ఎల్డీసీలో విధులు నిర్వర్తిస్తున్న 31 మందికి పక్కనే ఉన్న గెస్ట్‌హౌజ్ ఇప్పుడు ఇల్లులా మారింది. ఎస్‌ఎల్డీసీలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 31 మంది 12 గంటల చొప్పున రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఒక షిఫ్ట్‌లో కొందరు పనిచేస్తే.. రెండో షిఫ్ట్‌వాళ్లు గెస్ట్ హౌజ్‌లో ఉండాలి. బయటివారిని కలిసేందుకు వీల్లేదు. భోజన వసతి అక్కడే. వీరికి నిత్యం రెండుసార్లు థర్మల్ స్క్రీనింగ్ చేస్తున్నారు. ఏ ఒక్కరికి కరోనా సోకినా ఎస్‌ఎల్డీసీ సీజ్‌చేయాల్సి వస్తే, రాష్ట్రంలో విద్యుత్ సరఫరాతోపాటు, దక్షిణాది గ్రిడ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్నది. అందుకే ఈ జాగ్రత్తలు. ప్రతి నాలుగు రోజులకు పదిమందిని ఇంటికి పంపినా గృహనిర్బంధంలో ఉండాలని హెచ్చరిస్తున్నారు.

### ఏకతాటిపై పోరాటం



కరోనా ధాటికి అన్నిరంగాలు తలకిందులవుతున్నాయి. ప్రజలను కాపాడేందుకు ముఖ్యమైనశాఖలు యుద్ధప్రాతిపదికన పనిచేయాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు సూచనలతో పోరాటానికి సిద్ధమయ్యాం. రాష్ట్రంలో ఎక్కడా కరంటు పోకుండా యాభైవేల మందికిపైగా ఉద్యోగులు, కార్మికులు, ఇంజినీర్లు, సిబ్బంది విపత్కర పరిస్థితుల్లో 24 గంటల విద్యుత్‌ను అందించడానికి శ్రమిస్తున్నారు.

–డీ ప్రభాకర్‌రావు, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ

## అదిగో.. స్వీయ గృహ నిర్బంధకులు!

- దగ్గరలో ఉండగానే ఫోన్‌కు సమాచారం
- రెండ్రోజుల్లో హాక్‌ఐలో మరో కొత్త ఫీచర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్వీయ గృహ నిర్బంధకులపై పోలీసులు సాంకేతికంగా మరింత నిఘా పెంచారు. వారు బయట తిరిగితే తెలిసేలా హాక్‌లో సరికొత్త ఫీచర్‌ను తీసుకురానున్నారు. రాష్ట్రంలో స్వీయ గృహనిర్బంధంలో ఉన్న 22 వేల మందికిపైగా ఇండ్లకు ఇప్పటికే జియోట్యాగ్ చేశారు. ఈ వివరాలను టీఎస్‌కాప్ పోలీస్ యాప్‌తో జతచేయడంతో వారిపై నిరంతరం నిఘా కొనసాగుతున్నది. పోలీసులు ఆయా ఇండ్లకు వెళ్లి నిత్యం పరిశీలిస్తూనే ఉన్నారు. కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకొనేలా ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను స్వీయ గృహ నిర్బంధంలోనివారి మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేస్తారు. ఈ సమాచారాన్ని పోలీసుల అంతర్గత విధుల్లో వినియోగించే టీఎస్‌కాప్, పోలీస్ కంట్రోల్ రూంకు జతచేయనున్నారు. దీన్ని పౌరసేవలకు వినియోగిస్తున్న హాక్‌ఐ మొబైల్ యాప్‌తోనూ లింక్ చేయనున్నట్టు తెలిసింది. హాక్‌ఐలో క్వారంటైన్ ఏరియా అలర్ట్ పేరిట కొత్త ఫీచర్‌ను తీసుకొస్తున్నారు. దీంతో స్వీయ గృహ నిర్బంధంలో ఉన్నవారు 50 మీటర్ల దూరంలో ఉండగానే ఈ యాప్ ద్వారా ఫోన్‌కు ఒక అలర్ట్ వస్తుంది. ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు మనం మరింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఏర్పడుతుంది. ఈ సదుపాయాన్ని రెండ్రోజుల్లో అందుబాటులోకి తేనున్నట్టు ఓ పోలీస్ అధికారి తెలిపారు.

## 22 బొగ్గు గనుల్లో లేఆఫ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు సింగరేణి కూడా 22 భూగర్భ గనుల్లో ఈ నెల 14వ తేదీ వరకు లేఆఫ్ ప్రకటించింది. బుధవారం మిడిల్ షిఫ్ట్ నుంచి లేఆఫ్ విధించినట్టు యాజమాన్యం తెలిపింది. మొత్తం 27 భూగర్భ గనులకుగాను.. అడ్రియాల లాంగ్ వాల్, వీకే-7 ఇంక్లైన్, శాంతిఖని, జీడీకే-11ఏ ఇంక్లైన్, కొండాపూర్ గనులను పూర్తిగా యాంత్రీకరణ చేయడంతో వీటిని మినహాయించారు. దీంతో 22 వేల మంది కార్మికులు ప్రభావితమవుతారు. అన్ని ఓసీల్లో ఉత్పత్తి యథాతథంగా కొనసాగుతుందని, ఉత్పత్తి జరిగే 5 మెకనైజ్డ్ గనులతోపాటు డిపార్ట్‌మెంట్లలో శానిటైజర్లు, మాస్కులు అందుబాటులో ఉంచుతున్నారు.

# రెండు వారాలు కీలకం

మొదటిపేజీ తరువాయి...

ప్రమాదకరంగా మారిన ఇవాల్టి పరిస్థితులను ప్రతి ఒక్కరూ గ్రహించాల్సిన అవసరం ఉన్నది. మనల్ని మనం కాపాడుకొంటూ.. సమాజాన్ని సురక్షితం చేయాల్సిన బాధ్యత ఉన్నది. సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా వైరస్ వ్యాప్తిచెందకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొన్నారు. ఒక్క రెండువారాలపాటు అందరూ ఎంచక్కా కుటుంబంతో ఇంటికే పరిమితమైతే.. తర్వాత రోజులన్నీ మనవే.



హైదరాబాద్ ఎస్సార్ నగర్‌లో రేషన్ బియ్యం కోసం నిర్ణీత దూరంలో వేచిచూస్తున్న వలస కార్మికులు

### మన పరిస్థితి ఏమిటి?

ఇండియాలో జనవరి 30న మొదటికేసు నమోదయింది. మార్చి2 నాటికి, అంటే మొదటి ఆరువారాల్లో నమోదైన కేసులు మూడే కావడం గమనార్హం. ఆరో వారానికి 43కు పెరిగాయి. ఏడో వారానికి 114 కేసులు నమోదు కాగా, ఇద్దరు మరణించారు. ఎనిమిదో వారానికి 415కి సంఖ్య చేరగా ఏడుగురు మృతిచెందారు. తొమ్మిదో వారం వచ్చేసరికి ఏకంగా 1,071 మందికి వ్యాపించింది. 29 మంది మాత్రమే మరణించారు. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల సంఖ్య 1,637కి చేరినట్లు కేంద్రం ప్రకటించింది. 1,466మందికి చికిత్స కొనసాగుతుండగా 38 మంది మరణించారు. పరిస్థితులను గమనించి కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతోపాటు లాక్‌డౌన్‌ను దేశమంతటా కచ్చితంగా అమలు చేయడం వల్ల కొంత నియంత్రణకు వచ్చింది. మార్చి 1 నుంచి 22 వరకు విదేశాల నుంచి వచ్చినవారిని జీపీఎస్ వ్యవస్థ ద్వారా ట్రాక్‌చేసి గుర్తించి క్వారంటైన్‌కు పంపించారు. వారితోపాటు కుటుంబసభ్యులు, సన్నిహితులను కూడా హోం క్వారంటైన్‌లో ఉంచారు. ఓ పక్క కరోనా కట్టడి చర్య లు కొనసాగుతుండగానే వాటిని గుర్తించకుండా.. ప్రమాదాన్ని గ్రహించకుండా ఢిల్లీలోని తబ్లిగి జమాత్‌లోని మర్కజ్‌లో వేల జనం గుమిగూడి మత కార్యక్రమంలో పాల్గొనడం.. వారు వేర్వేరు రాష్ట్రాలకు తిరిగి వెళ్లడంతో వైరస్‌వ్యాప్తి ఆందోళనలు మరింత పె రిగాయి. వీరందరినీ గుర్తించడం కష్టంకావడంతో కరోనా వ్యాప్తి ఏస్థాయిలో ఉంటుందో అంచనా వేయడమే కష్టమే. ఇప్పుడు మరింత జాగ్రత్తగా మెలగాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండ్లనుంచి బయటకు రాకుండా ఉండాలి.

### అగ్రరాజ్యాలు అతలాకుతలం

కరోనా మహమ్మారిని కట్టడిచేయడంలో సంపన్న దేశాలు తమ నిర్లక్ష్యానికి భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చింది. అమెరికా, ఇటలీ, స్పెయిన్, ఇరాన్ వంటి దేశాల్ని గమనిస్తే.. ప్రజలంతా విచ్చలవిడిగా తిరగడం వల్ల కరోనా కరాళనృత్యం చేసింది. 2019 డిసెంబర్ 31న.. చైనా నుంచి డబ్ల్యూహెచ్‌వోకు ఒక సమాచారం అందింది. తమదేశంలో కొత్తరకమైన న్యుమోనియా లక్షణాలు ప్రజల్లో కనిపిస్తున్నట్టు తెలియజేసింది. 2020 జనవరి 3 నాటికి 44 మందికి సోకింది. తర్వాత, అది వుహాన్ నుంచి థాయ్‌లాండ్, దక్షిణకొరియా, జపాన్‌కు పాకింది. జనవరి 20 నాటికి హ్యూబే ప్రావిన్స్, గ్వాంగ్డాంగ్, బీజింగ్, షాంఘైలలో 280 కేసులు నమోదు కాగా, వుహాన్‌లో ముగ్గురు మృత్యువాతపడ్డారు. వుహాన్‌కు వచ్చిన అమెరికా పౌరుడికి జనవరి 23న కరోనా సోకింది. ఆస్ట్రేలియాలోనూ ఇలాంటి కేసే నమోదయింది. డబ్ల్యూహెచ్‌వో ప్రపంచమంతా హై అలర్ట్‌ని ప్రకటించేసరికి జరగాల్సిన నష్టం జరిగింది.

### ఫ్రాన్స్ పరేషాన్

జనవరి 25న ఫ్రాన్స్‌లో కరోనా అడుగుపెట్టింది. నాలుగు వారాల్లోపు 12 కేసులు నమోదైతే ఒక వ్యక్తి మరణించగా.. మరో రెండువారాలకు కేసుల సంఖ్య వందకు పెరిగింది. ఇద్దరు వ్యక్తులు మరణించారు. 11 వారాలు దాటేసరికి కరోనా బాధితుల సంఖ్య 43,977కి చేరగా 3,017 మంది మరణించారు.

### కరోనాలోనూ అగ్రరాజ్యమే..

అమెరికాలో జనవరి 23న కరోనా వ్యాపిస్తే.. ఆతర్వాతి ఐదువారాల్లో అక్కడ నమోదైన కేసులు పదిహేనే. ఆరు వారాల్లో 35 కేసులు నమోదయ్యాయి. మొట్టమొదటగా ఒక వ్యక్తి మృతిచెందాడు. ఏడోవారానికి అమెరికాలో 62 కేసులు నమోదైనా మరెవరూ చనిపోలేదు. కానీ ఆ తర్వాత అత్యంత వేగంగా విస్తరించింది. మార్చి 31 నాటికి అగ్రరాజ్యంలో 1,40,640 మందికి కరోనా సోకితే 2,398 మంది మరణించారు.

- అమెరికాలో మొదటి కరోనా కేసు: జనవరి 23
- ఫిబ్రవరి 24 నాటికి 35 కేసులు, ఒక వ్యక్తి మృతి
- మార్చి 23 నాటికి 31,573 కేసులు, 402 మృతి
- మార్చి 30 నాటికి 1,22,653కి సోకితే 2112 మృతి
- మార్చి 31 నాటికి (పదకొండో వారం నాటికి) 1,40,640కి సోకితే 2,398 మరణించారు.

### ఇంతింత కాదయా ఇటలీ బాధలు

మెరుగైన వైద్యవిధానానికి పేరున్న ఇటలీలో జనవరి 31న తొలికేసు నమోదైంది. ఫిబ్రవరి 24 కల్లా 124 మంది బాధితులయ్యారు. ఐదోవారంలో ఒక్కసారిగా అక్కడ కేసులు పెరిగాయి. అక్కడి ప్రభుత్వం జారీచేసిన హెచ్చరికలను ప్రజలు పెడచెవిన పెట్టారు. ఫలితంగా 1,01,739 మంది కరోనా బారినపడగా 11,591 మంది మృతిచెందారు.

- **ఇటలీ:** మొదటి కరోనా కేసు: 31 జనవరి
- **మూడువారాల్లోపు:** 3 కేసులే
- **5వవారం:** 1,689కి సోకగా 35 మంది మృతి.
- **6వ వారం:** 7,375 మంది, 366 మంది మృతి.
- **7వవారం:** 24,747 మంది, 1,809 మంది మృతి.
- **8వవారం:** 59,138 మందిలో 5,476 మంది మృతి
- **9వవారం:** 97,689కి సోకితే 10,781 మంది మృత్యువాతపడ్డారు.
- **మార్చి 31:** 1,01,739కి సోకితే 11,591 మంది మృతి.

### ఇరాన్‌లో ఘోరం

ఫిబ్రవరి 19న ఇరాన్‌లో కరోనా బయటపడగా.. మూడువారాల్లోనే 194 మందిని కబళించివేసింది. నాలుగోవారానికి 14,991 మందికి సోకగా 853 మంది చనిపోయారు. ఐదోవారంలో 21,638 మందికి సోకగా 1685 మంది మరణించారు. ఏడో వారం 41,495 మందికి సోకగా 2,757 మంది మృతి.

### మనమేం చేయాలి?

అమెరికా, యూరప్, యూకే తో పోలిస్తే ఇప్పటికే స్వీయనియంత్రణ ద్వారా కరోనాను కట్టడి చేయగలిగాం. మరో రెండువారాలు మనకెంతో కీలకమని గుర్తుంచుకోవాలి. తప్పకుండా స్వీయనియంత్రణను పాటించాలి. ఇంట్లో నుంచి బయటికి రాకుండా జాగ్రత్తపడాలి. ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా మనదేశంలో కూడా శవాలదిబ్బలు కనిపించే ప్రమాదం లేకపోలేదు. గత కొంతకాలం నుంచి అమెరికా, ఇటలీ, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, ఇరాన్ వంటి దేశాల్లో ప్రజలు మృతి చెందడానికి ప్రధాన కారణం.. ఒకరి నుంచి మరొకరికి కరోనా సోకడమే. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుని ఎవరికి వారే స్వీయ నియంత్రణను మరో రెండువారాలు పాటిస్తే.. కరోనా మహమ్మారిని తరిమికొట్టడంలో విజయం సాధిస్తాం.

### విద్యావంతుల బాధ్యతారాహిత్యం

బాగా చదువుకుంటారు. పైగా వైద్యవృత్తిలో కొనసాగుతుంటారు. ఏ జబ్బు వల్ల ఎలాంటి పరిణామాలుంటాయో అందరికంటే వారికే ఎక్కువగా తెలుస్తాయి. ఎలాంటి జాగ్రత్తలు తీసుకొంటే.. నియంత్రించవచ్చో చెప్పాల్సింది కూడా వారే. బాధ్యతాయుతమైన వైద్యవృత్తిలో ఉన్నవారే నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫలితం పదులమందికి కరోనాను అంటించేశారు. కేవలం వైద్య వృత్తిలో ఉన్నవారే కాదు.. ఇతర రంగాల్లో ఉన్నత విద్యావంతులు కూడా మేం హైజీన్.. మాకేమైతుందిలే అన్న ధోరణితో తిరుగటం వల్ల కరోనా వ్యాప్తిని నిరోధించడంకోసం కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు కనాకష్టంపడుతున్నాయి. మనదేశంలోకి కరోనా ప్రవేశించిందే విదేశాలనుంచి వచ్చిన విద్యావంతుల వల్లేనని నిర్వివాదం. ఇవాళ వీరి నిర్లక్ష్యానికి దేశం, మన రాష్ట్రం మూల్యం చెల్లించాల్సి వస్తున్నది. గ్రామీణులు, సామాన్యులు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. కరోనా సోకకుండా ఎలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలో మార్గదర్శనం చేయాల్సిన వారే అలసత్వంగా వ్యవహరించడం బాధాకరం. సామాజిక సమస్యల నుంచి అధునాతన టెక్నాలజీ వరకు అన్నీ తెలిసినవారు.. బాగా అవగాహన ఉన్నవారు.. అన్నింటికీ మించి కరోనా గురించి పూర్తిగా తెలిసినవారి వల్లనే ఈ వైరస్ విశృంఖలంగా వ్యాప్తి చెందింది.

### స్పెయిన్‌లో మృత్యుహేల..

ఫిబ్రవరి 1న స్పెయిన్‌లో మొదటి కేసు వచ్చింది. తొమ్మిది వారాల వ్యవధిలో 7,500 మందిని కబళించేసింది. ఫిబ్రవరిలో ఇక్కడ కరోనా సోకింది ఇద్దరికే. మార్చి 2 నాటికి 45 మందికి సోకింది. ప్రభుత్వం చెప్తున్నా ప్రజలు పట్టించుకోకపోవడం, తమకేం కాదులే అనే నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో కరోనా తానెంత ప్రమాదకారో చూపెట్టింది. ప్రస్తుతం 85,195 మందికి వైరస్ సోకగా 7,340 మంది మరణించారు. చివరకు స్పెయిన్ యువరాణి కూడా కరోనాకు బలైపోయింది.

- **స్పెయిన్:** మొదటి కరోనా కేసు: ఫిబ్రవరి 1
- **నాలుగువారాల్లోపు:** రెండు కేసులే
- **ఐదోవారం:** 45 మందికి సోకింది.
- **ఆరోవారం:** 589 మంది, 10 మంది మరణం
- **ఏడోవారం:** 7753 మంది, 288 మృతి
- **ఎనిమిదోవారం:** 28,572 మందిలో 1,720 మంది మృతి
- **తొమ్మిదోవారం:** 78,797 మందిలో 6,549 మంది మృతి
- **పదోవారం:** (మార్చి 31 నాటికి) 85,196 మందికి సోకితే 7,340 మంది మృతి.

# ఢిల్లీ నుంచే తాజా లొల్లి

మొదటిపేజీ తరువాయి...

హితవుచెప్పారు. వారు నిర్లక్ష్యంచేస్తే అది వారి ప్రాణాలకే కాకుండా, ఇతరులకు కూడా శాపంగా మారుతుందన్నారు. సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులపై రెండుమూడుసార్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీ ప్రార్థనల్లో పాల్గొని వచ్చినవారి సమాచారం సేకరించడంలో జాప్యంపై అసహనం వ్యక్తంచేశారు. అత్యంత సుదీర్ఘం సమావేశంలో కరోనా వైరస్‌పై పోరాటంలో పాల్గొంటున్న ప్రతి విభాగాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించారు. సంబంధిత అధికారులందరితోనూ కూలంకషంగా చర్చించారు. ఇప్పుడు ఏ పరిస్థితిలో ఉన్నాం, రాబోయేరోజుల్లో వైరస్ తీవ్రత ఏ రకంగా ఉండబోతున్నదో అంచనావేశారు. మంత్రులు, ఉన్నతాధికారులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది మరింత జాగరూకతతో, అప్రమత్తతతో వ్యవహరించక తప్పదని హెచ్చరించారు. కరోనా వైరస్‌పై పోరాటానికి యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను తాను ప్రతిక్షణం గమనిస్తున్నానని, ఎవరూ ఎలాంటి అలక్ష్యం చూపకూడదని ముఖ్యమంత్రి కేసీఆర్ హితవు చెప్పారు.

### ఒక్కరోజే 30 మందికి పాజిటివ్

రాష్ట్రంలో బుధవారం ఒక్కరోజే 30 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని సీఎం కేసీఆర్ తెలిపారు. తాజాగా మూడు మరణాలు సంభవించాయని, వీరంతా ఢిల్లీ నిజాముద్దీన్ తబ్లిగీ జమాత్‌లోని మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా వ్యాప్తిని నివారించడానికి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. బుధవారం గాంధీలో ఇద్దరు, యశోదా హాస్పిటల్‌లో ఒకరు మరణించారు. దీంతో ఇప్పటివరకు తెలంగాణలో మరణించిన వారిసంఖ్య తొమ్మిదికి చేరింది. బుధవారం వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిన 30 మంది, మరణించిన ముగ్గురూ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారేనని తేలింది. గతంలో మరణించిన ఆరుగురు కూడా మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారే. మొదట్లో విదేశాల నుంచి వచ్చిన వారిలో కొందరికి, వారిద్వారా మరి కొంతమందికి వైరస్ సోకింది. వారంతా క్రమంగా కోలుకొంటున్నారు. వారిలో చాలా మంది డిశ్చార్జి అయ్యారు. వారిలో ఎవరి పరిస్థితి ఆందోళనకరంగా లేదు, చనిపోలేదు. కొద్దిరోజులుగా నమోదవుతున్న పాజిటివ్ కేసులన్నీ మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారివిగానే తేలాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వం మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారందరికీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించింది. కొందరికి ఇప్పటికే పరీక్షలు నిర్వహించింది. మరో 300 మందికి వైద్య పరీక్షలు జరుపాల్సి ఉన్నది. మర్కజ్‌కు వెళ్లి వచ్చినవారు, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితంగా ఉన్నవారు ఇంకా ఎవరైనా వైద్య పరీక్షలు నిర్వహించుకోకుండా ఉంటే వెంటనే దవాఖానకు వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలని ప్రభుత్వం కోరుతున్నది. మర్కజ్‌కు వెళ్లివచ్చినవారికి సోకిన వైరస్ ప్రమాదకరంగా మారుతున్నది కాబట్టి, వారంతా తప్పక పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం సూచిస్తున్నది. దవాఖానలో పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల వైరస్ సోకినట్టు తేలినా, వారి ప్రాణాలు కాపాడడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంది. ఇది వారికి, వారి కుటుంబానికి శ్రేయస్కరం కాబట్టి, మర్కజ్ వెళ్లి వచ్చిన ప్రతి ఒక్కరూ తప్పక పరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వం కోరుతున్నది.

### ప్రజలు సహకరించాలి: కేసీఆర్

కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నిర్వహిస్తున్న లాక్‌డౌన్‌ను ప్రజలు విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోరారు. మరికొన్ని రోజులపాటు ప్రజలు సహకరిస్తే, రాష్ట్రంలో వైరస్‌వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కరోనా వైరస్ బాధితులకు వైద్యం అందిస్తున్న వైద్యసిబ్బంది భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని వెల్లడించారు. వైద్యసిబ్బందికి అవసరమైన పీపీఈ కిట్స్, ఎన్-95 మాస్కులు, హైడాక్సీ క్లోరోక్విన్ మాత్రలు, అజిత్రో మైసిన్ టాబ్లెట్లు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. వైద్య పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన మెడికల్ కిట్లను కూడా సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు. వ్యాధి వచ్చిన వారికి చికిత్స అందించడానికి, వైద్యం అందిస్తున్న సిబ్బంది భద్రతకు వైరస్ వ్యాప్తిచెందకుండా ఉండేందుకు కావాల్సిన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నదని సీఎం కేసీఆర్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతకుమారి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గవర్నర్‌తో సీఎం భేటీ

సీఎం కేసీఆర్ బుధవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ అమలు తదితర అంశాలపై చర్చించారు. గురువారం రాష్ట్రపతితో గవర్నర్‌కు, ప్రధానమంత్రితో ముఖ్యమంత్రికి వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందున రాష్ట్రంలో చేపట్టిన చర్యలపై ఇద్దరూ చర్చించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి
meesevasupport@telangana.gov.in
ఖాతా నంబర్ : 62354157651
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077
ఎస్‌బీఐ, సెక్రటేరియట్ బ్రాంచ్, హైదరాబాద్.
వాట్సాప్: 9121006471 / 9121006472
https://ts.meeseva.telangana.gov.in/covid/covidcontribution.htm




రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన కార్మికులు సీఎంఆర్ఎఫ్‌కు రూ.2.65 కోట్ల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన కాన్సెంట్ లెటర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హనుమాండ్లు బుధవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేశారు.


సీఎంఆర్ఎఫ్‌కు నవభారత్ వెంచర్స్ సంస్థ రూ.2.5 కోట్ల విరాళం ప్రకటించింది. ఆ సంస్థ చైర్మన్ డీ అశోక్, సీఈవో వీ విక్రమ్‌ప్రసాద్, ఈడీ నిఖిల్ ఆ చెక్కును సీఎం కే చంద్రశేఖర్‌రావుకు అందజేశారు.


ముఖ్యమంత్రి సహాయ నిధికి గ్లాండ్ ఫార్మా కోటి రూపాయల విరాళం అందించింది. ఇందుకు సంబంధించిన రూ.కోటి చెక్కును గ్లాండ్‌ఫార్మా ఎండీ శ్రీనివాస్ సాదు సీఎం కేసీఆర్‌కు అందజేశారు.


ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సీఎంఆర్ఎఫ్‌కు రూ.50 లక్షల విరాళం అందించింది. ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ డాక్టర్ డీవీఎస్ రాజు చెక్కును సీఎం కేసీఆర్‌కు అందించారు.

## సీఎంఆర్ఎఫ్‌కు వచ్చిన విరాళాలు

- మహేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రతినిధులు రమేశ్‌కుమార్, పురుషోత్తం, ఉమేశ్‌చంద్ 50 లక్షల చెక్కును మంత్రి నిరంజన్‌రెడ్డికి అందజేశారు.
- నిజామాబాద్ జిల్లాకు చెందిన కిసాన్ క్లాత్‌షోరూం యజమాని ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త పీఎం, సీఎం సహాయనిధికి రూ.5 లక్షల చొప్పున చెక్కులను కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేశారు.
- మంచిర్యాలకు చెందిన శ్రీనివాసలక్ష్మి కన్‌స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టర్ రవీందర్‌రావు రూ.5 లక్షలు, రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నజీర్ అహ్మద్ రూ.50వేల చెక్కును అదనపు కలెక్టర్‌కు ఇవ్వగా.. చెన్నూర్ మండలం కిష్టంపేటకు చెందిన కలకొండ సుబ్బారావు రూ.1,11,116లను సీఎంఆర్ఎఫ్‌కు ఆన్‌లైన్‌లో పంపించారు.

**పేదలకు బాసటగా అన్నదానం**

- హైదరాబాద్‌లోని వాసవి, వైశ్య, గుజరాతి, మార్వాడి సేవాసంస్థలు 20 వేల మంది పేదలకు నెలపాటు భోజనసదుపాయం కల్పించాలని నిర్ణయించాయి. బుధవారం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌తో కలిసి మంత్రి తలసాని ఆహారం అందజేశారు.
- పేదలకు భోజనం అందజేస్తున్న హరేకృష్ణ ఫౌండేషన్‌కు తెలంగాణ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ 21 లక్షలు అందించింది.
- ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి కుటుంబం అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు 10 కోట్ల విరాళాన్ని ప్రకటించారు.
- తెలుగురాష్ట్రాల్లో రూ.2.5 కోట్లతో 5 వేల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరాలను పంపిణీ చేస్తున్నట్టు 'కల్వారి' సతీశ్‌కుమార్ తెలిపారు.

**పీఎం కేర్స్ ఫండ్‌కు బీడీఎల్ 9.02 కోట్లు**

ప్రధానమంత్రి సహాయనిధి పీఎం- కేర్స్‌ఫండ్‌కు భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) రూ.9.02 కోట్లు విరాళంగా ప్రకటించింది. బీడీఎల్ ఉద్యోగుల ఒకరోజు వేతనంతోపాటు, బీడీఎల్ సీఎస్సార్‌ఫండ్స్ నుంచి ఈ మొత్తాన్ని జమచేసినట్టు బీడీఎల్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది.

# వైరస్ కట్టడికి కఠిన చర్యలు

**రక్కసి నుంచి ప్రజల రక్షణకు కృషి • కేసులను చాలావరకు కట్టడి చేశాం**

**పేదలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు.. గవర్నర్‌తో సీఎం కే చంద్రశేఖర్‌రావు**

**రాజ్‌భవన్‌లో తమిళిసై సౌందర్‌రాజన్‌తో భేటీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం మొదటినుంచీ కఠిన చర్యలు తీసుకుంటున్నదని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. గవర్నర్‌కు తెలిపారు. కరోనా రక్కసి నుంచి రాష్ట్ర ప్రజలను రక్షించడానికి నిరంతరం శ్రమిస్తున్నదని చెప్పారు. బుధవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌తో ఆయన భేటీ అయ్యారు. రాష్ట్రంలో జనతా కర్ఫ్యూ మొదలు.. లాక్‌డౌన్ అమలు వరకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా గవర్నర్‌కు వివరించారు. లాక్‌డౌన్‌లో పేదవారెవరూ ఆకలితో అలమటించకుండా నిత్యావసరాలను, ఆహారాన్ని పంపిణీ చేస్తున్నట్టు సీఎం కేసీఆర్ తెలిపారు. నగదు కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నట్టు చెప్పారు. ప్రజల్లో చైతన్యం తేవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించాయని, కేసులను చాలావరకు కట్టడి చేయగలిగామని పేర్కొన్నారు. కానీ, ఢిల్లీ మర్కజ్‌లో జరిగిన ప్రార్థనల్లో తెలంగాణ నుంచి వెయ్యిమందికిపైగా పాల్గొనడం, వారిలో కొందరికి పాజిటివ్ రావడం కలవరపెట్టిందని వివరించారు. వెంటనే అప్రమత్తమై అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరిని క్వారంటైన్‌కు పంపినట్టు చెప్పారు. పోలీసులు, వైద్యులు, ఇతర సిబ్బంది అహర్నిశలు కృషిచేస్తున్నారని, ప్రాణనష్టం జరుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ శరవేగంగా వ్యాపిస్తున్నందున దేశ, రాష్ట్ర ప్రజలను రక్షించుకోవడానికి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై అభిప్రాయపడ్డారు. సీఎం వెంట వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

**బ్యాగ్ వాల్వ్ మాస్కుల తయారీ అభినందనీయం: గవర్నర్**

కరోనా కట్టడిలో భాగంగా బ్యాగ్ వాల్వ్ మాస్కులు (అంబూ బ్యాగ్స్) తయారుచేసిన హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులు, ప్రొఫెసర్ బీఎస్ మూర్తిని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ బుధవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అభినందించారు. ఈ బ్యాగులను రూ.5 వేలలోపు ఖర్చుతోనే అందుబాటులోకి తెస్తామని ప్రొఫెసర్ మూర్తి ఈ సందర్భంగా గవర్నర్‌కు తెలిపారు. ఇవి వెంటిలేటర్లుగా పనిచేస్తాయని, పల్లెలకు సైతం వీటిని చాలా సులభంగా తీసుకెళ్లొచ్చని వివరించారు. కాగా, లాక్‌డౌన్ నేపథ్యంలో గవర్నర్ తమిళిసై.. సొంత ఖర్చులతో రాజ్‌భవన్ ఎదురుగా ఉన్న బస్తీల్లో ఆహారాన్ని సరఫరా చేయిస్తున్నారు. రోజూ మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ఆహారం పంపిణీ చేస్తున్నట్టు రాజ్‌భవన్ అధికారులు తెలిపారు.


బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

# కరోనాపై కనిపించని యుద్ధం

## దేశానికే దిక్సూచిలా తెలంగాణ

- ముప్పూటలా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పర్యవేక్షణ
- కేసులెన్ని వచ్చినా వైద్యమందించడానికి సిద్ధం
- ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో మంత్రి ఈటల రాజేందర్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మానవాళి మనుగడకు సవాల్ విసిరిన కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం కనిపించని యుద్ధం చేస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరోనా నియంత్రణ చర్యల్లో తెలంగాణ దేశానికి దిక్సూచిలా నిలిచిందని చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు దేనికీ వెనుకాడకుండా అలుపెరుగని పోరాటంచేస్తున్నామన్నారు. కరీంనగర్‌లో ఇండోనేషియావాసుల నుంచి ఢిల్లీలో మర్కజ్ ప్రార్థనల వరకు కొవిడ్ సోకినవారిని వెంటనే ట్రాక్‌చేయడమే కాకుండా కేంద్రాన్ని అప్రమత్తంచేసిన ఘనత తెలంగాణదేనని చెప్పారు. పాజిటివ్ కేసులు ఎన్ని వచ్చినా వైద్యం అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గాంధీతోపాటు ఐదు కేంద్రాల్లో కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యాధిగ్రస్థులకు సేవలందించడంలో నిరంతరం పోరాడుతున్న వైద్యబృందాలకు చేతులెత్తి దండం పెట్టాలని ఈటల కొనియాడారు. తెలంగాణలో ఇప్పటివరకు కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ జరుగలేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నిరోధానికి ప్రభుత్వం తీసుకొంటున్న చర్యలు, ఏర్పాట్లపై బుధవారం నమస్తే తెలంగాణ ప్రతినిధికి ఈటల ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు అంశాలు ఆయన మాటల్లోనే..

**మన దగ్గరే పరీక్షలు**

రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. అయినా విదేశాలకు వెళ్లి వచ్చిన యువకుడికి మార్చి 2న పాజిటివ్ తొలికేసు నమోదైంది. అప్పట్నుంచి మరింత అప్రమత్తమయ్యాం. శంషాబాద్ విమానాశ్రయంలో లక్ష మందికి పైగా ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ చేశాం. వైరస్‌వ్యాప్తి అధికంగా ఉన్న దేశాలనుంచి వచ్చినవారిని హోం క్వారంటైన్‌లో ఉంచాం. పాజిటివ్ వ్యక్తుల కుటుంబసభ్యులు, సన్నిహితులను పరిశీలనలో ఉంచి వ్యాధి లక్షణాలున్నవారికి పరీక్షలుచేశాం. మొదట్లో పుణె పంపించి అక్కడ నిర్ధారించేవరకు రెండు మూడు రోజులు వేచి ఉండాల్సివచ్చేది. తర్వాత అన్ని వసతులున్న గాంధీ వైద్యకళాశాలలో పరీక్షలు మొదలుపెట్టాం. ఇప్పుడు గాంధీ, ఉస్మానియా, ఐపీఎం, నిమ్స్, సీసీఎంబీలో కూడా చేస్తున్నాం. ర్యాపిడ్‌టెస్ట్ విధానాన్ని పరిశీలిస్తున్నాం. వ్యాధి లక్షణాలున్నా.. లేకున్నా పాజిటివ్ వ్యక్తుల కుటుంబాల్లోని వారికి పరీక్షలకు ఆలోచిస్తున్నాం.

**ఖర్చుకు వెనుకాడటం లేదు**

ఖర్చుకు వెనుకాడకుండా ఎన్ని కోట్లయినా వెచ్చించి పటిష్ఠ చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఆ మేరకు అవసరమైన వస్తు సామగ్రిని అందుబాటులో ఉంచేందుకు ఖర్చుకు వెనుకాడటంలేదు. వెయ్యికి పైగా వెంటిలేటర్లను, లక్షకుపైగా పీపీఈ కిట్లను, ఇతర వస్తుసామగ్రిని అధికమొత్తంలో తేవాలని నిర్ణయించాం. ఇందుకు ఇటీవల రూ.247.56 కోట్లు వెచ్చించాం.

**మర్కజ్ నుంచి మహమ్మారి**

కరోనా వైరస్ ప్రభావం అధికంగా ఉన్న దేశాల నుంచి వచ్చినవారిని, ఇతర అనుమానితులైన విదేశీయులు 25 వేల మందికిపైగా గుర్తించి హోం క్వారంటైన్‌లో ఉంచాం. దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చి, పాజిటివ్ వచ్చినవారి సన్నిహితులు వెయ్యి మందికి పైగా హోం క్వారంటైన్‌లో ఉంచాం. వీరిలో ఏప్రిల్ 4 వరకు 95 శాతానికిపైగా విడుదలవుతారని భావించాం. విదేశాలనుంచి వచ్చినవారి నుంచి వైరస్ వ్యాప్తిచెందకుండా అరికట్టగలిగాం. కరోనా బారినపడి ప్రాణాలు కోల్పోవద్దనే ఉద్దేశంతోనే సీఎం కేసీఆర్ లాక్‌డౌన్ వంటి కఠిన నిర్ణయాన్ని దేశంలోనే మొదటగా రాష్ట్రంలో అమలు పర్చారు. దీంతో ఎంతో మేలు జరిగింది. అంతా బాగుందనుకొన్న సమయంలో మర్కజ్ వెళ్లి వచ్చినవారిలో చాలామందికి వైరస్ లక్షణాలు బయటపడుతున్నాయి. వెయ్యికిపైగా మర్కజ్‌కు వెళ్లినట్లు తెలిసింది. వారిలో 160 మందిని తప్ప అందరినీ రెండురోజుల్లోనే గుర్తించి పరీక్షలు చేయిస్తున్నాం. దీన్ని బట్టి తెలంగాణ సత్తా ఏమిటన్నది అర్థంచేసుకోవచ్చు. కాకపోతే వైరస్ నియంత్రణకు మరింత సమయం పట్టేటట్లున్నది.

**తెలంగాణ దిక్సూచి**

కరోనా కట్టడిలో దేశానికి తెలంగాణ దిక్సూచిగా నిలిచింది. కరీంనగర్‌కు వచ్చిన ఇండోనేషియా ప్రతినిధులకు పాజిటివ్ రావడంతో వారి ట్రాకింగ్‌లో గుర్తించిన అంశాల ఆధారంగా ఢిల్లీలోని మర్కజ్‌కు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల వారు వెళ్లిన విషయాన్ని కేంద్రానికి సమాచారం అందించింది మనమే. కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో అంతర్జాతీయ విమానాలు రద్దుచేయాలని కేంద్రాన్ని సీఎం కేసీఆరే మొదట కోరారు.

**కరోనాపై పోరుకు ఖర్చు**

| | |
|---|---|
| మందులు, సర్జికల్స్ రూ.134.23 కోట్లు | ఆరు దవాఖానల్లోని ల్యాబ్ వస్తువులు రూ.1.64 కోట్లు |
| కొవిడ్-19 టెస్టింగ్ కిట్లు రూ.52.42 కోట్లు | ఎక్విప్‌మెంట్ల సమకూర్పు రూ.59.27 కోట్లు |

**ఎందరికైనా చికిత్సచేసే సామర్థ్యం**

కరోనా బాధితులు ఎందరొచ్చినా వైద్యసేవలు అందించడానికి ఐసొలేషన్ వార్డులు, ఐసీయూలు బెడ్లను సిద్ధంచేశాం. హైదరాబాద్‌లో గాంధీ, కింగ్‌కోఠి దవాఖానలను పూర్తిస్థాయిలో కరోనా చికిత్సకు నిర్ణయించాం. ఇతర ప్రభుత్వ దవాఖానల్లో కూడా 4757 బెడ్లతో ప్రత్యేక విభాగాలను ఏర్పాటుచేశాం. అన్ని జిల్లాల కేంద్ర దవాఖానల్లో ఐసొలేషన్ వార్డులను విభజించి బెడ్లను సిద్ధంచేశాం. ప్రైవేట్ వైద్యకళాశాలల పరిధిలోని దవాఖానల్లో ఐసొలేషన్ వార్డులను ఏర్పాటుచేసి 9590 బెడ్లను సిద్ధంగా ఉంచారు. అవసరాన్ని బట్టి వాటిని వినియోగిస్తాం.

| కొవిడ్-19కు చికిత్స చేసే దవాఖానలు | ఐసొలేషన్ బెడ్లు | ఐసీయూ బెడ్లు | వెంటిలేటర్లు |
|---|---|---|---|
| గాంధీ దవాఖాన | 1,000 | 500 | 205 |
| కింగ్ కోఠి దవాఖాన | 300 | 50 | 25 |
| ఛాతి దవాఖాన | 75 | 25 | 28 |
| ఎంజీఎం దవాఖాన వరంగల్ | 150 | 25 | 27 |
| సరోజినీ కంటి దవాఖాన | 200 | - | - |
| గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ | 1500 | - | - |
| ఆయుష్ దవాఖాన | 850 | - | - |
| మొత్తం | 4,157 | 600 | 285 |

**10 మందికి నెగెటివ్**

గాంధీ దవాఖానలో కరోనా వైరస్ పాజిటివ్ వచ్చి చికిత్స పొందుతున్నవారిలో బుధవారం ఇద్దరు వ్యక్తులను డిశ్చార్జ్ చేశాం. మరో 10 మందికి నెగెటివ్‌గా నిర్ధారణ అయింది. మరోసారి పరీక్షలుచేసి వారిని డిశ్చార్జ్ చేస్తాం.. డిశ్చార్జ్ అయిన వారంతా మరో 14 రోజులు హోం క్వారంటైన్‌లో ఉండాలి.

## వైద్యులు, సిబ్బంది కృషికి దండం పెట్టాలె

కరోనా పేరు చెప్తేనే వణికిపోతున్న పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది సేవలు మాటల్లో చెప్పలేం. వ్యాధిగ్రస్థులకు వైద్యసేవలందించడమే కాకుండా అనుమానిత లక్షణాలున్నవారిని గుర్తించడం, ట్రాకింగ్ చేసే సందర్భాల్లో వైద్య విభాగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆయా విభాగాల ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయి సిబ్బంది వరకు వారుచేస్తున్న కృషికి దండం పెట్టాలి. వైద్యులు, సిబ్బంది ఉపయోగించే వస్తువులు, పరికరాలను సిద్ధంగా ఉంచాం. రూ.360 కోట్లతో మందులు, వైద్య పరికరాలు, ఇతర వస్తువులను అధికమొత్తంలో అందుబాటులోకి తేవాలని నిర్ణయించాం.

| ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరికరాలు | |
|---|---|
| ఎన్-95 మాస్కులు | 64,197 |
| పీపీఈ కిట్లు | 5,552 |
| శానిటైజర్లు | 1,72,629 |
| శాంపిల్ సేకరణ కిట్లు, వీటీఎం ట్యూబ్‌లు | 3,800 |
| సర్జన్ మాస్కులు | 9,90,266 |
| సర్జికల్ గ్లౌజ్‌లు | 11,65,537 |
| ఎగ్జామినేషన్ గ్లౌజ్‌లు | 23,74,834 |
| వెంటిలేటరు | 287 |
| రెడ్ థర్మా మీటర్లు | 47 |

## ముంబైలోని తెలంగాణవాసులకు

# జాగృతి భరోసా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో ముంబై అంధేరి ఈస్ట్‌లోని తెలంగాణ కార్మికులకు తెలంగాణ జాగృతి అండగా నిలిచింది. పెద్దపల్లి జిల్లాకు చెందిన 20 కార్మికులు భోజనాలకు అవస్థలు పడుతున్నారని ట్విట్టర్ ద్వారా తెలుసుకున్న జాగృతి వ్యవస్థాపకురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తక్షణమే స్పందించారు. బాధితులకు సహాయం చేయాల్సిందిగా మహారాష్ట్రలోని తెలంగాణ జాగృతిశాఖ నాయకులకు సూచించారు. వెంటనే వారు బాధితులకు అవసరమైన నిత్యావసర సరుకులు అందించి భరోసా కల్పించారు.

**డాక్టర్లు, నర్సులకు కవిత ధన్యవాదాలు**

డాక్టర్లు, నర్సులకు ప్రతిఒక్కరం ధన్యవాదాలు చెప్పాల్సిన అవసరం ఉన్నదని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనాపై పోరాటంలో డాక్టర్లు, నర్సులు ముందున్నారని, వారందరికీ మనం అండగా నిలుద్దామని ట్విట్టర్‌లో పిలుపునిచ్చారు. కేరళలో ఒక డాక్టర్ రోగుల చికిత్స కోసం తన పెండ్లిని వాయిదా వేసుకున్న కథనాన్ని ప్రస్తావిస్తూ.. డాక్టర్లు, నర్సుల సేవలను ఆమె ప్రశంసించారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్ ఆన్‌లైన్ క్లాసులు

**అభినందించిన తెలంగాణ స్టేట్ చీఫ్ కమిషనర్ కవిత**

**హైదాబాద్, నమస్తే తెలంగాణ:** దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మోడల్ స్కూల్‌లో ఆన్‌లైన్‌లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఇందుకు తరగతులవారీగా వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటుచేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తుండటంపై పాఠశాల సిబ్బందిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ స్టేట్ చీఫ్ కమిషనర్, మాజీ ఎంపీ కవిత అభినందించారు. అసైన్‌మెంట్లు ఇవ్వడంపై హర్షం వ్యక్తంచేశారు.

# వార్తా పత్రికలకే విశ్వసనీయత

**న్యూస్ చానళ్లపైనా అదేస్థాయిలో నమ్మకం • దేశవ్యాప్తంగా 52 శాతం మంది అభిప్రాయం**

**సోషల్‌మీడియాను నమ్ముతున్నది 11 శాతమే • కెంటర్ సంస్థ అధ్యయనంలో ఆసక్తికర అంశాలు**



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రోజుకో కొత్త యాప్ పుట్టుకొస్తూ విరివిగా సమాచారం అందుబాటులో ఉంటున్నా.. వార్తాపత్రికలే ఎక్కువ విశ్వసనీయతను కలిగి ఉంటున్నాయి. నమ్మకంలో రారాజులుగా నిలుస్తున్నాయి. పాఠకులను అమితంగా ఆకట్టుకుంటూ ప్రథమస్థానంలో నిలుస్తున్నాయి. న్యూస్ చానెళ్లు సైతం ఇదేస్థాయిలో ప్రజల నమ్మకాన్ని చూరగొంటున్నాయని కెంటర్ అధ్యయనంలో వెల్లడయింది. దేశవ్యాప్తంగా కరోనా లాక్‌డౌన్‌తో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా యాప్‌లతోపాటు టీవీ వీక్షణ పెరిగింది. సోషల్‌మీడియా వినియోగం పెరగడంతో కరోనా వైరస్‌పై వదంతులు కూడా ఎక్కువగా ప్రచారమయ్యాయి. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియా వినియోగం, నిజనిర్ధారణలో వార్తాపత్రికలు, న్యూస్ చానెళ్ల ప్రాధాన్యంపై ఇటీవల కెంటర్ సంస్థ అధ్యయనం చేసింది. దేశవ్యాప్తంగా 25 వేల మందికి పైగా సోషల్‌మీడియా వినియోగదారులపై సర్వే జరిపింది. ఇందులో 52 శాతం మంది సంప్రదాయ వార్తాపత్రికలు, న్యూస్ చానళ్లే ఎక్కువ నమ్మదగినవని స్పష్టంచేశారు. కేవలం 11 శాతం మంది మాత్రమే సోషల్‌మీడియాను విశ్వసిస్తున్నామని తేల్చారు. సోషల్‌మీడియా వినియోగం పెరిగి, సమాచార వ్యాప్తిలో కీలకపాత్ర పోషిస్తున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో నమ్మదగినవి కాదని చాలామంది పేర్కొన్నట్టు సర్వేలో వెల్లడయింది. ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్లు కూడా నమ్మదగినవిగా 48 శాతం మంది అభిప్రాయపడ్డారు.

**కెంటర్ సర్వే ప్రకారం..**

- గతంతో పోలిస్తే లాక్‌డౌన్ వల్ల వాట్సాప్ వినియోగం 40 శాతం అధికమయింది. ఇతర సోషల్‌మీడియా యాప్‌ల కంటే వాట్సాప్ వినియోగం పెరిగింది. మొత్తంగా సోషల్‌మీడియా వినియోగం 61 శాతం ఎక్కువయింది.
- వెబ్‌బ్రౌజింగ్ 70 శాతం పెరిగినట్టు తేలింది.
- సంప్రదాయ టెలివిజన్ వీక్షణ 63 శాతం పెరిగింది.
- ఫేస్‌బుక్ యాప్ వినియోగం 37 శాతం అధికమైంది.
- అన్ని మెసేజింగ్ యాప్‌లను ఎక్కువగా వినియోగిస్తున్నది 18 నుంచి 34 ఏండ్ల వయస్కులే.
- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి యాప్‌లను 35 ఏండ్లలోపువారు వినియోగించడం 50 శాతం పెరిగింది.
- చైనాలో స్థానిక సోషల్‌మీడియా యాప్‌లు వీచాట్, వీబోల వాడకం 58 శాతం పెరిగింది.
- కరోనా నేపథ్యంలో అమెరికాలోనూ సోషల్ మీడియా యాప్‌ల కోసం రోజులో 70 శాతం సమయాన్ని వెచ్చిస్తున్నట్టు సర్వేలో తేలింది.

## ఏప్రిల్ ఫూల్ వద్దు.. కూల్ చేద్దాం

- రాజ్యసభసభ్యుడు సంతోష్‌కుమార్ ట్వీట్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏప్రిల్ ఫూల్ అంటూ వదంతులను వ్యాప్తిచేయకుండా వీలైతే మొక్కలను నాటి వాతావరణాన్ని కూల్ చేద్దామంటూ రాజ్యసభసభ్యుడు, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా కరోనా వంటి మహమ్మారులను ఎదుర్కోవచ్చని బుధవారం ట్వీట్‌చేశారు. వాతావరణ సమతుల్యత వల్ల ప్రకృతి విపత్తుల నుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఒక వ్యక్తిని ఫూల్ చేస్తే ఏమి వస్తుంది.. మొక్కలు నాటితే వాతావరణం చల్లబడుతుందని సూచించారు.


కరోనా వ్యాప్తి కట్టడికి కేంద్రం ప్రకటించిన 21 రోజుల లాక్‌డౌన్‌లో భాగంగా 8వ రోజైన బుధవారం హైదరాబాద్‌లో పరిస్థితిని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సమీక్షించారు. పాతబస్తీలోని పలు వీధుల్లో ఆయన పర్యటించారు.

లాక్‌డౌన్-డే 10

| | హైదరాబాద్ | ముంబై | ఢిల్లీ |
|---|---|---|---|
| పెట్రోల్ | రూ. 73.97 | రూ. 75.30 | రూ. 69.59 |
| డీజిల్ | రూ. 67.82 | రూ. 65.21 | రూ. 62.29 |

# దేశమంతా మర్కజ్ చైన్

- ఢిల్లీ వెళ్లివచ్చినవారిపై పోలీస్ నిఘా
- లోతుగా అన్వేషించాలని డీజీపీ ఆదేశాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా నియంత్రణలోకి వస్తున్నదనుకొంటున్న తరుణంలో మర్కజ్ మత ప్రార్థనల్లో పాల్గొని దేశంలోని అన్ని రాష్ర్టాలకు తిరిగి వెళ్లిపోయిన వారి వల్ల ఒక చైన్‌లాగా కరోనా వ్యాప్తి చెందింది. గత రెండు రోజుల్లోనే వందల సంఖ్యలో పాజిటివ్ కేసులు బయటపడటంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. మర్కజ్ నుంచి వచ్చినట్టుగా భావిస్తున్న 1030 మందిని క్వారంటైన్ సెంటర్లకు తరలించడంతోపాటు గత పదిహేనురోజుల్లో వారు ఎక్కడెక్కడ తిరిగారు? ఎవరెవరితో సన్నిహితంగా ఉన్నారు? అలా సన్నిహితంగా మెలిగిన వారు.. మరలా ఎక్కడెక్కడ తిరిగారన్న విషయాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టిసారించారు. కరోనా వ్యాప్తిలో ఇది కీలక సమయం కావడంతో ఎట్టిపరిస్థితుల్లోనూ విస్తరించకుండా తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు స్థానికంగా ఉంటున్న పోలీసులు, ఆరోగ్య, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనను ముమ్మరం చేశారు. ఇప్పటికే నల్లగొండలో 17 మందిని గుర్తించి హైదరాబాద్‌కు తరలించారు. వీరిలో 15 మంది మయన్మార్ పౌరులు కాగా, ఇద్దరు కశ్మీరీలు ఉన్నారు. సారంగాపూర్‌లో 12 మందిని, రాయికల్‌లో ఒకరిని హోం క్వారంటైన్‌లో ఉంచారు. నారాయణపేటలో నలుగురు, హైదరాబాద్ రామచంద్రాపురంలో ఇద్దరిని గుర్తించి క్వారంటైన్‌కు తరలించారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన ఒకరికి పాజిటివ్ అని నిర్ధారణ కావడంతో ఆ వ్యక్తి సంచరించిన సమాచారాన్ని 15 బృందాలతో సేకరిస్తున్నారు. మర్కజ్‌కు వెళ్లివచ్చినవారి వివరాలు సేకరించి.. వారికి తక్షణమే వైద్యసాయం అందివ్వాలని ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్.. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లను కోరారు. మరోవైపు తెలంగాణను కొవిడ్ క్లస్టర్ ఫ్రీగా మార్చడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. పోలీస్ సిబ్బంది వారివారి పరిధిలో మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆపరేషన్ 'నిజాముద్దీన్'

- ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని వచ్చినవారి కోసం జల్లెడ
- మర్కజ్‌లో ఉన్న 2,136 మందిని ఖాళీచేయించిన అధికారులు
- 617 మంది దవాఖానకు, మిగిలినవారు క్వారంటైన్‌కు



ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ పరిసరాలను రసాయనాలతో శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** దక్షిణ ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో తబ్లిగీ జమాత్ సంస్థ నిర్వహించిన మత కార్యక్రమంలో పాల్గొని తిరిగి వచ్చిన వారి కోసం రాష్ర్టాలు జల్లెడ పడుతున్నాయి. ఇప్పటివరకు 6000 మందిని గుర్తించారు. మరో 2వేల మంది కోసం గాలిస్తున్నారు. ఆయా రాష్ర్టాల్లో కొత్తగా వెలుగుచూసిన పాజిటివ్ కేసుల్లో ఎక్కువ మంది ఆ కార్యక్రమంలో పాల్గొని వచ్చినవారే ఉంటున్నారు. 300కుపైగా కేసులకు మర్కజ్‌తో లింకులు ఉన్నాయి. వీటిలో ఒక్క తమిళనాడులోనే 190 కేసులున్నాయి. ఆ తర్వాత ఏపీలో 70, ఢిల్లీ 24, తెలంగాణ 21, అసోం 13, అండమాన్ 10, పుదుచ్చేరి 2, కశ్మీర్‌లో 1 చొప్పున కేసులు నమోదయ్యాయి. మరోవైపు, కరోనా వ్యాప్తికి కేంద్రకంగా మారిన నిజాముద్దీన్ మర్కజ్‌లో ఉన్నవారిని ఎట్టకేలకు ఖాళీచేయించారు. గత 36 గంటల్లో మొత్తం 2,361 మందిని అక్కడి నుంచి తరలించారు. వారిలో 617 మందిని వివిధ దవాఖానలకు తరలించగా, మిగిలినవారిని క్వారంటైన్‌లో ఉంచారు.

**ఐదు రైళ్లు.. వేలాది మంది ప్రయాణికులు**

మర్కజ్ కార్యక్రమంలో పాల్గొన్నవారితో కలిసి ఐదు రైళ్లలో ప్రయాణించిన వేల మంది ప్రయాణికుల వివరాలు అందించే పనిలో రైల్వే శాఖ నిమగ్నమైంది. మార్చి 13-19 మధ్య వీరు ఢిల్లీ నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్, గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్, తమిళనాడు ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ-రాంచి రాజధాని ఎక్స్‌ప్రెస్, ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించారు.

### భారీ నష్టం వాటిల్లింది: జాతీయ మైనార్టీ కమిషన్

**న్యూఢిల్లీ:** కరోనా వ్యాప్తి నియంత్రణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు నిజాముద్దీన్ ప్రాంతంలో తబ్లిగీ జమాత్ సంస్థ నిర్వహించిన సమ్మేళనంతో 'భారీ నష్టం' వాటిల్లిందని జాతీయ మైనార్టీ కమిషన్ (ఎన్సీఎం) పేర్కొన్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో మదర్సాలు, మతపరమైన ప్రాంతాల్లోనూ ఆంక్షలను కఠినంగా అమలుచేయాలని రాష్ర్టాలకు సూచించింది. ఈ మేరకు రాష్ర్టాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, కేంద్రపాలిత ప్రాంతాలకు బుధవారం ఎన్సీఎం అధినేత సయ్యద్ ఘయోరుల్ హసన్ రిజ్వీ లేఖ రాశారు. లాక్‌డౌన్ సమయంలో నిజాముద్దీన్ ఘటన తీవ్రమైన ఉల్లంఘన అని, ఇది పౌరుల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందన్నారు.

# వైద్యానికి రండి

- మర్కజ్ యాత్రికులకు ఏపీ సీఎం జగన్ పిలుపు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన కరోనా పాజిటివ్ కేసుల్లో 70శాతం ఢిల్లీ తబ్లిగీ జమాత్ మత ప్రార్థనలకు వెళ్లి వచ్చినవారేనని ఆ రాష్ట్ర సీఎం జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రం నుంచి ఢిల్లీకి 1085 మంది వెళ్లారని.. వారిలో ఇప్పటివరకు 585 మందిని గుర్తించి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీ నుంచి వచ్చినవారు వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఢిల్లీకి వెళ్లిన వారితోపాటు.. వారితో కాంటాక్ట్ అయినవారిని కూడా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటినీ సర్వే చేయిస్తున్నామని తెలిపారు.

**బయటకు రండి**

ఆంధ్రప్రదేశ్ నుంచి మర్కజ్‌కు వెళ్లివచ్చినవారిలో దాదాపు 450 మంది జాడ తెలియడంలేదు. జిల్లాలవారీగా ఎస్పీలు వారికోసం గాలిస్తున్నారు.

### 111కి చేరిన కేసులు

ఆంధ్రప్రదేశ్‌లో కరోనా పాజిటివ్ కేసులు 111కి చేరాయి. బుధవారం 67 కేసులు నమోదైనట్లు ఏపీ వైద్య ఆరోగ్య శాఖ తెలిపింది. గుంటూరులో 20, కడప, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో 15 చొప్పున, పశ్చిమ గోదావరిలో 14, విశాఖపట్నంలో 11, తూర్పు గోదావరిలో 9, చిత్తూరులో 6, నెల్లూరులో 3, అనంతపురంలో 2, కర్నూలులో ఒక కేసు నమోదైంది.


### మర్కజ్ యాత్రికులను వెంటనే గుర్తించండి

- రాష్ర్టాలను కోరిన కేంద్రం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఢిల్లీ నిజాముద్దీన్‌లోని తబ్లిగీ జమాత్ మత కార్యక్రమంలో పాల్గొన్న వారిని గుర్తించేపనిని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. బుధవారం అన్ని రాష్ర్టాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ నుంచి సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. తబ్లిగీ జమాత్‌లో పాల్గొన్నవారి ద్వారా కొవిడ్-19 విస్తృతంగా వ్యాప్తి చెందే అవకాశాలున్నందున రాష్ర్టాలు వారిని గుర్తించే ప్రక్రియను వేగవంతంచేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ సమర్థంగా అమలవుతున్నదని, నిత్యావసర సరుకుల సరఫరాకు ఆటంకాలు లేకుండా అంతరాష్ట్ర గూడ్స్ సర్వీసులను అనుమతించాలన్నారు. ప్రధాని గరీబ్ కల్యాణ్‌యోజన పథకాన్ని వచ్చేవారంలోగా అమలుచేయాలని రాజీవ్‌గౌబా రాష్ర్టాలను కోరారు.

## ఒక్క వ్యక్తి.. 300 మందికి క్వారంటైన్!

**జమ్ముకశ్మీర్‌లో నిజాముద్దీన్ ప్రకంపనలు**



**న్యూఢిల్లీ:** నిజాముద్దీన్ ప్రకంపనలు కశ్మీర్‌లోనూ వినిపిస్తున్నాయి. శ్రీనగర్‌కు చెందిన ఒక వ్యాపారి జమాత్ సదస్సు కోసం మార్చి ఏడో తేదీన ఢిల్లీకి విమానంలో చేరుకున్నారు. మార్చి 9న ఉత్తరప్రదేశ్‌లోని దేవ్‌బంద్‌కు రైలులో వెళ్లారు. దారూల్ ఉలూమ్ సంస్థ నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. మార్చి 11న రైలులో జమ్ముకు చేరుకుని వైద్యుడైన తన మిత్రుడితో కలిసి ఓ సభలో మాట్లాడారు. వారిద్దరు మార్చి 16 వరకు జమ్ములోని ఓ లాడ్జిలో బస చేశారు. అదే రోజు విమానంలో శ్రీనగర్‌కు చేరుకుని అనంతరం సొపోర్‌కు వెళ్లారు. మార్చి 18న రోడ్డు మార్గంలో శ్రీనగర్‌కు తిరిగొచ్చారు. జ్వరం, ఛాతిలో నొప్పి వల్ల మార్చి 21న స్థానిక దవాఖానలో చేరిన ఆ వ్యాపారిని తర్వాత శ్రీనగర్‌లోని ఎస్‌కేఐఎంఎస్ దవాఖానకు తరలించారు. తొలుత అలర్జీ కేసుగా పరిగణించిన వైద్యులు.. మరునాడు అతడి పరిస్థితి దిగజారడంతో శ్రీనగర్ ఛెస్ట్ అండ్ డిసీజ్ దవాఖానకు తరలించగా మార్చి 26న మరణించారు. జమ్ముకశ్మీర్‌లో తొలి కరోనా మృతి ఆయనదే కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాపారి ప్రయాణించిన విమానాలు, రైళ్లలోని ప్రయాణికుల వివరాలను సేకరించి 300 మంది అనుమానితులను క్వారంటైన్‌కు పంపారు.

### స్వచ్ఛందంగా పరీక్షలు చేయించుకోండి

- సీపీఐ నేత నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తబ్లిగీ జమాత్ మత కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు స్వచ్ఛందంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విజ్ఞప్తిచేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఒకవేళ పరీక్షలు చేయించుకోకుంటే వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తిచెందే అవకాశం ఉన్నదని హెచ్చరించారు.

### హజ్ యాత్రను వాయిదా వేసుకోండి

**దుబాయ్:** కరోనా నేపథ్యంలో హజ్ యాత్రను వాయిదా వేసుకోవాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లింలకు సౌదీ అరేబియా సూచించింది. మరోవైపు ఈ ఏడాది హజ్ యాత్ర జూలై నెలాఖరులో ప్రారంభంకావచ్చని తెలుస్తున్నది.



### తిరుమలలో పూజలు యథాతథం

- అసత్య ప్రచారాన్ని సహించం: చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన తిరుమల శ్రీవారి సన్నిధిలో అఖండ దీపం ఎల్లప్పుడూ వెలుగుతూనే ఉంటుందని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. తిరుమల శ్రీవారి గర్భగుడిలోకి ప్రవేశించి వీడియో తీసినట్టు కొంతమంది వైరల్ చేస్తున్నారని, ఇది పూర్తిగా అబద్ధమమని పేర్కొన్నారు. మూలవిరాట్, తిరుమల శ్రీవారి అఖండ దీపంపై వస్తున్న వదంతులపై బుధవారం ఆయన వివరణ ఇచ్చారు. అది శ్రీవేంకటేశ్వరస్వామి భక్తి చానల్ కోసం ఉపయోగించే అలిపిరి సమీపంలోని నమూనా ఆలయమని, తిరుమల శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభంవరకు మాత్రమే కెమెరాకు అనుమతి ఉన్నదన్నారు. స్వామివారికి నిత్యకైంకర్యాలు, సేవలు యథావిధిగా జరుగుతున్నాయని చెప్పారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

# గాంధీ దవాఖానలో ఉద్రిక్తత

- వైద్యులపై కరోనా మృతుడి బంధువు దాడి
- నిందితుడు వైరస్ పాజిటివ్ బాధితుడు
- అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అక్కడే ప్రత్యేక వార్డులో చికిత్స
- దాడిని ఖండించిన మంత్రులు, డీజీపీ




**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గాంధీ దవాఖానలో కరోనా పాజిటివ్ రోగి మృతిచెందటంతో ఉద్రిక్తత నెలకొన్నది. కొవిడ్ -19 పాజిటివ్‌తో గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం మృతిచెందాడు. అదే వార్డులో కరోనా చికిత్స పొందుతున్న మృతుడి బంధువు.. ఇతరులతో కలిసి వైద్యసిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన ఒకే కుటుంబంలోని ముగ్గురు కరోనా పాజిటివ్‌తో గాంధీలోని ఐసొలేషన్‌వార్డులో చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరు(49) బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ విషయాన్ని వైద్యులు ప్రకటించగా.. అక్కడే ఉన్న మృతుడి బంధువు వైద్యసిబ్బందిపై దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన సెక్యూరిటీ సిబ్బందిని గాయపరిచాడు. అతడికి మిగిలినవారు కూడా తోడయ్యారు. విషయం తెలుసుకున్న చిలకలగూడ పోలీసులు గాంధీ దవాఖానకు చేరుకున్నారు. అయితే, కరోనా వార్డులో ఘటన జరుగడంతో పోలీసులు వెంటనే అక్కడకు వెళ్లేందుకు వెనుకాడారు. సీపీ అంజనీకుమార్, డీసీపీ కల్మేశ్వర్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు అక్కడకు చేరుకొని ఘటనపై వైద్యులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన నిందితుడిని అదుపులోకి తీసుకొని అక్కడే ప్రత్యేక వార్డులో చికిత్స చేస్తున్నారు. మందులు కూడా లేని మహమ్మారికి చికిత్స అందిస్తూ గొప్పసేవలు చేస్తున్న వైద్యులపై దాడి జరుగడం హేయమైన చర్య అని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు. ఇద్దరు అదనపు డీసీపీలతోపాటు టాస్క్‌ఫోర్స్, టీఎస్‌పీఎస్ సిబ్బందితో దవాఖానకు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. వైద్యులు, పోలీసులతో వాట్సాప్ గ్రూప్ తయారుచేసి వారికి రక్షణగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

**వైద్యులపై దాడిహేయం**

గాంధీ దవాఖానలో వైద్యసిబ్బందిపై జరిగిన దాడిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించబోమని, దాడిచేసినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యశాఖమంత్రి ఈటల రాజేందర్ హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది ప్రాణాలు పణంగా పెట్టి సేవ చేస్తుంటే దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. వైద్యులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని, ప్రతిఒక్కరూ భరోసాతో పనిచేయాలని మంత్రి కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. కరోనా వైరస్ సోకినవారికి చికిత్స అందిస్తున్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలని హైదరాబాద్ సీపీని ఆదేశించినట్టు డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. వైద్యులపై దాడిని తెలంగాణ ఉద్యోగుల సంఘం ఖండించగా.. దవాఖానలో సీఆర్‌పీఎఫ్ పోలీసులతో రక్షణ కల్పించాలని జూనియర్ డాక్టర్లు కోరారు.

## టీ-వ్యాలెట్ ద్వారా చెల్లింపులు

- లాక్‌డౌన్ నేపథ్యంలో డిజిటల్ పేమెంట్లకు ఐటీశాఖ విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజలంతా ఇంట్లోనే ఉండి ఆయా బిల్లులు చెల్లించేందుకు టీ-వ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలని ఐటీశాఖలోని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్డీ) విభాగం బుధవారం విజ్ఞప్తిచేసింది. ఇంటికే పరిమితమై టీ-వ్యాలెట్ ద్వారా చెల్లింపులు జరిపి ప్రభుత్వ లాక్‌డౌన్‌కు సహకరించాలని సూచించింది. ఆయా పోటీ పరీక్షల ఫీజులు, జీహెచ్‌ఎంసీ, సీడీఎంఏ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ప్రాపర్టీ ట్యాక్స్‌లను, విద్యుత్ బిల్లులను చెల్లించడమేకాక, టీ-వ్యాలెట్ నుంచి ఇతరులకు డబ్బులు కూడా పంపించే అవకాశం ఉన్నదని స్పష్టంచేసింది. సందేహాలుంటే 9100007383 నంబర్‌కుగానీ, twalletsupport@transactionanalysts.com మెయిల్‌కు పంపించాలని సూచించింది.

## హోంక్వారంటైన్ వ్యర్థాలతో జాగ్రత్త

- కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ వీకే జిందాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వీయ గృహనిర్బంధం (హోమ్ క్వారంటైన్)లో ఉన్నవారు వినియోగించిన వ్యర్థాలతో జాగ్రత్త ఉండాలని కేంద్ర స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ వీకే జిందాల్ సూచించారు. కరోనా పాజిటివ్ బాధితులను పర్యవేక్షించే వైద్యారోగ్య సిబ్బంది నాణ్యమైన వ్యక్తిగత రక్షణ పరికరాలను వినియోగించాలని చెప్పారు. బుధవారం ఆయన ఢిల్లీనుంచి దేశంలోని వందకుపైగా మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వీయ గృహనిర్బంధంలోని వారిని పర్యవేక్షించే ప్రభుత్వ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## సెఫాలజిస్ట్ వేణుగోపాల్ కన్నుమూత

- దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన సీఎం కేసీఆర్
- తిరుమలగిరిలో అంత్యక్రియలు పూర్తి



వేణుగోపాల్ (ఫైల్)

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ ప్రజాభిప్రాయ విశ్లేషకులు (సెఫాలజిస్ట్) డాక్టర్ వేణుగోపాల్ (60) బుధవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సంబంధమైన వ్యాధితో బాధపడుతున్నారు. బుధవారం సాయంత్రం తిరుమలగిరిలో ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. వేణుగోపాల్‌కు భార్య, కూతురు ఉన్నారు. కర్నూలు జిల్లా వ్యాపల్లిలో జన్మించిన వేణుగోపాల్ జేఎన్‌యూలో ఎంఫిల్ పూర్తిచేశారు. హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశారు. 2004లో ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎఫ్‌ఆర్‌ఎస్‌డీ) సంస్థను స్థాపించి అనేక సర్వేలు నిర్వహించారు. పలుమార్లు ఎన్నికల సందర్భంగా ఆయన చేసిన సర్వేలు దాదాపుగా నిజమయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో, రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ర్టాల్లో ఆయన చేసిన సర్వేలు వాస్తవమయ్యాయి. డాక్టర్ వేణుగోపాల్ తన సర్వేలో ఒక ప్రశ్నావళిని రూపొందించి బృందాలను గ్రామాలకు పట్టణాలకు పంపించి ప్రజాభిప్రాయాన్ని సేకరించేవారు. అలా ఆయన చేసిన సర్వేలన్నీ వాస్తవ ఫలితాలకు దగ్గరగా వచ్చాయి.

**సీఎం కేసీఆర్ సంతాపం**

ప్రముఖ ప్రజాభిప్రాయ విశ్లేషకుడు, సెంటర్ ఫర్ సెఫాలజీ స్టడీస్ అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ మరణం పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలకు ఎంతో విశ్వసనీయత ఉన్నదన్నారు. ఆయన చెప్పిన అనేక సర్వే ఫలితాలు వాస్తవానికి దగ్గరగా వచ్చాయని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు.

**మియాపూర్ కార్పొరేటర్ రమేశ్ మృతికి సీఎం సంతాపం**

జీహెచ్‌ఎంసీ పరిధిలోని మియాపూర్ కార్పొరేటర్ మేక రమేశ్ మృతికి సీఎం సంతాపం తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూర్చాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబసభ్యులకు, అనుచరులకు సానుభూతి చెప్పారు.

## సరిహద్దుల్లో రాకపోకలు బంద్

- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వ్యాప్తిని అరికట్టే చర్యల్లో భాగంగా రాష్ట్రం లోపలికి రాకపోకలను అనుమతించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం.. హైకోర్టుకు తెలిపింది. సరిహద్దుల్లో చిక్కుకుపోయిన వారి కోసం 343 ఆశ్రయగృహాలను ఏర్పాటు చేశామని పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో చిక్కుకుపోయిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి, వారిని స్వస్థలాలకు పంపాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం వర్చువల్ విధానంలో హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ బండాశివానంద ప్రసాద్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రం లోపలికిగానీ లోపలి నుంచి వెలుపలికిగానీ ఎవరినీ అనుమతించడం లేదని తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో చిక్కుకుపోయిన వారికోసం ఏర్పాటుచేసిన షెల్టర్ హోమ్స్‌లో అన్ని సౌకర్యాలు కల్పించామని వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం వలస కార్మికుల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరింది. దీనిపై వైద్య, ఆరోగ్యశాఖ ఒక అఫిడవిట్‌ను దాఖలుచేయాలని తెలిపింది.

**పీపీఈ కిట్స్ లభ్యతపై వివరణ ఇవ్వండి**

పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్స్ లభ్యతపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. కరోనా వైరస్ కట్టడికి పోరాడుతున్న వైద్యులకు సరైన రక్షణ సామగ్రి, వైద్య పరికరాలు అందుబాటులో లేవని ఆరోపిస్తూ దాఖలైన పిల్‌పై జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, జస్టిస్ కే లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ వైద్యులకు అవసరమైన పీపీఈ కిట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం మొత్తం శరీరాన్ని కప్పేవిధంగా రక్షణ సామగ్రిని సమకూర్చామని చెప్పారు. పీపీఈ కిట్స్ లభ్యత, వైద్యులకు అందిస్తున్న సౌకర్యాలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. పై రెండు పిటిషన్లపై విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# అమ్మా నీకు వందనం!

- పెద్ద మనసు చాటిన తుర్కపల్లి పేదింటి మహిళ
- తనకు వచ్చిన 60 కిలోల బియ్యంలో 30 కిలోలు దానం
- ఆమె స్ఫూర్తితో 95 క్వింటాళ్లు దానంచేసిన లబ్ధిదారులు





30 కిలోల బియ్యం దానం చేసిన అనురాధకు రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ విద్యాసాగర్

***మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:*** *ఆమె పేరు అనురాధ.. నిరుపేద, వితంతువు.. తన ఇద్దరు కుమారులు, కూతురు, కోడలుతో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నది. కూలినాలీ చేసుకుని జీవించే తన కుటుంబానికి 60 కిలోల ఉచిత రేషన్ బియ్యం వచ్చాయి. కానీ, ఆమె అందులో 30 కిలోలే తీసుకుని.. మిగిలిన 30 కిలోలు రేషన్‌కార్డులేని మరో పేద కుటుంబానికి ఇచ్చేసింది. అక్కడే ఉన్న అడిషనల్ కలెక్టర్ విద్యాసాగర్ కల్పించుకొని.. 'అయ్యో.. మీదే పేద కుటుంబం కదమ్మా! మీకు వచ్చిన బియ్యం మీరే తీసుకెళ్లండి' అంటూ సూచించారు. అందుకు నిరాకరించిన ఆమె 'అయ్యా సారూ.. లాక్‌డౌన్‌తో నా కొడుకు వేరే ప్రాంతంలో చిక్కుకుపోయాడు. ఇక్కడ రేషన్‌కార్డు కూడా లేనివాళ్లకు నేను బియ్యం ఇస్తే.. అక్కడ నా కొడుక్కు మరో అమ్మ ఆకలి తీరుస్తది కదా' అని చెప్పిన సమాధానంతో అడిషనల్ కలెక్టర్‌తోపాటు అక్కడ ఉన్న అందరి కండ్లలో నీళ్లు తిరిగాయి. హృదయాలను ద్రవింపజేసిన ఈ ఘటన మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామంలో జరిగింది. అనురాధ స్ఫూర్తితో తుర్కపల్లి గ్రామంతోపాటు శామీర్‌పేట మండల పరిధిలో 95 క్వింటాళ్లను రేషన్‌లబ్ధిదారులు దానంగా ఇచ్చేందుకు ముందుకొచ్చారని తాసిల్దార్ గోవర్దన్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. వీటిని సర్పంచ్‌లకు అందజేసి రేషన్‌కార్డు లేని పేదలకు ఇవ్వమన్నట్టు చెప్పారు.*



రాబోయే రెండు వారాలు అమెరికా అత్యంత దుర్భర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నది. ఈ గడ్డుకాలాన్ని అధిగమించేందుకు ప్రతి పౌరుడూ సిద్ధం కావాలని కోరుతున్నా. చీకటి తర్వాత వెలుగును తప్పక చూస్తాం. అయితే ఈ రెండు వారాలు చాలా చాలా బాధాకరమైనవి.

–డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

## కల్లోల ప్రపంచం



కోల్‌కతాలోని రైల్వేస్టేషన్‌లో వలసకార్మికులకు భోజనం వడ్డిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

## 24 గంటల్లో కొత్తగా 450 కేసులు

### జమాత్ సభ్యుల ప్రయాణమే కారణం: లవ్ అగర్వాల్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో కొత్తగా దాదాపు4 50 కేసులు నమోదైనట్టు కేంద్ర వైద్యమంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. దేశంలో ఇప్పటి వరకు అత్యధిక కేసులు బుధవారమే నమోదయ్యాయని తెలిపింది. ఇది జాతీయ ట్రెండ్‌కాదని, తబ్లిగీ జమాత్ సమావేశానికి హాజరైనవారు వివిధ ప్రాంతాలకు ప్రయాణించడమే ఇందుకు కారణమని వెల్లడించింది. బుధవారం సాయంత్రం ఢిల్లీలో ఆరోగ్య మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ మీడియాతో మాట్లాడుతూ.. గడిచిన 24 గంటల్లో నమోదైన కొత్త కేసులు 450 కలుపుకొంటే ఇప్పటివరకు దేశంలో నమోదైన కొవిడ్-19 కేసుల సంఖ్య 1,949కు చేరిందని చెప్పారు. ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాలకు ప్రయాణించిన జమాత్ సభ్యుల వివరాలు సేకరించి, వారిని గుర్తించాలని అన్ని రాష్ట్రాలకు సూచించినట్టు తెలిపారు. వారిలో కరోనా లక్షణాలు ఉంటే వైద్యపరీక్షలు నిర్వహించాలని, గృహ నిర్బంధంలో ఉంచాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. రైల్వేశాఖ 20 వేల బోగీలను ఆధునీకరించి 3.2 లక్షల ఐసొలేషన్ బెడ్లను అందుబాటుకి తెస్తుందన్నారు.

## ఇంట్లో తయారుచేసుకున్న మాస్కులు వాడండి

### కేంద్ర ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారు విజయ్ రాఘవన్

**హైదరాబాద్:** కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రజలు ఇంట్లో తయారుచేసుకున్న మాస్కులను కూడా ధరించవచ్చని కేంద్ర ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ కే విజయ్ రాఘవన్ సూచించారు. వైరస్ వ్యాప్తి కారణంగా సర్జికల్ మాస్కులకు కొరత ఏర్పడిన నేపథ్యంలో ఆయన ఈ సలహా ఇచ్చారు. మాస్కులు ధరించడం వల్ల వైరస్ శరీరంలోకి ప్రవేశించే ప్రమాదం తగ్గుతుందని చెప్పారు. ఇంట్లో తయారుచేసిన మాస్కులు 70 శాతం ప్రభావవంతంగా పనిచేస్తాయని తెలిపారు. అయితే మాస్కులు వాడే విషయంలో జాగ్రత్తలు పాటించాలని, చేతులను తరచూ శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.

## హ్యూమన్ ట్రయల్స్‌లో కొవిడ్-19 టీకా!

- 108 మందిపై ప్రయోగించిన చైనా



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19కు టీకాను కనుగొనే పనిలో చైనా శాస్త్రవేత్తలు.. మానవులపై ప్రయోగాలు ప్రారంభించారు. వైరస్ పుట్టినిల్లయిన వుహాన్‌లో జరిపిన మానవ పరిశోధనల్లో ఈ టీకా సురక్షితంగా, ప్రభావవంతంగా పనిచేస్తున్నట్టు తేలిందని చైనీస్ అకాడమీ ఆఫ్ ఇంజినీరింగ్ సభ్యురాలు చిన్‌వీ తెలిపారు. అధికారిక అనుమతులతో గత నెల 16న టీకా తొలిదశ ప్రయోగాలు మొదలయ్యాయని చెప్పారు. 18-60 ఏండ్ల మధ్యవయసున్న 108 మందిపై ప్రయోగించామన్నారు. అందులో సంతృప్తికర ఫలితాలు వచ్చాయన్నారు. దీనికి సంబంధించిన ఫలితాలను ఈ నెలలోనే ప్రచురిస్తామని తెలిపారు. త్వరలో విదేశాల్లో అదనపు ట్రయల్స్ నిర్వహిస్తామన్నారు. ప్రపంచదేశాలు కరోనా టీకా కోసం ఎదురుచూస్తున్నాయని, తమ ప్రయోగాలకు అంతర్జాతీయంగా సహకారాన్ని ఆశిస్తున్నామని చెప్పారు. ఈ టీకాతో ప్రపంచంలో కొవిడ్-19కు ముగింపు దొరుకుతుందని, అయితే పూర్తి అనుమతులు వచ్చేందుకు ఎంత సమయం పడుతుందనేది చెప్పలేమన్నారు.

# 9/11ను మించి..

### కరోనా వైరస్‌తో అమెరికా అల్లకల్లోలం

- 4 వేల మంది మృతి.. 2 లక్షలు దాటిన కేసులు
- న్యూయార్క్‌లోనే 1,550 దాటిన మరణాలు
- చికిత్స సామగ్రి, సిబ్బంది లేక వైద్యుల అవస్థలు
- రానున్న రెండు వారాలు గడ్డుకాలమే: ట్రంప్

**న్యూయార్క్, ఏప్రిల్ 1:** కరోనా వైరస్(కొవిడ్-19) దెబ్బకు అమెరికా అల్లాడుతున్నది. బుధవారంనాటికి ఈ మహమ్మారి నాలుగు వేల మందిని బలితీసుకున్నది. ఆధునిక అమెరికా చరిత్రలోనే ఘోర విషాదాన్ని నింపిన 9/11 దాడులను మించిపోయింది. ఒక్క న్యూయార్క్ రాష్ట్రంలోనే 1,550 మందికి పైగా మృత్యువాతపడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వచ్చే రెండు వారాలు మరింత దుర్భరంగా ఉండనున్నాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రజలను హెచ్చరించారు. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 8.60 లక్షలు దాటింది. 42 వేలకుపైగా మరణాలు నమోదయ్యాయి.

**అగ్రరాజ్యానికి పీడకలగా..**

2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఆల్‌ఖైదా ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో దాదాపు 3,000మంది మరణించారు. ఇప్పుడు కరోనా మరణాలు ఆ సంఖ్యను దాటిపోయాయి. జాన్ హాప్కిన్స్ వర్సిటీలోని కరోనా వైరస్ రీసోర్స్ సెంటర్ గణాంకాల ప్రకారం.. బుధవారంనాటికి అమెరికాలో కరోనా కేసుల సంఖ్య రెండు లక్షలు దాటింది. నాలుగువేల మందికి పైగా మరణించారు. వైరస్ పుట్టినిల్లయిన చైనాను (3,310)ను అమెరికా దాటేసింది.

**అదే చేయకపోతే 22 లక్షల మంది మృతి**

నిర్ణీత దూరాన్ని పాటించడం, వలస కార్మికుల్ని అడ్డుకోవడం వంటి చర్యలతో అమెరికాలో మృతుల సంఖ్య తగ్గిందని అధ్యక్ష భవనం శ్వేత సౌధంలో ఏర్పాటు చేసిన 'కరోనా వైరస్ టాస్క్ ఫోర్స్' సభ్యుడు డీబోరాహ్ బిర్క్స్ తెలిపారు. ఒకవేళ ఈ రెండు చర్యలు తీసుకోకుంటే మరణాల సంఖ్య 15 లక్షల నుంచి 22 లక్షలుగా ఉండేదని హెచ్చరించారు.

**24 గంటల్లో 332 మంది మృతి**

అమెరికాలో వైరస్‌కు కేంద్రంగాఉన్న న్యూయార్క్ రాష్ట్రంలో కరోనా ఉద్ధృతి కొనసాగుతున్నది. రాష్ట్రంలో ఇప్పటివరకు 75 వేల కేసులు నమోదయ్యాయని, 1,550 మంది మృతిచెందారని న్యూయార్క్ గవర్నర్ ఆండ్రూ క్యూమో తెలిపారు. గత 24గంటల్లో 332 మంది మరణించినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కోనున్నామన్నారు. మరోవైపు న్యూయార్క్ నగరంపైనా కరోనా పంజావిసురుతున్నది. మంగళవారంనాటికి 1,096మంది చనిపోగా, 41,771 మందికి వైరస్ సోకింది. ఇందులో 2000 మంది ఐసీయూలో ఉన్నారు. బాధితులకు చికిత్సనందించేందుకు తగినంత వైద్య సామగ్రి, సిబ్బంది లేక వైద్యులు అవస్థలు పడుతున్నారు.



కరోనా నేపథ్యంలో న్యూయార్క్‌లోని మౌంట్ సినాయ్ హాస్పిటల్‌లో బెడ్లు, సెలైన్ స్టాండ్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

### అగ్రరాజ్య చరిత్రలో దారుణ క్షణాలు

**పెర్ల్ హార్బర్:** అమెరికాలోని హవాలీ ప్రాంతంలో ఉన్న పెర్ల్ హార్బర్ నావికా స్థావరంపై 1941 డిసెంబరు 7న జపాన్ దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడిలో అమెరికా 3,059 మందిని కోల్పోయింది.

**9/11 దాడి:** ఉగ్రవాదులు రెండు విమానాల్ని హైజాక్ చేసి వరల్డ్ ట్రేడ్ టవర్స్‌ను ఢీ కొట్టడంతో అపార ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 2001 సెప్టెంబరు 11న జరిగిన ఈ దాడిలో దాదాపు మూడువేల మంది ప్రాణాలు కోల్పోయారు. 2.8 బిలియన్ డాలర్ల మేర ఆర్థిక నష్టంవాటిల్లింది.

**మారియా హరికేన్:** అమెరికా చరిత్రలో అపార ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చిన ప్రకృతి వైపరీత్యం ఇది. 2017 సెప్టెంబరు 16న మారియా హరికేన్ విరుచుకుపడి మూడువేలమందికిపైగా పొట్టనబెట్టుకున్నది.

### 'హెచ్-1బీ' జారీ నిలిపివేయండి

#### ట్రంప్‌కు లేఖ రాసిన అమెరికన్ సంస్థ

**వాషింగ్టన్:** కరోనా కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం వైపుగా పయనిస్తున్నది. ఈనేపథ్యంలో అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగం చేయడానికి విదేశీయులకిచ్చే హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ని ఈ ఏడాదికి నిలిపి వేయాలని 'అమెరికన్ టెక్నాలజీ వర్కర్స్' అనే సంస్థ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఓ లేఖను రాసింది. ప్రస్తుతం నెలకొన్న సంక్షోభ వాతావరణంలో పెద్ద స్థాయిలో అమెరికన్లు ఉపాధి అవకాశాల్ని కోల్పోనున్నారని, ఈ సమయంలో విదేశీయులకు హెచ్-1బీ వీసాల్ని జారీ చేస్తే పరిస్థితి మరింత దిగజారే అవకాశమున్నదని విజ్ఞప్తి చేసింది. దీంతోపాటు విదేశాల్లోని కార్మికులకు తాత్కాలికంగా ఇచ్చే హెచ్-2బీ వీసాలను కూడా నిలిపివేయాలని కోరింది.

### కరోనా క్లాక్ 1-4-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు 9.12 లక్షలు

మరణాలు 45,540

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 2,00,289 | 4,394 |
| ఇటలీ | 1,10,574 | 13,155 |
| స్పెయిన్ | 1,02,136 | 9,053 |
| చైనా | 81,554 | 3,312 |
| జర్మనీ | 75,754 | 848 |
| ఫ్రాన్స్ | 52,128 | 3,523 |
| ఇరాన్ | 47,593 | 3,036 |
| యూకే | 29,474 | 2,352 |
| స్విట్జర్లాండ్ | 17,137 | 461 |
| బెల్జియం | 13,964 | 828 |
| నెదర్లాండ్స్ | 13,614 | 1,173 |
| టర్కీ | 13,531 | 214 |

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు 1,949

మరణాలు 59

### దేశంలో కరోనా కేసులు

| | | |
|---|---|---|
| మహారాష్ట్ర 302 | కేరళ 241 | ఢిల్లీ 152 |
| తమిళనాడు 124 | ఏపీ 111 | రాజస్థాన్ 108 |
| ఉత్తరప్రదేశ్ 103 | కర్ణాటక 101 | తెలంగాణ 97 |
| గుజరాత్ 87 | మధ్యప్రదేశ్ 86 | కశ్మీర్ 62 |
| పంజాబ్ 46 | హర్యానా 43 | ప. బెంగాల్ 26 |

## మూడోవంతు మరణాలు యూరప్‌లోనే

- ప్రపంచవ్యాప్తంగా 45వేల మరణాలు
- అందులో 30వేలకుపైగా యూరప్‌లోనే
- ఇటలీలో కరోనాకు తోడైన ఆకలి కేకలు

**పారిస్:** ప్రపంచాన్ని గజగజ వణికిస్తున్న కరోనా వైరస్ ప్రభావం యూరప్‌పై అత్యధికంగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ బారిన పడి దాదాపు 45వేల మంది మరణిస్తే.. అందులో 30,000 మందికిపైగా యూరప్‌లోనే మరణించారు. అంటే మొత్తం మరణాల్లో దాదాపు మూడోవంతు మరణాలు యూరప్‌లోనే సంభవించాయి. అవి కూడా అత్యధికంగా యూరప్‌లోని ఇటలీ, స్పెయిన్ దేశాల్లోనే చోటుచేసుకున్నాయి. కరోనా వల్ల ఇటలీలో ఇప్పటి వరకు 13,155 మంది మరణించారంటే ఆ దేశంలో పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేగాక మరణాల పరంగా ప్రపంచవ్యాప్తంగా ఇటలీ తొలిస్థానంలో నిలిచింది. తర్వాత స్పెయిన్‌లో కరోనా ప్రభావం అధికంగా ఉన్నది. 24 గంటల్లో 864 మంది మరణించడంతో స్పెయిన్‌లో మృతుల సంఖ్య 9,000 దాటింది. యూరప్‌లోని ప్రతి నాలుగు మరణాల్లో మూడు ఇటలీ, స్పెయిన్ దేశాల్లోనే చోటుచేసుకుంటుండటం గమనార్హం. ఇక ఫ్రాన్స్‌లోనూ అదే పరిస్థితి కొనసాగుతున్నది. కరోనా వల్ల 3,523 మంది ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇటలీలో కరోనా విజృంభిస్తుండగా.. ఇంకోవైపు ఆ దేశంలో ఆకలి రాజ్యమేలుతున్నది. ఆహారం కోసం ప్రజలు నానాఅవస్థలు పడుతున్నారు. ఆకలిని తట్టుకోలేక కొన్ని చోట్ల సూపర్‌మార్కెట్లను దోచుకుంటున్నారు. దాదాపు 5లక్షలకుపైగా జనం ఆహారం అందించే ఆపన్నహస్తాల కోసం ఎదురుచూస్తున్నారు.

## గ్రీన్‌కార్డుకు దశాబ్దాలు వేచిచూడాల్సిందే!

**న్యూఢిల్లీ:** అమెరికాలో శాశ్వత నివాస హోదా కోసం వేచి ఉండేవారి సంఖ్య 2030 నాటికి రెట్టింపు అవుతుందని, గ్రీన్‌కార్డ్ కోసం భారతీయులు దశాబ్దాలపాటు నిరీక్షించాల్సి ఉంటుందని కాంగ్రెషనల్ రీసెర్చ్ సర్వీస్ (సీఆర్‌ఎస్) నివేదిక పేర్కొంది. గ్రీన్‌కార్డ్ కోసం ఆమోదంపొంది వేచి ఉన్నవారు 10 లక్షల మంది ఉన్నారు. ప్రస్తుత చట్టం ప్రకారం మూడేండ్లకు ఒక్కో దేశ పరిమితిని తొలగించి, విదేశీ నిపుణులకు గ్రీన్‌కార్డులను రిజర్వు చేస్తారు. ఉపాధి ఆధారంగా ఈబీ1, ఈబీ2, ఈబీ3 వర్గాలకు జారీచేసే గ్రీన్‌కార్డ్‌ల సంఖ్య 1,20,120 పరిమితిని పెంచరు. సవరించిన ఎస్ 386 చట్టం ప్రకారం దేశాలకు ఏడు శాతం కోటా కేటాయింపును తొలగిస్తే నిరీక్షిస్తున్నవారిలో భారత, చైనా దేశాలవారికి స్వల్ప కాలపరిమితి తగ్గనుంది. ఈబీ1 బ్యాక్‌లాగ్ సంఖ్య 1,19,732 నుంచి 2030 నాటికి 2,68,246కు పెరుగనుంది. ఈబీ2 వారి సంఖ్య 6,27,448 నుంచి 14,71,360కు, ఈబీ3 వారి సంఖ్య 1,68,317 నుంచి 4,56,190కి పెరుగనుంది. పై మూడు వర్గాలవారి సంఖ్య 9,15,497 నుంచి 2030 నాటికి 21,95,795 పెరుగనుంది. సవరించిన చట్టం ఎస్ 386 అమలు చేసినా గ్రీన్‌కార్డుల జారీలో నిరీక్షణ కాలపరిమితి స్వల్పంగానే తగ్గుతుందని కాంగ్రెస్ నివేదిక తెలిపింది. గ్రీన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్నవారిలో హెచ్-1బీ వీసా విభాగంలో ఈబీ2, ఈబీ3 దరఖాస్తుదారులు భారతీయులే అధికంగా ఉన్నారు. వీరికి గ్రీన్‌కార్డు రావడానికి దశాబ్దాలు నిరీక్షించక తప్పదని కాంగ్రెస్ నివేదిక స్పష్టం చేస్తుంది.



## నెలాఖరులో 'స్వదేశీ' వెంటిలేటర్లు

### స్థానికంగా దొరికే వస్తువులతో తయారీ: ఐఐఎస్‌సీ

**బెంగళూరు:** స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వెంటిలేటర్ల ప్రాథమిక నమూనాను నెలాఖరులోగా సిద్ధం చేస్తామని కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) తెలిపింది. దేశంలో కరోనా వైరస్ మరింత విజృంభిస్తే రోగులకు ఇవి ఉపయోగపడుతాయని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై 10 రోజులుగా అహోరాత్రులు శ్రమిస్తున్నామని వెల్లడించింది. దేశవ్యాప్తంగా వెంటిలేటర్ల కొరత ఉన్నదని, సెన్సార్లు వంటి ముఖ్యమైన విడిభాగాలు విదేశాల నుంచి వచ్చే పరిస్థితి లేదని పేర్కొంది. ఆర్వో ప్యూరిఫయర్లలోని సెడిమెంటేషన్ ట్యాంకులు, టైర్లల్లో గాలినింపే యంత్రాల్లోని సెన్సర్లు, ఇండస్ట్రియల్ బర్నర్లు, గ్యాస్ టర్బైన్లు.. ఇలా అన్నీ స్థానికంగా దొరికే వస్తువులతో వెంటిలేటర్లను రూపొందిస్తున్నట్లు ఐఐఎస్‌సీ తెలిపింది.

## ఒకే కుటుంబంలో 11 మందికి..

**జైపూర్:** ఒకరి నిర్లక్ష్యం వల్ల రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ కుటుంబంలోని 11 మందికి కరోనా సోకింది. రామ్‌గంజ్‌కు చెందిన ఓ వ్యాపారి మార్చి 12న ఒమన్ నుంచి తిరిగివచ్చారు. ఢిల్లీ నుంచి సొంతూరు చేరుకున్న మరునాడు స్నేహితుడితో మార్కెట్ వద్ద కొంతసేపుగడిపారు. సుమారు 53 మందిని కలిశారు. పక్షం రోజుల తర్వాత ఆ వ్యాపారి, మిత్రుడు, మిత్రుడి కుటుంబంలోని పది మందికి కలిపి మొత్తంగా 12 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. మరింత మందికి వైరస్ వ్యాపించి ఉంటుందని అనుమానిస్తున్న అధికారులు ఆ ప్రాంతాన్ని నిర్బంధించి ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

## రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. ఇదే పెను సంక్షోభం!

- కరోనా వైరస్‌తో ఎన్నడూ ఎరుగని ఆర్థిక మాంద్యం
- ప్రపంచదేశాలు ఏకమవ్వాలి
- పేద దేశాలకు సాయంచేయాలి
- ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ పిలుపు



**ఐక్యరాజ్యసమితి, ఏప్రిల్ 1:** రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచం ఎదుర్కొంటున్న పెను సంక్షోభం కరోనా మహమ్మారేనని ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఇది ప్రజల ప్రాణాలను హరించడంతోపాటు ఇటీవలి కాలంలో ఎన్నడూ ఎరుగని ఆర్థిక సంక్షోభంలోకి ప్రపంచాన్ని నెడుతున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. 'సామాజిక, ఆర్థిక రంగాల మీద కరోనా ప్రభావం'పై బుధవారం ఆయన ఒక నివేదికను ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 75 ఏండ్ల ఐరాస చరిత్రలో ఎన్నడూ చూడని అంతర్జాతీయ ఆరోగ్య సంక్షోభాన్ని మనం ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ప్రాణాలు పోతున్నాయని, ప్రజల జీవితాలు తలకిందులవుతున్నాయని అన్నారు. ఇది కేవలం ఆరోగ్య సంక్షోభం మాత్రమే కాదని, అంతకుమించి మానవ సంక్షోభం అని వ్యాఖ్యానించారు. రాజకీయ వైరాలను పక్కనబెట్టి, అందరూ ఏకతాటిపైకి వస్తేనే విశ్వమారిని సమర్థంగా ఎదుర్కొనగలుగుతామని సూచించారు. పేద దేశాలకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆ వర్గాలను ఆదుకోవాలి..**

కరోనా వ్యాప్తి కట్టడికి ప్రపంచదేశాల మధ్య సమన్వయంతో కూడిన వైద్య సహకారం అవసరమని పిలుపునిచ్చారు. టెస్టింగ్, ట్రేసింగ్, క్వారంటైన్, చికిత్స సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. వైరస్ కబళిస్తున్న దేశాలకు, మెరుగైన వైద్య వ్యవస్థలు లేని పేద దేశాలకు అగ్రరాజ్యాలు తోడ్పాటునందించాలని విజ్ఞప్తిచేశారు. దివాళా, ఉద్యోగాల కోతను నిరోధించేందుకు పరిశ్రమలకు చేయూతనివ్వాలని కోరారు. కరోనాను ఎదుర్కొనే విస్తృత, సమన్వయ, సమగ్ర చర్యల కోసం తక్షణం ప్రపంచ జీడీపీలో కనీసం పది శాతం అవసరమవుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి కూడా 'మల్టీపార్ట్‌నర్ ట్రస్ట్ ఫండ్'ను ఏర్పాటుచేస్తున్నట్లు గుటెరస్ వెల్లడించారు.

### కరోనా ప్రభావంపై ఐరాస సంస్థల అంచనాలు..


- ప్రపంచవ్యాప్తంగా 2.5 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా వేసింది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 30-40 శాతం క్షీణించనున్నాయని యూఎన్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) పేర్కొంది.
- అంతర్జాతీయ పర్యటనలు 20-30 శాతం తగ్గనున్నాయని ప్రపంచ పర్యాటక సంస్థ అంచనావేసింది.
- 3.6 బిలియన్ల మంది ఇంటర్నెట్‌కు దూరం కానున్నారని అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయూ) అంచనావేసింది.
- 1.5 బిలియన్ల మంది విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉన్నదని యునెస్కో ఆందోళన వ్యక్తంచేసింది.

## బ్రిటన్‌లో వైద్యసిబ్బంది వీసా పొడిగింపు

*లండన్:* కరోనా నేపథ్యంలో భారతీయులతోపాటు బ్రిటన్‌లోని విదేశీ వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి ఉపశమనం లభించింది. అక్టోబర్ ఒకటో తేదీలోపు గడువు ముగుస్తున్నవారి వీసాల గడువును మరో ఏడాది పొడిగిస్తున్నట్టు బ్రిటన్ హోం మంత్రి ప్రీతి పటేల్ తెలిపారు. నేషనల్ హెల్త్ సర్వీస్ కింద సేవలందిస్తున్న 2,800 మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. దేశంలోని వైద్యులు, నర్సుల పని గంటలపై ఆంక్షలను ఎత్తివేసినట్లు ప్రకటించారు.

## కరోనా హీరో జెలెంకో

### 699 మందికి చికిత్స.. అందరికీ స్వస్థత



**న్యూయార్క్:** డాక్టర్ వ్లాదిమిర్ జెలెంకో.. కరోనా బాధితుల పాలిట హీరో అయ్యారు. న్యూయార్క్‌లో వైరస్ సోకిన 699 మందికి చికిత్స అందించి స్వస్థత చేకూర్చారు. 'శ్వాసతీసుకోవడంలో ఇబ్బందితో నా వద్దకు వచ్చిన వారికి హైడ్రాక్సిక్లోరోక్విన్ సల్ఫేట్, జింక్, అజిత్రోమైసిన్ (జెడ్-పాక్) మందులతో చికిత్స అందించి కేవలం నాలుగు నుంచి ఆరు వారాల్లోనే కోలుకునేట్లు చేయగలిగాను. నేను చికిత్స అందించిన పేషెంట్లలో ఎవరూ చనిపోలేదు. ఎవరినీ వెంటిలేషన్‌లో పెట్టలేదు' అని జెలెంకో చెప్పారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని చిన్నారుల్లో శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ సమస్యను తగ్గించడంలో జింక్ సప్లిమెంట్ ఎంతో ఉపయోగకారిణిగా ఉన్నదని అమెరికా మేరీల్యాండ్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ తేల్చింది.

### 10 వైరస్ కేంద్రాలు

**న్యూఢిల్లీ:** కరోనాను నియంత్రించడంలో భాగంగా వైరస్ ప్రభావం అధికంగా ఉన్న పది 'కొవిడ్-19 హాట్‌స్పాట్స్'పై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా ప్రాంతాల్లో కరోనా కేసులు ఇలా ఉన్నాయి. ఢిల్లీ-నిజాముద్దీన్ వెస్ట్ (24 కేసులు), ఢిల్లీ-దిల్‌షాద్ గార్డెన్(11), రాజస్థాన్-భిల్వారా(26), యూపీ-నోయిడా(48), యూపీ-మీరట్(100), మహారాష్ట్ర-ముంబై (167), మహారాష్ట్ర-పూణె(46), గుజరాత్-అహ్మదాబాద్(23), కేరళ-కాసరగోడ్(99), కేరళ-పథానంథిట్ట(5 కేసులు).

### మధుమేహ నియంత్రణకు వినూత్న సాధనం

**వాషింగ్టన్:** టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడే వారికి 'వీ-గో రెగ్యులర్ హ్యూమన్ ఇన్సులిన్ (ఆర్‌హెచ్ఐ)' అనే వినూత్న సాధనాన్ని అమెరికన్ పరిశోధకులు తయారుచేశారు. చిన్నసైజులో ఉండే ఈ పరికరాన్ని ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చని, శరీరంపై అతికించుకోవచ్చని దీనిని రూపొందించిన 'వాలేరిటస్' సంస్థ ప్రతినిధులు తెలిపారు. రెగ్యులర్ హ్యూమన్ ఇన్సులిన్(ఆర్‌హెచ్ఐ)తో పాటు వీ-గోను ఇన్సులిన్ థెరపీలో వాడితే మధుమేహ చికిత్సకయ్యే వ్యయాన్ని గణనీయంగా తగ్గించవచ్చన్నారు.

### ప్రపంచానికి ఆహార కొరత ముప్పు!

*పారిస్:* కరోనాతో తలెత్తిన సంక్షోభాన్ని నియంత్రించలేకపోతే ప్రపంచం ముందు 'ఆహార కొరత' ముప్పు పొంచి ఉందని ఐరాస, డబ్ల్యూహెచ్‌వో, ప్రపంచ వాణిజ్య సంస్థలు హెచ్చరించాయి. లాక్‌డౌన్, ఎగుమతులపై ఆంక్షల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఆహారధాన్యాల కొరత ఏర్పడిందన్నాయి. దీనిని నివారించేందుకు సాధ్యమైనంత మేర స్వేచ్ఛగా వాణిజ్య కార్యకలాపాలు సాగాలన్నాయి.

## జమ్ముకశ్మీర్ స్థానికతపై కేంద్రం గెజిట్

- గ్రూప్ 4 ఉద్యోగాల వరకు రిజర్వేషన్ వర్తింపు
- కొత్త నిబంధనలపై రాజకీయ పార్టీల మండిపాటు

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్ స్థానికత, ప్రభుత్వ ఉద్యోగాల అర్హతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం బుధవారం గెజిట్ విడుదల చేసింది. గ్రూప్-4 ఉద్యోగాలకు సమానమైన వేతనంతో కూడిన నియామకాల్లో స్థానికులకు రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపింది. 15 ఏండ్లపాటు నివసించిన వారు, స్థానిక విద్యా సంస్థల్లో ఏడేండ్లపాటు విద్యనభ్యసించి పది, ఇంటర్ పరీక్షలు రాసినవారు, పదేండ్లపాటు సర్వీసులో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు, పునరావాస కమిషనర్ వద్ద వలస వ్యక్తిగా నమోదు చేసుకున్నవారు మాత్రమే జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో స్థానికుల కిందకు వస్తారని పేర్కొంది. జమ్ముకశ్మీర్‌లోని రాజకీయ పార్టీలు దీనిపై మండిపడ్డాయి. కేంద్రం హామీ ఇచ్చిన విధంగా ఇది లేదని, గాయపడిన ప్రజలను మరింత అవమానపరిచేలా ఉన్నదని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. కొత్త నిబంధనలు కశ్మీర్ ప్రజలకు మరిన్ని ఇబ్బందులు సృష్టించేలా ఉన్నాయని పీడీపీ విమర్శించింది.

## పరీక్షలు లేకుండానే ప్రమోషన్

### 1-8 తరగతులకు.. సీబీఎస్‌ఈ నిర్ణయం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఒకటి నుంచి 8వ తరగతి విద్యార్థులకు పరీక్షలు లేకుండానే పైతరగతులకు ప్రమోట్ చేస్తూ సీబీఎస్‌ఈ బుధవారం నిర్ణయం తీసుకుంది. 9, 11 తరగతులకు ప్రాజెక్టువర్క్స్, ఇంటర్నల్ పరీక్షలు మొదలైన వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా పైతరగతులకు ప్రమోట్ చేయనున్నారు. ఆ పరీక్షల్లో విద్యార్థులు ఫెయిలై ఉంటే.. మరోసారి వారికి అవకాశం కల్పించి, పరీక్షలు జరుపాలని, వాటిలో పాసైతే ప్రమోట్ చేయాలని నిర్ణయించారు. 10, 12 తరగతులకు మాత్రం ఇప్పటివరకూ ముగిసిన పరీక్షలను మినహాయించి, మిగిలినవాటిలో ఉన్నతవిద్యకు అర్హతగా ఉన్న 29 సబ్జెక్టులలో మాత్రమే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపింది. పరీక్షలకు పదిరోజుల ముందు తేదీలు ప్రకటిస్తామని పేర్కొంది. 25 దేశాల్లో సీబీఎస్‌ఈ స్కూళ్లున్నాయని, కరోనా వల్ల అక్కడా లాక్‌డౌన్ అమలుచేస్తున్నందున కొంతకాలం మూసివేయాలని నిర్ణయించినట్టు సీబీఎస్‌ఈ కార్యదర్శి అనురాగ్ త్రిపాఠి తెలిపారు.

## వంటగ్యాస్ మరింత చౌక

### రూ.61.50 తగ్గిన సబ్సిడీయేతర సిలిండర్ ధర

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 1:** వరుసగా రెండో నెలలో కూడా వంటగ్యాస్ ధరలను తగ్గించాయి ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలు. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు దిగొస్తుండటంతో దేశీయంగా సబ్సిడీయేతర సిలిండర్ ధరను రూ.61.5 చొప్పున తగ్గిస్తున్నట్లు బుధవారం ప్రకటించాయి. దీంతో ఢిల్లీలో 14.5 కిలోల గ్యాస్ రూ.744కి లభించనున్నది. గత నెలలోనూ సిలిండర్ ధరను రూ.53 తగ్గించిన విషయం తెలిసిందే. కానీ, ఫిబ్రవరిలో ఏకంగా రూ.144.5 పెంచిన సంస్థలు వరుసగా రెండు నెలలుగా వంద రూపాయలకు పైగా తగ్గించి వంటగ్యాస్ వినియోగదారులకు ఊరట కల్పించాయి. వంటగ్యాస్ వినియోగదారులు మార్కెట్ ధరకు సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుండగా, ఆ తర్వాత సబ్సిడీ రూపంలో వారి బ్యాంక్ ఖాతాలో కేంద్రం జమ చేయనున్నది. ఏడాదికి 12 సిలిండర్లపై సబ్సిడీ చెల్లింపులు జరుపుతున్నది. మరోవైపు, కమర్షియల్ పరంగా వినియోగించే 19 కిలోల సిలిండర్ ధరను కూడా రూ.1,381.50 నుంచి రూ.1,285కి తగ్గించాయి సంస్థలు.

**మన యాది - 2015**

ఒద్దిరాజు సీతారామచంద్రరావు జయంతి. మానుకోట వ్యాస్తవ్యులైన ఒద్దిరాజు సోదరులలో ఈయనొక్కరు.

# వేదిక



నిజాముద్దీన్ మర్కజ్ కేంద్రం నుంచి 1,548 మందిని ఖాళీ చేయించాం. అందులో 441 మందికి వైరస్ లక్షణాలు కనిపించటంతో దవాఖానలో చేర్పించాం. ఢిల్లీలో వైరస్ కేసులు 97 నమోదైతే, అందులో 24 మంది ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న వారే. ఈ సమావేశం నిర్వ హించటం అత్యంత బాధ్యతారాహిత్యం.
– అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ ముఖ్యమంత్రి

**నమస్తే తెలంగాణ**

## పొంచి ఉన్న నిరుద్యోగం

ప్రపంచాన్నంతటినీ కారుమేఘంగా కమ్మేసిన కరోనా వైరస్ సకల జీవనరంగాలనూ ధ్వంసం చేస్తున్నది. మనుషుల ప్రాణాలను తోడేయటమే కాదు, ఉద్యోగ, ఉపాధి కల్పనలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దేశదేశాల్లో అమలవుతున్న 'లాక్‌డౌన్'లతో ప్రజలంతా ఇండ్లకే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉత్పత్తిరంగం ఆసాంతం స్తంభించిపోయే దుస్థితి తలెత్తింది. పేరుగాంచిన పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలు మొదలు చిన్న, మధ్యతరహా కంపెనీలన్నీ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం తలెత్తుతున్నది. ప్రపంచదేశాలన్నీ ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్న తరుణంలో కరోనా కాటు 'గోటిచుట్టపై రోకటి పోటులా' మారింది. దీంతో కంపెనీలు నష్టాల నుంచి గట్టెక్కేందుకు ఉద్యోగుల సంఖ్యను భారీగా తగ్గించుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఉన్నఫళంగా లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయే సందర్భం సామాజిక జీవనంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపించవచ్చు.

రెండువందలకు పైగా దేశాలు కోవిడ్–19 వైరస్‌తో వణికిపోతూ ప్రజల ప్రాణాలు నిలపడమే తక్షణ కర్తవ్యంగా తంటాలు పడుతున్నాయి. ఈ తరుణంలో ఉపాధి కల్పన, నిరుద్యోగం అనేవి అర్థంలేని ప్రశ్నలుగా మిగిలాయి. అభివృద్ధి చెందిన యూరప్ దేశాలతో పాటు అమెరికా కూడా దీనికి అతీతం కాదు. అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఉన్న అమెరికా కూడా కరోనాతో కష్టాల్లో పడింది. కోవిడ్ ఉధృతితో తాజాగా మేరిలాండ్, వర్జీనియా, అరిజోనా, టెన్నెసీ రాష్ట్రాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. అమెరికాలో ఉన్న యాభై రాష్ట్రాల్లో 32 పూర్తి లాక్‌డౌన్‌లో ఉన్నాయి. దీంతో అమెరికాలోని ప్రతి నలుగురిలో ముగ్గురు లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయారు. ఇప్పటికే 2.45 కోట్ల మంది ఇంటికే పరిమితమయ్యారు. ఇదిలాగే కొనసాగితే.., అమెరికాలో 4.7 కోట్ల మంది నిరుద్యోగులవుతారని 'ఫెడరల్ రిజర్వ్' అధ్యయన సంస్థ వేసిన అంచనా గగుర్పాటు కలిగిస్తున్నది. ఈ సంక్షోభం, అది అక్కడికే పరిమితమైపోయేది కాదు. దేశదేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

విద్య, ఉపాధి అవకాశాల కోసం భారతీయులు పాశ్చాత్య దేశాల బాట పట్టడం పరిపాటి. ఇందులో అమెరికాదే అగ్రస్థానం. సాధారణ, అసంఘటితరంగం మొదలు కార్పొరేట్ వృత్తి నిపుణుల దాకా అమెరికా అభివృద్ధిలో భారతీయుల భాగస్వామ్యం ఉన్నది. 'అమెరికన్ కమ్యూనిటీ సర్వే' (ఏసీఎస్) ప్రకారం, ఆ దేశంలో భారతీయుల సంఖ్య 2010లో 17.8 లక్షలు ఉంటే, 2018 నాటికి అది 26.5 లక్షలకు చేరుకున్నది. గత ఎనిమిదేండ్లలో 9 లక్షలు పెరిగారు! అమెరికాలో కరోనా సంక్షోభ ప్రభావం ఆసియా వాసులపై, ముఖ్యంగా భారతీయులపై ఎక్కువగా ఉంటుందనటంలో ఆశ్చర్యం లేదు. తక్షణంగా లక్ష ఉద్యోగాలు పోతాయని చెబుతున్నారు. మున్ముందు అది మరింత పెరిగే అవకాశం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. ఈ స్థితిలో హెచ్–1బీ వీసాతో పనిచేస్తున్న వారు ప్రమాదంలో పడిపోతారు. ఉద్యోగం కోల్పోయిన పక్షంలో అమెరికాలో ఉండగలిగే కాలపరిమితిని 60–180 రోజులకు పెంచాలని ఇండియన్లు కోరుతున్నారు. దీనికోసం 20 వేల సంతకాలను సేకరించారు. ఏదైనా సమస్యపై వైట్‌హౌజ్ నుంచి స్పందన రావాలంటే లక్ష సంతకాలుండాలి. మరో 80 వేల సంతకాల కోసం ఉద్యమం చేపట్టిన వారంతా అభద్రతాభావంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ సంక్షోభ, నిరుద్యోగ సమస్య అమెరికాదో, భారత్‌దో కాదు. అన్నిదేశాలూ ఈ సుడిగుండంలో చిక్కుకునే ప్రమాదం ముంచుకొస్తున్నది. ఈ తరుణంలో ప్రభుత్వాలు ముందుచూపుతో వ్యవహరించాలి. ప్రాణాలు నిలుపుకొంటూ అస్తిత్వం కోసం పోరాటం చేస్తున్న దేశాలు నిరుద్యోగ రక్కసి, సామాజిక అశాంతి ప్రబలకుండా జాగరూకత వహించాలి, సంరక్షించుకోవాలి.

# ఆపత్కాలంలో రైతుకు అండ

**విశ్లేషణ**



కల్లూరి శ్రీనివాస్‌రెడ్డి

కరోనా వైరస్‌పై దేశం పదకొండు రోజులుగా యుద్ధం చేస్తున్నది. 'సామాజిక దూరం' లాంటి కఠిన నియమాలతో ఆ మహమ్మారిని పారదోలే ప్రయత్నంలో యావద్దేశం ముందుకు సాగుతున్నది. ఆ వైరస్ చైన్‌ను తుంచేయడమే లక్ష్యంగా 21 రోజుల 'లాక్‌డౌన్' యజ్ఞంలో దేశం నిమగ్నమై ఉన్నది. ఇదొక అంటువ్యాధి విపత్తు. దాని తీవ్రతను జయించే సమర్థతను చాటుకోవాలసిన సందర్భం ఇది. ప్రజారోగ్యానికి కీలక సమయం. ప్రభుత్వాల సమర్థతకూ పరీక్షా సమయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరోనా కట్టడికి బాగా కృషి చేస్తున్నాయని అందరూ అంగీకరిస్తున్న విషయం. పాలకులు ఎంత సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకొని అమలును పర్యవేక్షించగలరో అనేదానిపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. ఇలాంటి క్లిష్ట సమయాల్లోనే పాలకుల్లోని సమర్థత వెలుగు చూస్తుంటుంది.

**'జనతా కర్ఫ్యూ'** రోజు సాయంత్రమే ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో తొమ్మిది రోజుల లాక్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. మరుసటి రోజు ప్రధాని నరేంద్ర మోదీ 21 రోజుల లాక్‌డౌన్‌ను దేశవ్యాప్తంగా ప్రకటించారు. కేంద్రం కన్నా ఎక్కువగా మన రాష్ట్ర ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉన్నారని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. చైనా దేశం జనవరి 7న కరోనా వైరస్ ప్రమాదాన్ని గుర్తించింది. జనవరి 21న ఆ వ్యాధి 'ఔట్ బ్రేక్' అయ్యింది. డబ్ల్యూహెచ్‌వో హెచ్చరికతో మార్చి 11 నుంచి మన కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అయినా విదేశీ విమానాల రాకపోకలు మార్చి 22 వరకు కొనసాగాయి. 23 నుంచి నిలిచిపోయాయి. మరో పది రోజుల ముందునుంచే (మార్చి 11 నుంచే) మూసివేసి ఉంటే, దేశంలో ఆ వ్యాధి తీవ్రత ఈ మాత్రం కూడా ఉండేది కాదేమో! ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులను మూసివేయాలని ప్రధానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లోనే సూచించారు. కరోనా విస్తరణను ప్రభుత్వం మొదట్లో అంచనా వేయడానికి ఏ దేశానికైనా కొంత సమయం పట్టొచ్చు. మన దేశంలోనూ కాస్త సమయం పట్టింది. అదే సమయంలో ఇతర దేశాల్లోనూ వ్యాధి విస్తరణను గమనించి త్వరగా విమాన రాకపోకలను నిలివేయాల్సింది. సమర్థ పాలకుడికి ఎప్పుడూ ముందుచూపే. కేసీఆర్ కూ అంతే!

విదేశాల నుంచి వచ్చిన వారిని కనిపెట్టడం, లాక్‌డౌన్‌ను అమలుచేయడం, క్వారంటైన్లు, కొత్త కేసులు, వైద్యులు, పోలీసుల సేవలు.. ఇలా అన్ని వ్యవస్థలనూ గాడిలో పెట్టి నడుపడం ప్రభుత్వాలకు కత్తిమీద సామే! వైద్యరంగంలో మనకున్న వనరులు తక్కువ. కాబట్టి, కరోనా బాధితులకు డాక్టర్లు అందిస్తున్న సేవలు అభినందనీయం. ఇక లాక్‌డౌన్ అమలు విషయంలో పోలీసుల పనితీరులో కొన్ని అనుకోని అపశృతులు (లాఠీ దెబ్బలు) ఉంటున్నా, తెలంగాణ పోలీసులకు వంద మార్కులు వేస్తున్నారు విశ్లేషకులు. సమస్య తీవ్రతను బట్టి పోలీసులకు కొంత స్వేచ్ఛ ఇచ్చి ఉంటారు! ఫలితంగానే లాక్‌డౌన్ మన రాష్ట్రంలో విజయవంతంగా సాగుతున్నది. ఇవాళ హైదరాబాద్ ఒక అంతర్జాతీయ నగరం. విదేశీ రాకపోకలు విపరీతంగా పెరిగాయి. కరోనా ప్రభావమూ ఎక్కువగా ఉండే అవకాశమూ ఉంది. ఏ మాత్రం అలసత్వం, అధికారుల్లో అప్రమత్తత లోపించినా ఇవాళ్టికి తెలంగాణలోనూ కరోనా బాధితుల సంఖ్య వందలు దాటేదేమో! డీజీపీ నుంచి హోంగార్డు దాకా పకడ్బందీగా పనిచేస్తుండటం, డాక్టర్లు, నర్సులు, సిబ్బంది అహర్నిశలూ కష్టపడుతున్న ఫలితంగానే మన రాష్ట్రంలో చాలా మేరకు ఈ వ్యాధి కట్టడిలో ఉండగలుగుతున్నది. పాలకుడి సమర్థతపైనే పాలనా యంత్రాంగం సమర్థత ఆధారపడి ఉంటుంది.

ఢిల్లీలో నిజాముద్దీన్‌లో మర్కజ్ సమావేశాలకు దేశ, విదేశాల నుంచి హాజరయ్యారు. మన రాష్ట్రం నుంచి కూడా సుమారు రెండు వేల మంది హాజరైనట్లు అధికారులు చెబుతున్నారు. మర్కజ్ సమావేశాలకు హాజరై వచ్చినవారిలో కరోనా వైరస్ కొందరికి సోకినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఆరుగురు మరణించారు. మరికొంత మందిని గుర్తించాల్సి వుంది.



> తెలంగాణలో రైతు లేని ఊరు ఉండదు. ఊర్లన్నీ స్వీయ నియంత్రణ పాటిస్తున్నాయి. కాబట్టి వారి కష్టనష్టాలన్నీ తానే పట్టించుకుంటానని సీఎం భరోసానిచ్చారు. ఈ ఆపత్కాల సమయంలో ప్రభుత్వమే అలాంటి నిర్ణయం తీసుకోవడం ఆషామాషీ కాదు. గోనె సంచుల కొరత, హమాలీలు, కోత యంత్రాల కొరత, అన్నింటికీ మించి ఖజానా కొరత ఉన్న ఈ సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పంటల కొనుగోలుకు మాట ఇవ్వడం చూస్తే.. ఆయనొక 'రైతు బాంధవుడు' అని అనకుండా ఉండలేం.

ఏదేమైనా ఇదొక దురదృష్టకర పరిణామం. కరోనా వ్యాప్తి చెందుతున్న సమయంలో ఢిల్లీలో ఒక మతం సమావేశాలకు కేంద్ర హోం శాఖ ఏ విధంగా అనుమతించింది? దేశంలో వైరస్ విస్తరిస్తున్నప్పుడు ఇలాంటి సమావేశాలు అంత విచ్చలవిడిగా జరిగితే అది ఎవరి వైఫల్యం? ఇంటెలిజెన్స్ వర్గాలు అప్రమత్తంగా లేవా అనే ప్రశ్న కేంద్రాన్ని వేలెత్తి చూపుతున్నది. అయినా తెలంగాణ ప్రభుత్వం యాభై బృందాలతో మర్కజ్ సమావేశాలకు హాజరైన వారిని గుర్తించడంలో నిమగ్నమైంది. కేంద్రం చేసిన చిన్న నిర్లక్ష్యానికి దేశమంతా మరింత ఇబ్బంది పడాల్సి రావడం దురదృష్టకరం.

ఇకపోతే, ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్. సామాన్యుని బతుకుకు అదొక సుదీర్ఘ కాలం. వలస కూలీలకు దినదిన గండం. ప్రతి పేద కుటుంబానికి 12 కేజీల బియ్యం, రూ.1500 నగదు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. బాగుంది. ఇక రైతులకు పంటలు చేతికొస్తున్నాయి. మార్కెట్ కావాలి. లాక్‌డౌన్‌లో మార్కెట్ సౌకర్యం ఉండదు. కాబట్టి, ప్రభుత్వమే రైతుల దగ్గరికి వెళ్లి వారి పంటలు కొనుగోలు చేస్తామని ఆయన ప్రకటించారు. తెలంగాణలో రైతు లేని ఊరు ఉండదు. ఊర్లన్నీ స్వీయ నియంత్రణ పాటిస్తున్నాయి. కాబట్టి వారి కష్టనష్టాలన్నీ తానే పట్టించుకుంటానని సీఎం భరోసానిచ్చారు. ఈ ఆపత్కాల సమయంలో ప్రభుత్వమే అలాంటి నిర్ణయం తీసుకోవడం ఆషామాషీ కాదు. గోనె సంచుల కొరత, హమాలీలు, కోత యంత్రాల కొరత, అన్నింటికీ మించి ఖజానా కొరత ఉన్న ఈ సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పంటల కొనుగోలుకు మాట ఇవ్వడం చూస్తే.. ఆయనొక 'రైతు బాంధవుడు' అని అనకుండా ఉండలేం. ఈ పంటల కొనుగోలుకు ఏకంగా ముప్పై వేల కోట్ల రూపాయలు కేటాయించడం చూస్తే ఇది పక్కా రైతు ప్రభుత్వమే అని స్వామినాథన్ సైతం చెప్పగలుగుతారు. ఈ ఆపత్కాల సమయంలో రైతాంగం పట్ల ఇంతటి శ్రద్ధ చూపిస్తున్న ముఖ్యమంత్రి దేశంలో మరొకరు ఉండకపోవచ్చు. దేశంలోని ప్రభుత్వాలన్నీ కరోనా కట్టడిపైనే దృష్టి పెడుతున్నాయి. కానీ, కేసీఆర్ ప్రభుత్వం ఇటు కరోనా కట్టడిపై, అటు రైతాంగ కష్టనష్టాలపైనా దృష్టి పెట్టడం గొప్ప విషయం.

వ్యవసాయం ఆగమైతే మనకు తిండి కూడా దొరుకదనే విషయాన్ని ఆ మధ్య కేసీఆర్ గుర్తు చేశారు కూడా. ఇలాంటి సమయంలో ప్రజల ఆరోగ్యంతో పాటు ఆహారానికీ ప్రాధాన్యం ఇవ్వడం పాలకుడి అవగాహనా సామర్థ్యమని చెప్పాలి. ఒకవేళ కరోనా పీడించినా, ఆహారోత్పత్తుల కోసం వ్యవసాయం ఆగంకాకూడదనే దూరదృష్టి అవసరం.

నెలవారీ జీతాలు, షేర్ మార్కెట్ సెన్సెక్స్‌లపై ఆధారపడి బతికే అమెరికా వంటి దేశాలకూ స్వయం సమృద్ధిలో ఆహారోత్పత్తులపై ఆధారపడి బతికే దేశాలకూ చాలా తేడా. అందుకే అమెరికా సంపూర్ణ లాక్‌డౌన్ కాలేదు కూడా. మన దేశం ఇంకా మార్కెట్ సెన్సెక్స్‌లపై పూర్తిగా ఆధారపడి లేదు. పాక్షికంగానే ఆధారపడి ఉంది. మన రైతు భూ కమతాలు చిన్నవి. ఇదే మన ఆహార స్వయం సమృద్ధి రహస్యం. దేశాన్ని బతికిస్తున్నది కూడా అదే. కరోనా గడగడలాడిస్తుంటే ప్రపంచం రేపు కరెన్సీ నోట్లు తిని బతుకలేదు. ఆహారోత్పత్తులు కలిగిన దేశాలే రేపు ప్రపంచంలో నిలబడేవి. ఈ ఆపత్కాల సమయంలో సూక్ష్మ పరమార్థమెరిగిన ఏ పాలకుడైనా... ఓ వైపు కరోనాను కట్టడి చేసి తరిమేస్తూనే... మరోవైపు రైతును రక్షించుకునే పనిచేస్తారు. ఇప్పుడు మన ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న పని కూడా ఇదే. పాలకుడి సమర్థతే సమాజానికి సంజీవని అవుతుంది.

(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)

# కేసీఆరే ఓ మెడిసిన్

> శత్రువుల నోటి వెంట కూడా పొగడ్తలు వచ్చేలా చేయడమే నాయకుడి లక్షణం. ప్రజలు మెచ్చేలా పాలన చేయడమే కాదు, అతిపెద్ద విపత్తు సంభవించినప్పుడు తన తెలివితో, అనుభవంతో దానిని ఎదుర్కొనగలిగే యుక్తి పాలకుడికి తెలిసి ఉండాలి. అంతటి శక్తి, ధైర్యం ఉన్న నాయకుడే కేసీఆర్. అందుకే ప్రపంచంలోని సుమారు రెండు వందల దేశాలను గడగడలాడిస్తున్న కరోనా వైరస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారు. 'నేనున్నాను.. మీరు అధైర్యపడవద్దు' అంటూ తెలంగాణ ప్రజలకు గొప్ప భరోసా ఇస్తున్నారు.



**తెలంగాణం**



విరసనోళ్ల శ్రీనివాస్‌గౌడ్

**తెలంగాణ** రాష్ట్రాన్ని ఒంటిచేత్తో సాధించిన నాయకుడు కేసీఆర్.. ఉద్యమ నేతే ఇప్పుడు పాలానధీషుడయ్యారు. ఈ ఆరేండ్లుగా కేసీఆర్ చేతుల్లో తెలంగాణ ప్రజలు సురక్షితంగా ఉన్నారు. కేసీఆర్‌ను పాలకుడితో పాటు ఓ రక్షకుడిగానూ గుర్తించడం ఉత్తమం.

కరోనా వైరస్ దెబ్బకు ప్రపంచం చిగురుటాకులా వణుకుతున్నది. ఆ ప్రభావం మన దేశాన్ని ఆలస్యంగా తాకింది. అయితే మన వాతావరణం దృష్ట్యా మనం వైరస్ బారిన పడకుండా కొంతమేరకు తప్పించుకున్నా.. మిగిలిన దేశాలు ఈ మహమ్మారి వైరస్‌కు దారుణంగా బలవుతున్నాయి. ప్రపంచ దేశాలకు పెద్దన్నగా ఉన్న అమెరికా కరోనా వైరస్‌కు అతలాకుతలమవుతున్నది. అందాల దేశం ఇటలీ గురించి ఇప్పుడు ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఇక, చైనా దేశంలో పుట్టిన ఈ వైరస్ ఆ దేశాన్నీ అల్లాడించింది. అయితే మిగతా దేశాలు వేరు, చైనా వేరు. ఇప్పుడు ప్రపంచ దేశాల ఆగ్రహాన్ని చైనా చవిచూస్తున్నది. కరోనా వైరస్ గురించి ప్రపంచం పడుతున్న ప్రత్యక్ష నరకాన్ని మనం కండ్లారా చూస్తున్నాం. అందుకు మన దేశమూ మినహాయింపేమీ కాదు. క్రమంగా మన దగ్గరా కేసులు పెరిగి చివరికి మరణాలనూ చూస్తున్నాం.. మున్ముందు ఆ ప్రభావం ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం!

దేశంలోని ఏ రాష్ట్రాన్నీ వదలకుండా అన్ని రాష్ట్రాలను పట్టి పీడిస్తున్నది కరోనా వైరస్. అయితే ఇలాంటి పెను విపత్కర సమయాల్లోనే పాలకుల సమర్థత, విజ్ఞత, పాలనాదక్షతలు అవసరం. తనను నమ్ముకొని ఉన్న రాష్ట్ర బిడ్డలను కాపాడుకోవడం నాయకుడి ధర్మం. పాలనా అనుభవమే కాదు, ఒక విస్ఫోటనాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా పాలకుడికి ఉండాలి. తుపాన్లను ఎదుర్కొని, సునామీలను తట్టుకొని, ఏటికి ఎదురీదుతూ రాష్ట్రాన్ని సాధించిన తెలంగాణ బిడ్డ కేసీఆర్ ఇప్పుడు తన అనుభవాన్ని రాష్ట్రానికి ధారపోస్తున్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ మెడిసిన్‌లా ఉపయోగపడుతున్నారు.

పాలనా యంత్రాంగానికి కర్తవ్య బోధ చేస్తూ.. కనిపించని శత్రువుపై పోరాడుతున్న ప్రతి ఒక్కరికీ కేసీఆర్ ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. పగలూ రాత్రి నిద్రాహారాలు కూడా లెక్కచేయకుండా వరుస సమీక్షలతో కార్యాచరణ రూపొందిస్తూ అమలుపరుస్తున్నారు. ఇక ప్రజల్లో ధైర్యాన్ని నూరిపోసేందుకు తరచూ నిర్వహిస్తున్న మీడియా సమావేశాలు ఈ కరోనాను తప్పక జయిస్తామనే ఆశను పెంచుతున్నాయి. కరోనా వైరస్‌ను ఎలా ఎదుర్కోవాలి, మనవంతు బాధ్యత ఎలా నిర్వర్తించాలి, లాక్‌డౌన్ పీరియడ్ కఠినమే అయినా ఎలా స్వీయ నియంత్రణ పాటించాలి వంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ కర్తవ్యాలన్నీ విస్పష్టంగా ఆయన చెబుతున్న తీరు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలనే కాదు, యావత్ దేశాన్నీ ఆకర్షిస్తున్నది. కరోనా వైరస్ కట్టడికి మిగతా రాష్ట్రాల కంటే భిన్నంగా ముందుకువెళ్తూ చాలా వరకు కట్టడి చేయడంలో కేసీఆర్ ఒక శాస్త్రవేత్తలా విజయవంతమవుతున్నారు. సాధిస్తారు కూడా. కరోనాను కూడా కట్టడి చేస్తారనడంలో ఏ మాత్రం సందేహం లేదు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ 12 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువుల కోసం కుటుంబానికి రూ.1500, తెలంగాణలో ఉన్న ఇతర రాష్ట్రాల వారికి రూ. 500 సహా నిత్యావసర వస్తువులు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కలెక్టర్లను ఆదేశించారు. సామాన్యుడిపై పట్టింపును ఇంత దూరదృష్టితో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చూడగలడు? కేసీఆర్‌కు ప్రజల నాడి తెలుసు. తెలంగాణ బంద్ పెడితే ప్రజలు ఎలా ఇబ్బందులు పడుతారో ఒక సామాన్యుడిలా కేసీఆర్ అంచనాకు రాగలరు. అందుకే కరోనా పై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రుల కంటే యుక్తిగా యుద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. కాకపోతే ఆయన ఫీల్డ్‌లో ఉంటూ, ప్రజలు ఇంటిపట్టునే ఉండాలని చెప్తున్నారు. అలా చేస్తేనే కరోనా వైరస్‌ను కట్టడి చేయగలమని ప్రజలకు వివరిస్తున్నారు. కలెక్టర్లకు సూచనలిస్తూ మానిటరింగ్ చేయడం కేసీఆర్ పాలనా పరిణతికి అద్దం పడుతున్నది.

> కరోనా కట్టడికి కేసీఆర్ చూపిస్తున్న పరిపక్వతను ప్రతి ఒక్కరూ కీర్తిస్తున్నారు. అందుకే సోషల్‌మీడియాలో దేశంలో కరోనాను జయించిన రాష్ట్రం తెలంగాణే అవుతుందన్న ప్రశంసలు వస్తున్నాయి. తెలంగాణకు కేసీఆర్ గొప్ప వరమంటూ కితాబిస్తున్నారు. కేసీఆర్ లాంటి సీఎం తెలంగాణకు ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమంటున్నారు.

కరోనా మహమ్మారిని తరిమికొట్టే పోరాటంలో అనేకరంగాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. తెలంగాణకు కీలకరంగమైన వ్యవసాయంపైనా కేసీఆర్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇంతటి క్లిష్ట సమయంలోనూ రైతులు పండించే ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి బేషరతుగా కొంటుందనే హామీని మరోసారి ప్రకటించారాయన. ఆ క్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దానిచుట్టూ అల్లుకొని ఉన్న సమస్యలను సవివరంగా విశ్లేషించడం వెనకున్న పరిశీలన, అవగాహన రైతాంగ సమస్యలు వాటి పరిష్కారాల పట్ల ఉన్న చిత్తశుద్ధిని చాటుతున్నవి.

జనతా కర్ఫ్యూ దేశమంతా 14 గంటలే ఉన్నది. కానీ, కేసీఆర్ ఒక అడుగు ముందుకేసి తెలంగాణలో 24 గంటలు చేశారు. అలాగే, దేశమంతా లాక్‌డౌన్ ఈ నెల 14 వరకే ఉన్నది. కానీ తెలంగాణ సీఎం కేసీఆర్ మరో అడుగు ముందుకేసి ఒకరోజు ముందుకు జరిపారు. అంతేకాదు, లాక్‌డౌన్ కట్టుదాటే వాళ్లకు గట్టి హెచ్చరికలు కూడా చేశారు. అవసరమైతే ఆర్మీని దింపి 'షూట్ ఎట్ సైట్' ఆదేశాలివ్వాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితిని కొనితెచ్చుకోవద్దంటూ సుతిమెత్తగా హెచ్చరించడం కేసీఆర్‌కే సాధ్యం. కరోనా కట్టడికి కేసీఆర్ చూపిస్తున్న పరిపక్వతను ప్రతి ఒక్కరూ కీర్తిస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో దేశంలో కరోనాను జయించిన రాష్ట్రం తెలంగాణే అవుతుందన్న ప్రశంసలు వస్తున్నాయి. తెలంగాణకు కేసీఆర్ గొప్ప వరమంటూ కితాబిస్తున్నారు. కేసీఆర్ లాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉం డటం రాష్ట్ర ప్రజల అదృష్టమంటున్నారు. కేసీఆర్ ఇప్పుడు దేశానికే కాదు, ప్రపంచానికే రోల్‌మోడల్.


(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర మంత్రి)

## బొందవెట్టు

**కరోనాను బొందవెట్ట**
కంకణబద్ధులు గాండ్రి
మహమ్మారిని మట్టుపెట్ట
కార్యసిద్ధులై రాండ్రి!


భుజం భుజం తాకకుండా
గజం గజం ఎడంగానే
బుద్ధిగా మసులుకోండ్రి!
శుభ్రత పాటించండ్రి
తేపతేపకూ చేతులు కడుగుండ్రి!
అత్యవసరమైతేనే
అడుగుబయట పెట్టుండ్రి!
గడపదాటి పోకుండా
గదుల్లోనే మెదులుండ్రి!
'ఫారిన్' నుంచి వస్తే, తప్పక
'క్వారంటైన్' కాండ్రి!

ప్రభుత్వాల సూచనలకు
ప్రజలంతా అండదండ గాండ్రి
పొద్దుమాపు సేవ చేయు
పోలీసులందరికీ..
ప్రాణాలను కాపాడే
వైద్యబృందమంతటికీ..
గండం తప్పించగా దండాలే పెట్టుండ్రి!!



డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ
92465 41699

# రామనామ మహిమ



**నమస్తే.. నమస్తే.. నమః**

మాడుగుల నారాయణమూర్తి

'శ్రీరామ' నామము భరతజాతికి ప్రతిధ్వని. రామనామం తెలియని భారతీయుడు గానీ, పల్లె గానీ ఉండవు. వసంత ఋతువులో చైత్రశుద్ధ నవమి శ్రీరాముని జన్మదినం. ఆ రోజు రామనామ స్మరణతో దేశమంతా మార్మోగుతుంది. భక్తి ప్రపత్తులతో జన్మదిన వసంతోత్సవాలు, శ్రీ సీతారామ కల్యాణాలను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఆచరిస్తారు. ఈ సందర్భంగా బెల్లం, పానకం, వడ పప్పు ప్రసాదాలు పంచిపెట్టడం, అన్నదానాలు జరుగుతుంటాయి.

భారతీయ సంస్కృతికి గుండె, మెదడు వంటివి భారత, రామాయణ ఇతిహాసాలు. ప్రజల కష్టసుఖాలతో, ఆధ్యాత్మిక చింతనతో పెనవేసుకున్నది రామాయణం. రామనామ సత్ఫలంతో తెలిసీ తెలియని పాపాలన్నీ పటాపంచలవుతాయి. పుణ్యాల్లో కాల ప్రాప్తికి రామనామమే పరమౌషధం. 'భర్జనం భవ బీజానాం ఆర్జనం సుఖసంపదాం/ తర్జనం యమదూతానాం రామరామేతి గర్జనం'. దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం విష్ణుమూర్తి మానవుడిగా ఎత్తిన అవతారమే శ్రీ రామచంద్రమూర్తి. రాముడు ధీరోదాత్తుడైన నాయకుడు. రెండు మాటలు చెప్పడు. ద్వంద్వ వైఖరి లేదు. ధైర్య సాహసాలకు ప్రతిబింబం. మిత హిత సత్య వాక్పరిపాలకుడు.

ఆది కవి వాల్మీకి రాముని చరిత్రను, గుణగణాలను 24,000 శ్లోకాలు, ఆరుకాండలలో పొందుపరిచాడు. రామాయణ కాలంలోనే వాల్మీకి జీవించి, ప్రత్యక్ష అనుభవాలను పొందాడు. తన జీవిత చరమాంకంలో సీతమ్మకు ఆశ్రయమిచ్చాడు. లవకుశుల గొంతు ద్వారా రాముని గొప్పతనాన్ని లోకానికి వాల్మీకి చాటినట్లు కూడా వాడుకలో ఉన్నది. బ్రహ్మదేవుని వద్దకు వెళ్లిన వాల్మీకి, 'రెం డు పక్షుల జంటలో ఒక పక్షి వేటగాడి దెబ్బతో చనిపోవడం' వల్ల తాను ఆవేదన చెందిన వైనాన్ని చెప్తాడు. అప్పుడు అనుష్టుపు ఛందస్సుతో కూడిన శ్లోకం వాల్మీకి నోట జాలువారుతుంది. వాల్మీకి బ్రహ్మదేవుడిని ఓదార్పు కోరుతాడు. దానికి విచారించిన బ్రహ్మ, 'ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢ వ్రత:/ చారిత్రే దుచకోయుక్త: సర్వభూతేషు కోహిత:' అంటాడు.'లోకంలో గుణవంతుడు, పరాక్రమవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవాక్కు కలవాడు, దృఢవ్రతుడు, యోగ్యమైన ప్రవర్తనాపరుడు, సర్వభూత హితాత్ముడు, ద్యుతిమంతుడు అయిన నాయకుని గుణవర్ణన చేయమని సూచించాడు. 'ఇన్ని అర్హతలున్నది ఒక్క శ్రీరామచంద్రుడికి మాత్రమేనని' వాల్మీకి తెలుసుకొంటాడు. అలా.. పౌలత్య వధ, సీతాయాశ్చరితం, రామాయణం పేర్లతో రచనకు పూనుకుంటాడు.

ఎన్నో వరాలు పొందిన రావణబ్రహ్మ చేసే అరాచకాలు భరించలేక దేవతలు బ్రహ్మను ఆశ్రయిస్తారు. విష్ణుమూర్తిని మానవ అవతారం ఎత్తమని ప్రార్థిస్తారు. రావణుడు 'మానవుని వల్ల చావు రాకూడదని' కోరుకోలేదు. కాబట్టే, విష్ణువు శ్రీరాముని అవతారం దాల్చడానికి అంగీకరిస్తాడు. అయోధ్య రాజ్యాధిపతి దశరథుడు ఋష్యశృంగు ని ఆధ్వర్యంలో అశ్వమేధ యాగం జరిపిన అనంత రం పుత్ర కామేష్ఠి యాగాలు చేస్తాడు. అప్పుడు కృష్ణవర్ణంలో, ఎర్రని వస్త్రాలతో, పాయస పాత్రతో అగ్నిదేవుడు ప్రత్యక్షమవుతాడు. ఆనందంతో ఆ పాయసాన్ని దశరథుడు సగభాగం కౌసల్యకు ఇచ్చేసి, మిగిలిన భాగం కైకేయి, సుమిత్రలకు అందిస్తాడు. ఫలంగా వసంతఋతువులో చైత్రశు ద్ధ నవమి మధ్యాహ్నం పునర్వసు నక్షత్రంలో ఐదు పెద్దగ్రహాలు (రవి, కుజ, గురు, శుక్ర, శని) ఉచ్చస్థానంలో ఉండగా, కర్కటక లగ్నంలో కౌసల్యకు శ్రీరాముడు జన్మిస్తాడు. పుష్యమి నక్షత్రంలో దశమినాడు మీన లగ్నంలో కైకేయికి భరతుడు ఉదయిస్తాడు. ఆశ్లేష నక్షత్రంలో కర్కటక లగ్నంలో సుమిత్రకు లక్ష్మణ–శత్రుఘ్నులు జన్మిస్తారు.




సర్వసద్గుణ సంపన్నుడు శ్రీరాముడు. పరిపాలన భరించేవాడు భరతుడు. దాస్యసేవకుడు లక్ష్మణుడు, శత్రుసంహారకుడు శత్రుఘ్నుడు. మరోవైపు బ్రహ్మవరం వల్ల వివిధ దేవతలు భల్లూక వానరులుగా, సేనలుగా జన్మించి రాముడికి సేవలు అందిస్తారు. ఆంజనేయుడు నమ్మిన బంటుగా, దాసునిగా నిరంతరం రాముణ్ణి గుండెలో పెట్టుకొని సేవించాడు. మహత్తరమైన రామనామ మహిమను శంకరుడు పార్వతీదేవితో విష్ణుసహస్ర నామాల సందర్భంలోనూ చెప్పించడం విశేషం. 'శ్రీరామరామేతి రమేరామే మనోరమే/ శ్రీ సహస్ర నామ తత్తుల్యం రామనామ వరాననే'. మహాభారతంలో భీష్మ–యుధిష్ఠిర సంవాదం సందర్భంలో, స్కాందపురాణంలోనూ వ్యాసుడు ఐదు అధ్యాయాలుగా రామనామ మహిమను వర్ణించాడు.

లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు | పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు **1967** | హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ **100** 24/7 | సైబరాబాద్ కమిషనరేట్ **9490617440** | రాచకొండ కమిషనరేట్ **9490617234** | కొవిడ్-19 కాల్‌సెంటర్ **040-23434343**

## నారాయణలో ఆన్‌లైన్ తరగతులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా ఉన్న నారాయణ విద్యాసంస్థల్లో బుధవారం నుంచి ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించినట్టు ఆ సంస్థ ప్రకటించింది. సంక్షోభ సమయాల్లో కూడా విద్యార్థులకు నిరంతరం చేరువయ్యేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటున్నట్టు తెలిపింది. రోజుకు సగటున పదివేల మందికిపైగా విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులు వీక్షిస్తున్నారని పేర్కొన్నది. ఎన్-లెర్న్, ఎన్-కనెక్ట్, నారాయణ ఆన్‌లైన్ టెస్ట్ సిరీస్ ద్వారా అందిస్తున్నామని, ఆన్‌లైన్ పరీక్షలతోపాటు తప్పులపై విశ్లేషణను వీడియో ద్వారా పరిష్కారాలు చూపుతున్నట్టు తెలిపింది.

## బీఎస్-4 వాహనాలపై ఊరట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో బీఎస్-4 వాహనాలపై అమ్మకందారులు, కొనుగోలుదారులకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. బీఎస్-4 వాహనాల అమ్మకాలు, రిజిస్ట్రేషన్ల గడువును ఈ నెల 24 వరకు పెంచుతూ బుధవారం అత్యవసర ఆదేశాలు జారీచేసింది. గతంలో సుప్రీం విధించిన గడువు మార్చి 31తో ముగిసింది. కరోనా నేపథ్యంలో వాహనాల అమ్మకాలు నిలిచిపోయాయంటూ వాహనడీలర్లు, తయారీ పరిశ్రమలు ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేశాయి. కేంద్రం నుంచి కూడా దీనిపై నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 24 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేసింది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ కావాల్సిన బీఎస్-4 వాహనాలు 2.70 లక్షలు ఉండగా.. షోరూంలలో మరో 1.40 లక్షల అమ్మకానికి ఉన్నాయి. కాగా, గడువు మీరిన డ్రైవింగ్ లైసెన్స్, పర్మిట్ల రెన్యువల్‌కు ప్రభుత్వం జూన్ 30 వరకు అవకాశమిచ్చిన విషయం తెలిసిందే.

# బియ్యం పంపిణీ ప్రారంభం

## సీఎం హామీ అమలు

- 17,025 రేషన్ షాప్‌లద్వారా సరఫరా
- 2.80 కోట్లమందికి లబ్ధి



కరీంనగర్ 14వ డివిజన్‌లో పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మేయర్ ఉన్నారు.

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** కరోనా నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీమేరకు ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమైంది. రాష్ట్రంలోని 87.54 లక్షల ఆహార భద్రత కార్డుల్లోని 2.80 కోట్లమంది పేదలకు బియ్యం అందించనున్నారు. బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రేషన్ దుకాణాల ద్వారా ఒక్కో వ్యక్తికి 12 కిలోల బియ్యం అందజేసే కార్యక్రమం మొదలైంది.

- కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 14వ డివిజన్‌లో బీసీ సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ బియ్యం పంపిణీని ప్రారంభించారు. చొప్పదండిలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పంపిణీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రేషన్‌కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమైంది. వరంగల్ రూరల్ జిల్లాలోని చౌకడిపోల్లో 418 కార్డులపై 14,964 కిలోల ఉచిత బియ్యాన్ని పంపిణీ చేసినట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి దీప్తి వెల్లడించారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లాలో 553 రేషన్ షాపుల్లో ఉచితం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరిపెడలో ఎమ్మెల్యే రెడ్యానాయక్ బియ్యం పంపిణీ మొద లుపెట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో బియ్యం అందజేశారు. నల్గొండ జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్ రావుతో కలిసి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రారంభించారు.
- రేషన్ బియ్యం పంపిణీలో వృద్ధులకు, దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ వెంకట్రావుతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

**మంత్రి కేటీఆర్ సూచనలతో 1500 మంది కార్మికులకు సాయం**

భవన నిర్మాణ కార్మికులకు ఆపన్నహస్తం అందించాలన్న పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచనల్ని అందుకున్న ప్రణీత్ గ్రూప్.. బుధవారం బాచుపల్లిలోని రెండు ప్రాజెక్టుల్లో రెండున్నర టన్నుల కూరగాయలు, వెయ్యి లీటర్ల నూనె, బియ్యం పంపిణీ చేసింది. తెలంగాణ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చేతుల మీద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కామరాజు మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ సూచనల మేరకు తమ మొత్తం ప్రాజెక్టుల్లో 3,500 మంది కార్మికులకు అవసరమయ్యే సమస్త సదుపాయాల్ని అందజేస్తున్నామని వెల్లడించారు. ముందస్తుగానే భవన కార్మికులకు జీతాలను కూడా అందజేశామని తెలిపారు.

## అర్హులందరికీ పంపిణీ

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి




ఖైరతాబాద్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.12 కిలోల ఉచిత బియ్యం అందుతాయని పౌరసఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రేషన్‌షాప్ నంబర్- 702లో ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 87.54 లక్షల ఆహార భద్రత కార్డులోని 2.80 కోట్ల మంది పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17,025 రేషన్ షాపుల్లో 3.34 లక్షల టన్నుల బియ్యాన్ని అందుబాటులో ఉంచామన్నారు. రేషన్ షాపుల వద్ద టోకెన్ విధానం అమలు చేస్తున్నామని, లబ్ధిదారులు క్యూలో నిర్ణీతదూరం పాటించాలని కోరారు. ఫిర్యాదుల కోసం పౌరసరఫరాల కేంద్ర కార్యాలయం టోల్ ఫ్రీ నంబర్ 1967, 1800 42500333 ఏర్పాటుచేశామని చెప్పారు. రాష్ట్రంలో గుర్తించిన 3.35 లక్షల మంది వలస కార్మికులకు ఒక్కొక్కరికీ 12 కిలోల చొప్పున రూ.13 కోట్లతో 4,038 టన్నుల బియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

- లాక్‌డౌన్ మన ఆయుధం




మహమ్మారి కరోనాను లాక్‌డౌన్ ద్వారా వ్యాప్తిచెందకుండా చేయవచ్చని తన పెయింటింగ్‌తో చెప్తున్నారు మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట గ్రామానికి చెందిన గిన్నె వెంకటేశ్వర్లు. 'లాక్‌డౌన్ ఒక్కటే కరోనా వైరస్‌ను చంపే ఆయుధం' అని సందేశాన్ని తన చిత్రం ద్వారా అందిస్తూ పలువురి ప్రశంసలు అందుకొంటున్నారు.
– మూసాపేట, నమస్తే తెలంగాణ



బాన్సువాడలో జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న స్పీకర్ పోచారం

## ఇండ్లల్లో ఉంటేనే మేలు

స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ :** కరోనా మహమ్మారి బారిన పడకుండా ప్రజలందరూ ఇండ్లకే పరిమితం కావాలని శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తిచేశారు. బుధవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కలెక్టర్ శరత్, ఎస్పీ శ్వేతారెడ్డి, అధికారులతో కరోనా కట్టడికి తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. స్పీకర్ మాట్లాడుతూ.. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు ఇష్టారాజ్యంగా తిరిగి ఇబ్బందులు తేవద్దని కోరారు. ధాన్యం విక్రయాల గురించి రైతులు ఆందోళన చెందొద్దని అన్నారు.




లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

## వలస కార్మికులకు సర్కారు అండ

- మంత్రి సత్యవతిరాథోడ్

**మహబూబాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 5 క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల పప్పు, నిత్యావసరాలను మంత్రి పంపిణీ చేశారు. ఫ్లైవర్ బ్రిడ్జి వద్ద 40 మంది వలస కూలీలకు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి నిత్యావసరాలతోపాటు రూ.500 చొప్పున పంపిణీ చేశారు.

- నేడే సీతారాముల కల్యాణం



భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణం నవమి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. కరోనా నేపథ్యంలో సీతారాముల జగత్కల్యాణం నిరాడంబరంగా జరుపాలని ప్రభుత్వం నిశ్చయించింది. ప్రభుత్వం తరపున మంత్రులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. శుక్రవారం బేడా మండపంలో శ్రీరామపట్టాభిషేకం వేడుక నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి భద్రాద్రిలో నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవంలో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. – భద్రాచలం, నమస్తే తెలంగాణ



వరంగల్ రూరల్ జిల్లా వీధుల్లో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## ప్రజాచైతన్యంతోనే కరోనా దూరం

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**పర్వతగిరి:** ప్రజాచైతన్యంతోనే కరోనా మహమ్మారిని తరిమేయవచ్చని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మంత్రి సొంత గ్రామం వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలో బుధవారం పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. ప్రజలకు మాస్కులు పంపిణీ చేసి, వీధుల్లో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్వయంగా పిచికారీ చేశారు.

## సెట్ దరఖాస్తులకు 20 వరకు గడువు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అన్నిరకాల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించారు. కరోనా నేపథ్యంలో ఈ మేరకు నిర్ణయించినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి బుధవారం వెల్లడించారు. మరోవైపు, మే 4 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న ఎంసెట్- 2020, మే 2న నిర్వహించనున్న ఈసెట్‌ను- 2020ని వాయిదా వేసే అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. కరోనా పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని సంబంధిత అధికారులు చెప్తున్నారు.

**తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య**
ఇ-మెయిల్: proc.tsmarkfed2018@gmail.com. ఫోన్ నం:040-2460 7108 ఫ్యాక్స్: 040-2460 7100
**TS మార్క్‌ఫెడ్ 2018-19 ద్వారా సేకరించిన జొన్నలు అమ్మకానికి టెండరు**
తేది: -04-2020
TS మార్క్‌ఫెడ్ 2018-19 ద్వారా సేకరించిన జొన్నలు అమ్మకానికి టెండరు ప్లాట్‌ఫారం http://tender.telangana. gov.in పై టెండరు ప్రకటన. ఆన్‌లైన్ సీల్డు టెండరింగ్ రెండు బిడ్ విధానం (అనగా సాంకేతిక మరియు ఆర్థిక బిడ్). బిడ్ దాఖలు ప్రారంభ తేది: 03-04-2020న మ.2.00 గం. నుండి. బిడ్ దాఖలు ముగింపు తేది: 13-04-2020న మ.12.00గం వరకు. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 15-04-2020న మ.12.00 గం నుండి. ఆర్థిక బిడ్ తెరుచు తేది: 15-04-2020న మ.2.00గం. తదుపరి వివరాలకు సంప్రదించండి ఫోన్ 7288879806 మరియు 7288879829
DIPR RO No:1046 PP/CL/Advt/1/2020-21, Dt:01-04-2020 సం/- మేనేజింగ్ డైరెక్టర్

**తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య**
ఇ-మెయిల్: proc.tsmarkfed2018@gmail.com. ఫోన్ నం:040-2460 7108 ఫ్యాక్స్: 040-2460 7100
**ఖరీఫ్ 2019-20 కాలంలో TS మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన మొక్కజొన్న అమ్మకానికి టెండరు**
Rc No. 786/P&M/Maize Kharif 2019-20 Disposal/2019-20 తేది: -04-2020
TS మార్క్‌ఫెడ్ 2019-20 ద్వారా సేకరించిన 6961.909 పరిమాణం గల మొక్కజొన్న అమ్మకానికి ఆన్‌లైన్ ఇ-వేలం కోసం టెండరు ప్రకటన. ఆన్‌లైన్ వేలం తేది: 15-04-2020న ఉ: 10.00 గం నుండి సా. 5.00 గం. వరకు e-procurement.telangana.gov.in లేదా https://auction.telangana.gov.in/ అనగా తెలంగాణ ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా ప్రారంభమవుతుంది.(దరఖాస్తులు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో 03-04-2020న మధ్యాహ్నం నుండి లభిస్తాయి). ఆన్‌లైన్ నమోదు మరియు తదుపరి వివరాలకు సంప్రదించండి శ్రీ సందీప్ ఫోన్ 7337318404 (సర్వీస్ ప్రొవైడర్స్ M/s Vupadhi టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్) తదుపరి వివరాలకు సంప్రదించండి ఫోన్ 7288879806 మరియు 7288879829.
DIPR RO No: 1047 PP/CL/Advt/1/2020-21, Dt: 01-04-2020 సం/- మేనేజింగ్ డైరెక్టర్

**రామగుండం మునిసిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి జిల్లా.**
E-mail:ramagundam.corporation@gmail.com
**ఆసక్తి వ్యక్తీకరణ – EOI**
Lr. నం. E1/EE-I/GF/RMC/2020, తేది: 31-03-2020
i) పనిలేని వాహనాల ప్రస్తుత స్థితిని పరిశీలించి మరియు స్పేర్స్, మరమ్మత్తులు మరియు సర్వీస్ ఛార్జీల కోసం రేట్ కొటేషన్లు దాఖలు చేయుటకు. ii) అన్ని మునిసిపల్ వాహనాలు అనగా JCB, డంపర్ ప్లేసర్, బొలెరో క్యాంపర్, బ్లేడ్ ట్రాక్టర్, స్కై లిఫ్టర్, ఫాగింగ్ ఆటో, ట్రాక్టర్స్, ఆటో ట్రాలీలు మొ||వి. వార్షిక నిర్వహణ నిమిత్తం రేట్ కొటేషన్ కోసం ఆటోమొబైల్ రంగంలో మంచి అనుభవం కలిగిన పేరొందిన ఏజెన్సీల నుండి ఆసక్తి వ్యక్తీకరణ కోరబడుచున్నది. తదుపరి ఏజెన్సీ భారీ మరమ్మతుల కోసం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్/AMVI సర్టిఫికెట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఆసక్తిగల ఏజెన్సీలు తమ అర్హతకు మద్దతుగా అవసరమైన డాక్యుమెంట్లతో పాటు సీల్డు కవర్‌లో తమ EOI ని 9-4-2020న లేదా ఆలోగా సా. 5.00 గం.కు దిగువ సంతకందారు కార్యాలయానికి చేరువిధంగా దాఖలు చేయాల్సిందిగా కోరబడుచున్నారు. ఏవేని విచారణల కోసం శ్రీ M. అభినయ్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రామగుండం మునిసిపల్ కార్పొరేషన్, మొబైల్ నం. 9704615737ను సంప్రదించవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO.No.1036 - PP/CL/Advt/1/2020-21 Dt: 01.04.2020

## రైల్వే పార్సిల్‌కు 'ఎక్స్‌ప్రెస్' సేవలు

నేడు సికింద్రాబాద్-హౌరా రూట్‌లో ప్రారంభం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో పార్సిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. సికింద్రాబాద్-హౌరా మధ్య గురువారం మొదటి రైలును, ఈ నెల 9న మరో రైలును నడుపనున్నది. ఇప్పటికే గూడ్స్ రైళ్ల సేవలు కొనసాగిస్తున్న దక్షిణ మధ్య రైల్వే.. ఇండస్ట్రియల్ హోమ్స్, కంపెనీలు, ఎన్జీవోల విజ్ఞప్తిమేరకు తాజా నిర్ణయం తీసుకున్నది. నిత్యావసర, అత్యవసర సామగ్రిని పార్సిల్ ఎక్స్‌ప్రెస్ సర్వీసుల ద్వారా చేర్చుతారు. సికింద్రాబాద్-హౌరా మార్గంలోని కాజీపేట, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, అనకాపల్లి, సింహాచలం నార్త్, భువనేశ్వర్, భద్రక్, బాలాసోర్, మచ్చెడ స్టేషన్లలో పార్సిల్ సేవలు అందుబాటులో ఉంటాయి. మరిన్ని ప్రాంతాలకు పార్సిల్ సర్వీసులను ప్రారంభించాలని రైల్వే యోచిస్తున్నది.

## కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

**హైదరాబాద్/ హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక నుంచి మరాత్వాడా వరకు ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మీదుగా సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తువద్ద ఉపరితల ద్రోణి కొనసాగుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. దీని ప్రభావంతో బుధవారం రాష్ట్రంలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిశాయని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎండలు మరింత పెరిగాయి. బుధవారం మధ్యాహ్నం ఆకాశంలో మబ్బులు కమ్ముకొన్నా.. ఉష్ణోగ్రతలు మాత్రం ఎక్కువగానే నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26.2 డిగ్రీలుగా నమోదైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గురువారం సైతం పొడి వాతావరణం నెలకొని, ఉక్కపోత ఉంటుందని చెప్పారు.



ఇందల్వాయిలో మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

- మంత్రి నిరంజన్‌రెడ్డి

**జక్రాన్‌పల్లి/ఇందల్వాయి:** రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలంలోని నారాయణపేట్, ఇందల్వాయి మండలంలోని గన్నారంలో మంత్రి బుధవారం పర్యటించారు. నారాయణపేట్, ఇందల్వాయిలోమక్కల కొనుగోలు కేంద్రాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కరోనా నేపథ్యంలో గ్రామాల్లో రైతుల కల్లాల వద్దకే అధికారులు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని చెప్పారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష వాయిదా

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యం లో జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)-అడ్వాన్స్‌డ్ పరీక్షను వాయిదా వేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ వినీత్‌జోషి తెలిపారు. దేశంలోని 23 ఐఐటీల్లో ప్రవేశాల కోసం జేఈఈ-అడ్వాన్స్‌డ్-2020 పరీక్షను షెడ్యూల్ ప్రకారం మే 17న నిర్వహించాల్సి ఉన్నది. ఏప్రిల్‌లో నిర్వహించాల్సి ఉన్న జేఈఈ (మెయిన్) పరీక్ష కరోనా నేపథ్యంలో వాయిదా పడింది. దీంతో జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షను కూడా వాయిదా వేస్తున్నట్టు పేర్కొన్నారు. జేఈఈ(మెయిన్) పరీక్ష తేదీని నిర్ణయించిన తర్వాత అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీల్ని ప్రకటిస్తామని చెప్పారు. ఈ నెల 15 తర్వాత అడ్మిట్ కార్డులను జారీచేసే అవకాశాలను పరిశీస్తున్నామని తెలిపారు.

- ఇంటింటికీ శానిటైజర్లు



కరోనా వైరస్ వ్యాప్తి కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలతోపాటు ప్రజారోగ్య సంరక్షణ చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా బుధవారం మంత్రి హరీశ్‌రావు ఆదేశాలతో సిబ్బంది సిద్దిపేట పట్టణంలో ఇంటింటికీ శానిటైజర్లను పంపిణీ చేశారు.



లాక్‌డౌన్ సందర్భంగా టీఎన్జీవో హైదరాబాద్ జిల్లాశాఖ అధ్యక్షుడు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్‌లోని జహీరానగర్‌లో 504 పేద కుటుంబాలకు బియ్యం, పిండి, పప్పులు, వంట నూనెలను పంపిణీ చేశారు. క్యాన్సర్, ఒమెగా దవాఖానల్లో 300 మందికి అన్నదానం చేశారు.
– హైదరాబాద్, నమస్తే తెలంగాణ




9 | నమస్తే తెలంగాణ | కరీంనగర్
గురువారం 2 ఏప్రిల్ 2020
www.ntnews.com

## జర నవ్వుకో!





**తండ్రి** : ఏంట్రా.. నా పేరును అడ్డంగా కాకుండా నిలువుగా రాస్తున్నావు?

**కొడుకు** : మా టీచర్ తండ్రి పేరు నిలబెట్టాలి అని చెప్పారు నాన్నా!!

****

**టీచర్** : ఏంటీ.. క్లాసుకు రావడం ఆలస్యం అయిందేంటి?

**సుధీర్** : మీరే కదా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి అని చెప్పారు!

**టీచర్** : అయితే..?

**సుధీర్** : మరి.. అక్కడ బోర్డ్ మీద నిదానమే ప్రధానం అని రాసుంది. అందుకే అక్కడి నుంచి ఇక్కడి వరకు మెల్లగా నడిచేసరికి లేటయిపోయింది.

## దారి కనుక్కోండి



## పద్యం



పట్టు పట్టరాదు పట్టి విడువరాదు
పట్టెనేని బిగియ పట్టవలయు
పట్టి విడుట కన్న పడిచచ్చుటే మేలు
విశ్వదాభిరామ వినురవేమ

**భావం:** ఏ విషయంలోనై పట్టుదలకు పోవద్దు. ఒకవేళ పోతే మాత్రం దానిని చివరి వరకు నిలుపుకోవాలి. మధ్యలోనే వదిలి వేయువారు మూఢులు. కాబట్టి పంతాన్ని చివరిదాకా కొనసాగించాలి. లేదంటే అసలు పట్టుపట్టకుండా అయినా ఉండాలి.

## నేర్చుకొందాం..

**నాకు ఇంగ్లిష్ మాట్లాడటం పట్ల చాలా ఆసక్తి**

I'm very interested to speak English.
అయామ్ వెరీ ఇంటరెస్టెడ్ టు స్పీక్ ఇంగ్లిష్.

**నేను ప్రతి రోజూ పాఠశాలకు వెళ్తాను.**

I go to school everyday.
ఐ గో టు స్కూల్ ఎవ్రీడే.



## చుక్కలు కలుపండి




## జ్ఞానం

**ఒక స్వామీజీ** ఆశ్రమ పాఠశాలను నడిపేవారు. విద్యార్థులు చిన్నతనంలోనే అక్కడ చేరి విజ్ఞానవంతులయ్యే వారు. వారిలో విశ్వనాథుడు, శ్రీనివాసుడు అనే శిష్యులు ఉండే వారు. మిగతా వాళ్లందరూ ఇండ్లకు వెళ్లినా వీళ్లు మాత్రం గురువు దగ్గరే ఉండేవారు. అన్ని విద్యల్లోనూ సమానమైన ప్రతిభ కనబరిచే వారు. గురువుకు వీళ్లంటే చాలా ఇష్టం. తన తర్వాత ఆ ఆశ్రమ పీఠాన్ని వారిలో ఒకరికి ఇవ్వాలనుకున్నాడు. అయితే ఎవరు దానికి అర్హులో తెలుసుకోవడానికి చిన్న పరీక్ష పెట్టాడు. ఒకరోజు వారిని పిలిచి, ' నేను తపస్సు చేసుకోవడానికి వెళ్లాలనుకుంటున్నాను. రేపటిలోగా నాకో జింక చర్మం కావాలి. తీసుకురండి'అని చెప్పాడు. విశ్వనాథుడు, శ్రీనివాసుడు చెరోదిక్కుకు వెళ్లారు. అడవిలో ఎక్కడైనా చనిపోయిన జింక కనపడుతుందేమోనని విశ్వనాథుడు వెతికాడు. ఎంత ప్రయత్నించినా దొరకలేదు. ఖాళీ చేతులతో ఆశ్రమానికి తిరిగి వచ్చాడు.

శ్రీనివాసుడు దగ్గరలో ఉన్న ఒక గ్రామానికి వెళ్లి విల్లు, బాణం, చురకత్తి మొదలైనవి కొన్నాడు. అరణ్యానికి వెళ్లి ఒక జింకను వేటాడాడు. దాని చర్మాన్ని ఒలిచి గురువుకు ఇవ్వడానికి బయలుదేరాడు. శ్రీనివాసుడు వెళ్లే సమయానికి విశ్వనాథుడు చేతులు కట్టుకొని గురువుగారి ముందు నిలబడి జింక చర్మం కోసం తను చేసిన ప్రయత్నం గురించి వివరిస్తున్నాడు. శ్రీనివాసుడు అదంతా పక్కన ఉండి వింటున్నాడు. విశ్వనాథుడు మాట్లాడటం అయ్యాక శ్రీనివాసుడు వెళ్లి ఎంతో గర్వంగా జింక చర్మం గురువు ముందు పెట్టాడు. దాన్నిఎలా సంపాదించాడో చెప్పాడు. గురువు కొద్దిసేపు మౌనంగా ఉండి తర్వాత ఇలా అన్నారు, 'నాయనా శ్రీనివాసా! నేను ఇంతకాలం ఈ భూమి మీద పుట్టిన ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉంటుందనీ, సాటి జీవుల పట్ల దయ కలిగి ఉండాలనీ బోధిస్తూ వచ్చాను. నువ్వు విజ్ఞానాన్ని సంపాదించావే కానీ, జ్ఞానాన్ని పొందలేదు. విశ్వనాథుడు నా మాటకంటే, భూతదయకే ఎక్కువ విలువనిచ్చాడు. ఈ ఆశ్రమ బాధ్యతలను నా తర్వాత అతనికే అప్పగిస్తాను. ఒక జీవి చనిపోవడానికి నేనూ కారణం అయ్యాను. నా మనసేం బాగలేదు. నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి హిమాలయాల్లోకి వెళ్లిపోతున్నాను'అని చెప్పి ఆశ్రమ బాధ్యతలు విశ్వనాథుడికి అప్పగించి తపస్సుకు వెళ్లిపోయాడు.

**నీతి** గురుభక్తి ఉండాలి. కానీ అది గుడ్డిగా ఉంటే అనర్థాలకు దారి తీస్తుంది.




## క్రీడాకారిణులను గుర్తించండి




1. హిమదాస్ (అథ్లెటిక్స్)
2. ఈషా సింగ్ (షూటర్)
3. మేరీ కోమ్(బాక్సింగ్ )
4. మిథాలీ రాజ్ (క్రికెట్)
5. ద్యుతీ చంద్ (అథ్లెటిక్స్)
6. దీపా కర్మాకర్ (జిమ్నాస్టిక్స్)


## సరైన నీడను కనిపెట్టండి



**జవాబులు**

1. హిమదాస్ (B)
2. ఈషా సింగ్(A)
3. మేరీ కోమ్ (F)
4. మిథాలీ రాజ్ (E)
5. ద్యుతీ చంద్ (D)
6. దీపా కర్మాకర్ (C)

## పెద్దల మాట



అందరూ ప్రపంచాన్ని మార్చాలని ఆలోచించే వాళ్లే. కానీ తమని తాము మార్చుకోవాలని మాత్రం అనుకోరు.

**- లియో టాల్‌స్టాయ్**

# చిత్రం

## ఆర్జీవీపై రామబాణం


జొన్నవిత్తుల

**గే**య రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు దర్శకత్వంలో మాగ్నస్ సినీ ప్రైమ్ పతాకంపై రూపొందుతున్న చిత్రం 'ఆర్జీవీ'. 'రోజూ గిల్లే వాడు' ఉపశీర్షిక. వెంకట శ్రీనివాస్ బొగ్గరం('కార్తికేయ' ఫేమ్), టారస్ సినికార్ప్ సమర్పణలో బాల కుటుంబరావు పొన్నూరి నిర్మిస్తున్నారు. సురేష్, రాశి, శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం టైటిల్ లోగోను చిత్రబృందం విడుదలచేసింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తా చెడ్డ కోతి వనమెల్లా చెరిచినట్లు తన పిచ్చి ఇజంతో యువతను పెడ త్రోవ పట్టిస్తున్న ఓ వ్యక్తి ఫిలాసఫీ మీద సంధించిన రామబాణమే ఈ చిత్రం. అందుకే శ్రీరామనవమి రోజున టైటిల్ లోగోను విడుదల చేశాం' అని తెలిపారు. చిత్ర సమర్పకుడు వెంకట శ్రీనివాస్ బొగ్గరం మాట్లాడుతూ 'సామాజిక బాధ్యత లేని ఓ వ్యక్తి ఐడియాలజీ సమాజాన్ని ఎలా కలుషితం చేస్తుందో ఈ సినిమాలో చూపించబోతున్నాం. కరోనా ప్రభావం తగ్గిన తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని తెలిపారు. అమిత్, పునర్నవి భూపాలం, తేజ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: వేదాంత్ మల్లాది, కూర్పు: కార్తిక శ్రీనివాస్, సంగీతం:వీణాపాణి, కథ, మాటలు, పాటలు, చిత్రానువాదం, దర్శకత్వం:జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు.

## ఉక్కు సంకల్పంతో తరుముదాం..


కీరవాణి

'ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి ఇక్కడే చేరింది మహమ్మారి రోగ మొక్కటి. ఎక్కడివాళ్లు అక్కడే ఉండి ఉక్కు సంకల్పంతో తరుముదాం దాన్ని బయటకి. వీ విల్ స్టే ఎట్ హోమ్. వీ స్టే సేఫ్' అంటూ పాట రూపంలో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కల్పించారు సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి. 'స్టూడెంట్ నెంబర్ వన్' చిత్రంలోని 'ఎక్కడో పుట్టి..' అనే పాట పేరడీగా కీరవాణి స్వరపరిచి ఆలపించిన ఈ పాటలో కరోనాపై వస్తోన్న అసత్య వార్తలను నమ్మవద్దని, సామాజిక దూరం పాటించాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి వ్యాయామం, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని సూచించారు. ప్రస్తుతం సోషల్‌మీడియాలో ఈ పాట అందరిని ఆకట్టుకుంటున్నది.

## కనిపించని పురుగు


రామ్‌గోపాల్ వర్మ

**రా**మ్‌గోపాల్‌వర్మ పంథాయే భిన్నం. అందరూ కరోనా ప్రభావంతో భయపడుతుంటే వర్మ మాత్రం ఈ వైరస్‌పై సామాజిక మాధ్యమాల్లో తనదైన శైలిలో ఛలోక్తుల్ని సంధిస్తూ నవ్విస్తూనే ఆలోచింపజేస్తున్నారు. తాజాగా కరోనా వైరస్‌పై ఓ పాటను పాడారు వర్మ. 'అది ఒక పురుగు. కనిపించని పురుగు. కరోనా అనే ఒక పురుగు. నలిపేద్దామంటే అంతా సైజ్ లేదు దానికి. పచ్చడి చేద్దామంటే కండ లేదు దానికి. అదే దాని బలం. అదే దాని దమ్ము' అంటూ వర్మ స్వయంగా ఆలపించిన ఈ గీతం అలరిస్తున్నది. ఈ పాటకు రామ్‌గోపాల్ వర్మ సాహిత్యాన్ని సమకూర్చారు. బుధవారం ట్విట్టర్ ద్వారా ఈ పాటను ఆయన విడుదల చేశారు.


కుటుంబసభ్యులతో మంచు విష్ణు

## భార్యాపిల్లల్ని మిస్సవుతున్నా

**క**రోనా ప్రభావం వల్ల భార్యాపిల్లలు విదేశాల్లో ఉండిపోవడంతో వారికి దూరమవ్వడం ఆవేదనను కలిగిస్తున్నదని అన్నారు హీరో మంచు విష్ణు. తనలాగే ఎంతో మంది ఇలాంటి బాధను అనుభవిస్తున్నారని తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేసిన విష్ణు 'లాక్‌డౌన్ ఎన్నో రోజనేది కూడా మర్చిపోయా. చాలా ఇబ్బందిగా ఉంది. గడ్డం ఎందుకు పెంచుతున్నావని చాలా మంది అడుగుతున్నారు. కొంతమందికి గడ్డం నచ్చుతుంది. కొంత మందికి నచ్చడం లేదు. ఓ కారణం వల్ల గడ్డం పెంచుతున్నాను. విరోనికాతో పాటు పిల్లలను కలిసినప్పుడే గడ్డం తీసేస్తాను. వారందరూ విదేశాల్లో ఉన్నారు. ఫిబ్రవరి చివరి వారంలో మా కుటుంబసభ్యులొకరి సర్జరీ కోసం అందరం వేరే దేశం వెళ్లాం. మార్చి 19న నాన్న పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏడాది విద్యానికేతన్ వార్షికోత్సవాన్ని జరుపుతుంటాం. ఆ వేడుక కోసం నేను ముందుగావచ్చాను. విరోనికాతో పాటు పిల్లలు నాలుగైదు రోజుల తర్వాత రావాల్సింది. విపత్కర పరిస్థితుల కారణంగా మన దేశంలోకి అంతర్జాతీయ విమానాల ప్రవేశాన్ని ఆపేశారు. ఏప్రిల్ 14 తర్వాత విమాన సేవల్ని పునరుద్ధరిస్తారని అనుకుంటున్నాను. అరియానా, వివియానా పుట్టిన తర్వాత ఎప్పుడైన వేరే ఊరికి వెళితే ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేవాణ్ణి. పిల్లలతో నాకు అటాచ్‌మెంట్ ఎక్కువ. ఈ సమయంలో అందరం ఒకే దగ్గర ఉంటే బాగుండేదనిపిస్తుంది.ఫోన్‌లో మాట్లాడుతున్నా మనసుకు కష్టంగా ఉంది. వారిని చాలా మిస్ అవుతున్నాను. నాలాగే ఈ బాధను చాలా మంది అనుభవిస్తున్నారు' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. లాక్‌డౌన్‌ను విధిగా ప్రతి ఒక్కరూ పాటించాలని ఆయన అన్నారు.

## అజయ్ దేవ్‌గణ్ కోటి పది లక్షల విరాళం


అజయ్ దేవ్‌గణ్


మాధురీ దీక్షిత్


శ్రీప్రియ

**కేం**ద్రంతో పాటు రాష్ట్రప్రభుత్వాలకు విరాళాల్ని అందిస్తూ తమ సహృదయతను చాటుకుంటున్నారు బాలీవుడ్ ప్రముఖులు. హీరో అజయ్ దేవ్‌గణ్ తన నిర్మాణ సంస్థ అజయ్ దేవ్‌గణ్ ఫిల్మ్స్ ద్వారా కోటి పది లక్షల రూపాయల్ని పీఎం కేర్స్‌కు విరాళంగా ఇచ్చారు. ఒకరికొకరం అండగా నిలవాల్సిన సమయమిదని, ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉంటూ కరోనాను అంతమొందించాలని అజయ్‌దేవ్‌గణ్ అన్నారు. నటి, దర్శకురాలు శ్రీప్రియ తన భర్తపిల్లలతో కలిసి పీఎం కేర్స్ పదిహేను లక్షలు, తమిళనాడు ముఖ్యమంత్రి సహాయనిధికి పదిహేను లక్షల్ని విరాళంగా అందజేశారు. అలాగే బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ తన భర్త శ్రీరామ్‌తో కలిసి పీఎం కేర్స్‌కువిరాళాన్ని అందించినట్లు తెలిపింది. ఎంత మొత్తాన్ని ఇచ్చిందనేది మాత్రం మాధురి వెల్లడించలేదు. బాలీవుడ్ తారాగణం స్వచ్ఛందంగా ముందుకొస్తూ విరాళాలు ఇస్తుండటంతో వారిపై ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసల్ని కురిపించారు. 'వితరణను అందిస్తూనే ప్రజల్లో కరోనా పట్ల చైతన్యాన్ని కల్పించడంలో భారతీయ నటీనటులంతా ముఖ్యభూమిక పోషిస్తున్నారు' అని మోదీ ట్విట్టర్ ద్వారా తెలిపారు.


సోనాక్షి సిన్హా

## అది వ్యక్తిగతం

**క**రోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రజలతో పాటు ప్రభుత్వాలకు భాషాభేదాలకు అతీతంగా సినీ నటులంతా అండగా నిలుస్తున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు తమకు చేతనైనా సహాయాన్ని అందిస్తున్నారు. కొందరు అగ్రనాయకానాయికలు విరాళాల్ని ప్రకటించకపోవడం విమర్శలకు దారి తీస్తున్నది. సామాజిక మాధ్యమాల్లో అభిమానులు వారిని ట్రోల్ చేస్తున్నారు. బాలీవుడ్ కథానాయిక సోనాక్షి సిన్హాకు అలాంటి అనుభవమే ఎదురయ్యింది. ఇప్పటివరకు ఆమె ఎలాంటి విరాళాన్ని ప్రకటించకపోవడం, వైరస్ పట్ల అవగాహన కల్పించడానికి ముందుకు రాకపోవడంతో ఆమెను విమర్శించడం మొదలుపెట్టారు. వారికి ఘాటుగానే సమాధానమిచ్చింది సోనాక్షి. చేసిన సహాయాన్ని వెల్లడించాలా? వద్దా? అన్నది పూర్తిగా వ్యక్తిగతమని చెప్పింది. తమకున్న సమయాన్ని ప్రతి ఒక్కరూ మంచి పనుల కోసం వినియోగిస్తే బాగుంటుందని తెలిపింది. ట్రోల్స్ చేస్తున్న వారి పట్ల మౌనంగా ఉండటమే మంచిదనుకుంటున్నానని సోనాక్షి సిన్హా బదులిచ్చింది.






# కట్టడి ఉల్లంఘిస్తే కటకటాలే..

- సోషల్ మీడియాపై నిరంతరం నిఘా
- తప్పుడు ప్రచారం చేస్తే ఐదేళ్ల జైలు
- గ్రూపు అడ్మిన్లూ జాగ్రత్త
- 'లాక్‌డౌన్' పాటించకుంటే శిక్షలు
- జియో ట్యాగింగ్‌పై నజర్
- ప్రజలు సహకరిస్తేనే పరిష్కారం
- కమిషనరేట్ పరిధిలో 2,500 వాహనాలు సీజ్
- 'నమస్తే' ప్రత్యేక ఇంటర్వ్యూలో సీపీ కమలాసన్‌రెడ్డి

**మీకు తెలుసా.. కొవిడ్-19పై సోషల్** మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తే ఐదేళ్ల జైలు.. అలాగే గ్రూపు అడ్మిన్లకు కఠిన శిక్షలుంటాయని.. ఇవే కాదు, ప్రస్తుత పరిస్థితుల్లో హోం క్వారంటైన్ నుంచి తప్పించుకున్నా, లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించినా, ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయకపోయినా, అతిక్రమించినా, సామాజిక దూరం పాటించకపోయినా, ఐదుగురికి మించి వ్యక్తులు కలిసి గ్రూపులుగా కలసి మాట్లాడినా, విదేశాల నుంచి వచ్చి సమాచారం ఇవ్వకపోయినా, సహేతుకమైన కారణం లేకుండా రోడ్లపైకి వచ్చినా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలపై ఎక్కువ మంది వెళ్లినా కఠిన శిక్షలుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కరోనా కట్టడి కోసం చేపట్టిన ఏ ఒక్క నిబంధన ఉల్లంఘించినా కటకటాలు లెక్కించాల్సిందే. ప్రస్తుతం కరోనా మహమ్మారి ప్రజల జీవితాలపై పగడవిప్పి ఆడుతోంది. ఎప్పుడు ఎవరని కాటేస్తుందో తెలియని పరిస్థితుల మధ్య ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అమలవుతున్న చట్టాలు.. ఉల్లంఘనకు పాల్పడితే నమోదయ్యే కేసులు.. వాటి ద్వారా పడే శిక్షలు.. వంటి అనేక అంశాలపై 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో సీపీ కమలాసన్‌రెడ్డి వివరించి చెప్పారు.

**- కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ**




**ప్రశ్న : సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే ఏయే కేసులు నమోదు చేస్తారు. గ్రూపు అడ్మిన్లపై ఎలాంటి కేసులు ఉంటాయి.?**

**సీపీ:** విపత్తు నిర్వహణ చట్టం, 2005లోని 54వ సెక్షన్ కింద కేసు నమోదు చేయవచ్చు. 54 సెక్షన్ కింద ఒక సంవత్సరం వరకు జైలు లేదా జరిమానా విధించ వచ్చు. అలాగే సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రకటనలు, పుకార్లు సృష్టించినా, ప్రచురించినా, ప్రసారం చేసినా భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 505 (1) (బీ) కింద కేసు నమోదు చేస్తాం. ఈ సెక్షన్ కింద మూడేళ్ల జైలు, లేదా జరిమానా లేదా రెండింటితో కూడిన శిక్షలుంటాయి.

**ప్రశ్న : హోం క్వారంటైన్ నుంచి తప్పించుకుంటే ఏయే కేసులు పెడతారు. వాటి వల్ల వారికి భవిష్యత్‌లో ఎదురయ్యే ఇబ్బందులు?**

**సీపీ:** ఇండియన్ పీనల్ కోడ్ 1860లోని సెక్షన్ 188 ఏ ప్రకారం ఒక నెల వరకు జైలు లేదా ₹200 జరిమానా, లేదా రెండు శిక్షలూ ఉంటాయి. 188 సెక్షన్-బీ ప్రకారం ఆరు నెలల వరకు జైలు పొడిగింపు, లేదా ₹వెయ్యి వరకు జరిమానా లేదా ఈ రెండూ ఉంటాయి.

- ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్, 1897లోని సెక్షన్ 3 ప్రకారం నిబంధనలను లేదా ఉత్తర్వులను ఉల్లంఘించినా, లేదా ధిక్కరించిన వ్యక్తికి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 188 (1860లో 45) ప్రకారం శిక్షార్హమైన నేరానికి పాల్పడినట్లు పరిగణించబడుతుంది. ఐపీసీ, 1860లోని సెక్షన్ 336 కింద మూడు నెలల వరకు జైలు లేదా ₹250 జరిమానా, లేదా రెండు శిక్షలూ ఉంటాయి. అలాగే ఐపీసీ 1860లోని 269, 270, 271 సెక్షన్ల ప్రకారం శిక్షలుంటాయి. 269, 271 సెక్షన్ల ప్రకారం ఆరు నెలల జైలు, లేదా జరిమానా లేదా రెండింటితో కూడిన శిక్ష, అలాగే 270 సెక్షన్ ప్రకారం రెండేళ్ల వరకు జైలు లేదా జరిమానా లేదా రెండింటితో కూడిన శిక్షలుంటాయి.
- విపత్తు నిర్వహణ చట్టం 2005లోని సెక్షన్ 51 ప్రకారం.. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా జిల్లా అథారిటీ ఇచ్చిన ఆదేశాలను పాటించడానికి నిరాకరిస్తే.. సంబంధిత వ్యక్తులకు ఏడాది జైలుతోపాటు ఇతర శిక్షలుంటాయి. అలాగే సెక్షన్ 51 నుంచి 58 ప్రకారం.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలు, కార్యాలయాలకు జరిమానాలు విధించవచ్చు. ఈ విషయంలో సోషల్ మీడియా గ్రూపు అడ్మిన్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసి కోర్టులో ప్రవేశ పెట్టి, ప్రాసిక్యూట్ చేస్తారు.

**ప్రశ్న : లాక్‌డౌన్‌లో ఉల్లంఘనలకు పాల్పడితే ఎటువంటి కేసులు పెడతారు?**

**సీపీ:** ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897 లోని సెక్షన్ 3, ఐపీసీ 188, 336, 269, 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కింద కేసులు నమోదు చేసి వారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేస్తారు.

**ప్రశ్న : కరోనా నేపథ్యంలో సామాజిక దూరం పాటించకపోతే ఎలాంటి చర్యలుంటాయి?**

**సీపీ:** ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 3, అలాగే, ఐపీసీలోని 188, 336, 269, 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కింద కేసు నమోదు చేయవచ్చు. కేసు నమోదైన వ్యక్తులను కోర్టులో ప్రాసిక్యూట్ చేస్తారు.

**ప్రశ్న : ఐదుగురు వ్యక్తులకు మించి సమూహం ఉండవద్దని చెబుతున్నారు. ఇలాంటివి గుర్తించినప్పుడు పెట్టే కేసులు? వాటితో ఎదురయ్యే ఇబ్బందులు?**

**సీపీ:** ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897, సెక్షన్లు 336, 269, ఐపీసీ 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కాకుండా, ఐపీసీ కింద కేసు నమోదు చేయవచ్చు. వారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేస్తారు. అలాగే 142 సెక్షన్ ప్రకారం అసెంబ్లీ కావడాన్ని చట్ట విరుద్ధంగా గుర్తిస్తారు. ఈ పరిస్థితుల్లో 143 సెక్షన్ ప్రకారం ఆరు నెలల జైలు లేదా జరిమానా లేదా రెండింటితో కూడిన శిక్షలు, అలాగే 145 సెక్షన్ ప్రకారం రెండేళ్ల జైలు లేదా జరిమానా లేదా రెండింటితో కూడిన శిక్షలుంటాయి.

**ప్రశ్న : రెడ్‌జోన్ ప్రాంతాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలు?**

**సీపీ:** ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 3, ఐపీసీలోని 188, 336, 269, 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కింద కేసు నమోదు చేసి వారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేస్తారు.

**ప్రశ్న: విదేశాల నుంచి వచ్చి సమాచారం ఇవ్వకుంటే ఏయే కేసులు నమోదు చేస్తారు? తద్వారా వారికి ఎదురయ్యే పరిణామాలు?**

**సీపీ:**విదేశీయుల నమోదు చట్టం 1939లోని సెక్షన్ 5 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించినా, లేదా ఉల్లంఘించడానికి ప్రయత్నించినా ఏడాది పాటు జైలు ఉంటుంది. దీనిని పొడిగించవచ్చు. లేదా జరిమానాలుంటాయి. సెక్షన్ 14, సెక్షన్ 3లోని ఉప సెక్షన్ 2 నిబంధన ఎఫ్, సెక్షన్ 14ఏ, 14బీ, 14సీ, అలాగే 1950 పాస్‌పోర్టు చట్టం ప్రకారం పలు రకాల శిక్షలుంటాయి. ఒక దశలో ఐదేళ్లకు పైగా జైలు కూడా ఉంటుంది. ఇవే కాదు, చాలా కఠినతరమైన శిక్షలున్నాయి.

**ప్రశ్న : ప్రస్తుత పరిస్థితుల్లో నిబంధనలు పాటించకుండా ప్రజలు రోడ్లపైకి వస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

**సీపీ:** ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 3, సెక్షన్లు. ఐపీసీలోని 188, 336, 269, 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కింద కేసు నమోదు చేసి వారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేయవచ్చు.

**ప్రశ్న : ప్రస్తుతం బైక్‌పై ఒక్కరు, నాలుగు చక్రాల వాహనంలో ఇద్దరు వెళ్లాలని చెబుతున్నారు. అంతకంటే ఎక్కువ మంది వెళ్తే ఎలాంటి కేసులు పెడతారు?**

**సీపీ:** ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 3, సెక్షన్లు. ఐపీసీలోని 188, 336, 269, 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కింద కేసు నమోదు చేసి వారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేస్తారు.

**ప్రశ్న : హోం క్వారంటైన్ వాళ్లకు జియో ట్యాగింగ్ ఎలా చేస్తారు? వాటిని ఉల్లంఘిస్తే ఎలాంటి కేసులు పెడతారు?**

**సీపీ:** వివిధ దేశాల నుంచి వచ్చిన వారిని, కరోనా లక్షణాలున్న వారిని టీఎస్ కాప్ అనే అప్లికేషన్ ద్వారా ట్యాగ్ చేస్తున్నాం. దీంతో ఎవరైనా బయటికి వస్తే వారిని వెంటనే గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 3, సెక్షన్లు. ఐపీసీలోని 188, 336, 269, 270, ఎన్‌డీఎంఏ చట్టంలోని సెక్షన్ 51 కింద కేసు నమోదు చేసి వారిని కోర్టులో ప్రాసిక్యూట్ చేయవచ్చు.

**ప్రశ్న : ప్రస్తుతం నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయించినా, లేదా బ్లాక్ చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

**సీపీ:** ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ -1955 సెక్షన్ 7 ప్రకారం నేరాలను బట్టి ఏడేళ్ల జైలు ఉంటుంది. సీఆర్‌పీసీ 1973 సెక్షన్ 453 ప్రకారం ఒక పోలీస్ స్టేషన్‌కు బాధ్యత వహించే ఏ అధికారి అయినా, వారెంట్ లేకుండా స్టేషన్ పరిధిలో బరువు, కొలతల ఉల్లంఘనలపై తనిఖీలు చేయవచ్చు.

**ప్రశ్న : ఎలాంటి సమయాల్లో వాహనాలను సీజ్ చేస్తున్నారు? సీజ్ చేసిన తర్వాత పరిస్థితి ఏమిటి?**

**సీపీ:** ఇప్పటివరకు కమిషనరేట్ వ్యాప్తంగా 2,500 వాహనాలు సీజ్ చేశాం. మోటరు వాహనాల చట్టం 1988లో ఉన్న అనేక నిబంధనలను పరిగణలోకి తీసుకొని వాహనాలను సీజ్‌చేస్తున్నాం. రిజిస్ట్రేషన్ పర్మిట్ సర్టిఫికెట్ లేకుండా ఉపమోగించే వాహనాలు, సెక్షన్లు 3, 4, 39 వాటి నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేయవచ్చు. ఈ విషయంలోఅనేక అధికారాలున్నాయి. సీజ్ అయిన వాహన యజమాని, సదరు వ్యక్తి తన వాహనం విడుదల కోసం ఇన్‌చార్జి రవాణా అథారిటీకి, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ అధికారం పొందిన ఏ అధికారికి అయినా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు అధికారి ధ్రువీకరించిన వాహనాన్ని విడుదల చేయడానికి అవకాశముంటుంది.

**కొవిడ్-19ను ఎదుర్కొనేందుకు ఏయే చట్టాలు అమల్లోకి వచ్చాయి?**

కొవిడ్-19 మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను తెచ్చాయి. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా వాటిని అమలు చేస్తున్నా యి. కరోనాను నియంత్రించేందుకు పోలీసులకు విశేష అధికారాలున్నాయి. ఐపీసీ, సీఆర్‌పీసీ, జాతీ య విపత్తు నిర్వహణ చట్టం-2005, అంటు వ్యా ధుల చట్టం-1897, మోటరు వాహనాల చట్టం -1988, ఎసెన్షియల్ కింద చర్యలు తీసుకునే అధికారం ఉన్నది. అలాగే కమోడిటీస్ యాక్ట్-1955, బ్లాక్ మార్కెటింగ్ నివారణ, ఎసెన్షియల్ కమోడిటీస్ సప్లైస్ మెయింటనెన్స్ యాక్ట్-1980, సిటీ పోలీస్ యాక్ట్, మున్సిపల్ యాక్ట్, ఫోర్జినర్స్ యా క్ట్-1946, పాస్‌పోర్ట్ యాక్ట్-1967, పోలీసులతోపాటు, రెవెన్యూ, మున్సిపాలిటీ యాక్ట్‌లో మున్సిపాలిటీ ఆఫీసర్స్, పంచాయతీ ఆఫీసర్స్ తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 యాక్ట్, లీగల్ మెట్రాలజీ అధికారులు ఈ విషయంలో తమ అధికారాలను వినియోగించుకోవచ్చు.

---

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు

- ప్రతి గ్రామంలోనూ కేంద్రం
- కరోనా నివారణకు పకడ్బందీ చర్యలు
- పేదల కోసమే బియ్యం, నగదు పంపిణీ
- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్
- ప్రతి ఒక్కరూ ఇళ్లలోనే ఉండాలని ప్రజలకు పిలుపు



సరుకులు అందజేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు, ఎమ్మెల్యే రవిశంకర్

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపడతామని, ఇందుకు కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, కరోనా నేపథ్యంలో ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని, కేంద్రాల వద్ద శానిటేషన్ చర్యలు చేపడతామని వెల్లడించారు. రైతులంతా టోకెన్ షెడ్యూల్ ప్రకారమే ధాన్యం తీసుకురావాలని కోరారు.

**ప్రభుత్వ సూచనలు పాటించాలి..**

ప్రజలంతా ప్రభుత్వ సూచనలు పాటిస్తూ ఇళ్లలోనే ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నగరంలో కరోనా బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో నగరవాసులు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇండోనేషియా నుంచి వచ్చిన పది మందితోపాటు వారి వల్ల ఓ కుటుంబంలో ముగ్గురికి కరోనా వైరస్ సోకిందన్నారు. వీరిని కలిసిన 80 నుంచి 90 మందిని క్వారంటైన్‌కు తరలించామన్నారు. కొవిడ్ నియంత్రణలో మీడియా పాత్ర చాలా గొప్పదన్నారు. త్వరలోనే బియ్యం పంపిణీ పూర్తి చేస్తామని, ఇందుకు₹1100కోట్లు కేటాయించామన్నారు.

**పేదల కోసమే ఉచిత బియ్యం..**

పేదలు ఆకలితో ఉండకూడదన్న ఆలోచనతో సీఎం కేసీఆర్ బియ్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. రాంనగర్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేశారు. అలాగే 14వ డివిజన్‌లోని కట్టరాంపూర్‌లో లబ్ధిదారులకు రేషన్ బియ్యం అందించారు. అనంతరం మొబైల్ కూరగాయల వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలోని 1, 2, 9, 31, 33, 39, 58, 59 డివిజన్లలో ప్రతి రోజూ ఉదయం మొబైల్ వాహనాలు తిరుగుతాయని తెలిపారు. అనంతరం మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ, ప్రజలు తమ ఇళ్ల వద్దే మొబైల్ వాహనాల్లో కూరగాయలు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. రెడ్ జోన్ పరిధిలో ప్రత్యేకంగా కూరగాయల వాహనాలను తిప్పుతామని చెప్పారు. రాంనగర్‌లో చల్ల బాలయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 35 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి ₹500 విలువ గల నిత్యావసర సరుకులను మంత్రి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మానకొండూర్, చొప్పదండి, హుస్నాబాద్ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సతీశ్‌కుమార్, కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్‌లాల్, కమిషనర్ క్రాంతి, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి, హరిశంకర్, గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, అంజాద్ పాల్గొన్నారు.

## మర్కజ్ వెళ్లొచ్చిన వారి వివరాలు సేకరించండి

- కరీంనగర్, సిరిసిల్ల కలెక్టర్లకు వినోద్‌కుమార్ సూచన



**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లి వచ్చిన వారి వివరాలు సేకరించాలని, తక్షణమే వైద్యపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్లు శశాంక, కృష్ణభాస్కర్‌కు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం వారితో ఫోన్‌లో మాట్లాడారు. మర్కజ్‌కు హాజరైన వారి జాబితా ఢిల్లీ నుంచి వచ్చిన నేపథ్యంలో దాని ప్రకారం ఆయా వ్యక్తులను గుర్తించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా కరీంనగర్ సిటీ, వేములవాడ, హుజూరాబాద్, తదితర ప్రాంతాల నుంచి మర్కజ్‌కు వెళ్లినట్లు సమాచారం ఉందని తెలిపారు. వారికి వైద్య పరీక్షలు చేసి, ఆ మేరకు ఆరోగ్యపరంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, మర్కజ్ నుంచి వచ్చిన వారిని గుర్తించేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వినోద్‌కుమార్‌కు రెండు జిల్లాల కలెక్టర్లు వివరించారు.

## ఐఎంఏ వైద్యుల సేవలు



రెడ్‌జోన్‌లో సర్వే నిర్వహిస్తున్న వైద్యులు బంగారి స్వామి, రజిని

**కరీంనగర్ హెల్త్ :** నగరంలోని రెడ్‌జోన్ ప్రాంతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ సభ్యులు స్క్రీనింగ్ టెస్టులు చేస్తున్నారు. ప్రైవేట్ వైద్యుడు, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త బృందాలుగా ఏర్పడి బుధవారం ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేశారు. గురువారం సైతం సర్వే కొనసాగుతుందని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు వసంతరావు తెలిపారు. ఇందులో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రావు, డీఎంహెచ్‌ఓ సుజాత, బంగారి స్వామి, రజినిప్రియదర్శిని, ఎనమల్ల నరేశ్, పుల్లెల పవన్ కుమార్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

---

నమస్తే తెలంగాణ CLASSIFIED
సువర్ణావకాశం
★LICలో మరియు ఇతర ఇన్సూరెన్స్ కంపెనీల్లో (లైఫ్, జనరల్) ఏజెంట్లుగా చేస్తున్న వారికి, గృహిణులకు మరియు బిజినెస్ పీపుల్‌కి శుభవార్త.. ఎలాంటి పెట్టుబడి లేకుండా నెలకి యాభై వేలకి పైగా సంపాదించే సువర్ణావకాశం.. వివరాలకు: 9000480450
NT-245820

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం.
4 లైన్ల ప్రకటన కేవలం 150/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 40/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
ప్రకటనల విభాగం
9182 777 571
9182 777 194

# రేషన్.. ఇక నో టెన్షన్

*కరోనా నేపథ్యంలో* రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తున్నది. లాక్‌డౌన్ అమలవుతుండడంతో పేదలకు ఉచితంగా బియ్యం, నగదు అందిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. అందులో భాగంగా బుధవారం నుంచి రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సరుకులను అందజేశారు. త్వరలోనే కుటుంబానికి ₹1500 చొప్పున అందించనున్నారు.

- కరోనా నేపథ్యంలో ఉచిత బియ్యం పంపిణీకి శ్రీకారం
- ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం అందజేత
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**కరీంనగర్ జిల్లాలో..**

**కరీంనగర్ ప్రతినిధి/చొప్పదండి/ తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ/ శంకరపట్నం:** కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లో లబ్ధిదారులకు రేషన్ బియ్యం ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ ప్రారంభించారు. చొప్పదండి పట్టణంలోని 6వ వార్డులో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బియ్యం పంపిణీ చేశారు. పేదలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామంలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బియ్యం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలని, అదే శ్రీరామ రక్షలా మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. శంకరపట్నం మండలం ముత్తారంలో కరోనా వైరస్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జిల్లాలోని మిగతా మండలాల్లోనూ అధికారులు, ప్రజా ప్రతినిధులు బియ్యం పంపిణీ చేశారు. ఆయా మండలాల్లో జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తాసిల్దార్లు పాల్గొన్నా రు.

జిల్లాలో 2,74,620 తెల్లరేషన్ కార్డుదారులు ఉండగా 8,17,313 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ఒక్కొక్కరికి 12కిలోల చొప్పున జిల్లాలో 98, 07,756 కిలోల బియ్యం పంపిణీకి అధికారులు ప్రణాళికలు చేశారు. రెండు మూడు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామని చెబుతున్నారు. పంపిణీ కేంద్రాల వద్ద సామాజిక దూరాన్ని పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ధర్మపురి : బియ్యం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

**సిరిసిల్ల జిల్లాలో..**

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ/సిరిసిల్లటౌన్/ సిరిసిల్ల రూరల్:** జిల్లాలో లక్షా 73వేల 65 రేషన్ కార్డులుండగా, 5లక్షల 5వేల 476 మందికి బియ్యం అందించనున్నారు. బుధవారం 3,617 మందికి 43,404 కింటాళ్ల బియ్యం, ₹18,08,500 నగదును పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని 37, 13వ వార్డుల్లో ఏర్పాటు చేసిన బియ్యం పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి, మున్సిపల్ ఉపాధ్యక్షుడు మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. 12వ వార్డు చంద్రంపేటలో చౌకధరల దుకాణంలో చేపట్టిన బియ్యం పంపిణీని తాసిల్దార్ అంజన్న, కౌన్సిలర్ రాజిరెడ్డితో కలిసి కలెక్టర్ కృష్ణభాస్కర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సామాజిక దూరం పాటించాలని సూచించారు. 31వ వార్డులోని రేషన్ దుకాణాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, ఎఫ్ఐ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ అంజయ్య సందర్శించారు. బియ్యం పంపిణీని పరిశీలించారు.



సిరిసిల్ల : బియ్యం పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ కళ



చొప్పదండి : బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుంకె



తిమ్మాపూర్ : బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

**జగిత్యాల జిల్లాలో..**

**ధర్మపురి,నమస్తేతెలంగాణ/మల్యాల/సారంగాపూర్/మారుతీనగర్/మేడిపల్లి/గొల్లపల్లి/కోరుట్లటౌన్/కోరుట్ల/పెగడపల్లి :** ధర్మపురి మండలంలో తాసిల్దార్ రవీందర్, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ, మున్సిపల్ అధ్యక్షురాలు సంగి సత్తెమ్మ, డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్ రేషన్ బియ్యం పంపిణీ చేశారు. జగిత్యాల మండలం చల్‌గల్, మోరపల్లిలో బియ్యం పంపిణీని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కే చందన్ కుమార్‌తో కలిసి అదనపు కలెక్టర్ బేతి రాజేశం పరిశీలించారు. మల్యాల మండల కేంద్రం, 19పంచాయతీల పరిధిలోని 27దుకాణాల్లో బియ్యం అందిస్తున్నామని తాసిల్దార్ లక్ష్మారెడ్డి తెలిపారు. సారంగాపూర్ మండలంలోని 18 గ్రామాల్లో 15షాపులు, బీర్‌పూర్ మండలంలోని 16 షాపుల్లో పంపిణీని తాసిల్దార్లు శ్రీనివాస్, నాగార్జున, ఎంపీడీవోలు పుల్లయ్య, మాల్లారెడ్డి పర్యవేక్షించారు. మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల, చౌలమద్ది, వేంపేట, చింతలపేటలో తాసిల్దార్ నీరటి రాజేశ్, సర్పంచ్‌లు అందజేశారు. మేడిపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పంపిణీ మొదలైంది. గొల్లపల్లి మండలం వెంగళాపూర్‌లో సర్పంచ్ గుండ రమ్య పంపిణీ చేశారు. కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు బియ్యం అందించారు. పెగడపల్లి మండలంలో 23 గ్రామాల్లోని 30దుకాణాల్లో బియ్యం పంపిణీని ప్రారంభించిన్నట్లు తాసిల్దార్ రాజమనోహర్‌రెడ్డి తెలిపారు. నంచర్లలో ఎంపీపీ గోళి శోభ అందజేశారు. అంతటా లబ్ధిదారులు సామాజిక దూరం పాటిస్తూ బియ్యం తీసుకెళ్లారు.

### రైతులు ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే కల్వకుంట్ల



ఇబ్రహీంపట్నం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

**మెట్‌పల్లి నమస్తే తెలంగాణ/ ఇబ్రహీంపట్నం/ మల్లాపూర్ :** పండించిన ప్రతి గింజనూ కొంటామని, రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు భరోసా ఇచ్చారు. ఇబ్రహీంపట్నం కొత్త బస్టాండ్ ఆవరణలో, మల్లాపూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. కరోనా నివారణ చర్యలపై రెండు మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. మెట్‌పల్లి పట్టణంలోని వెల్లుల్ల రోడ్డులో తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఆయాచోట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ, టోకెన్ల ప్రకారమే ధాన్యాన్ని కేంద్రాలకు తేవాలని రైతులకు సూచించారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు జాజాల భీమేశ్వరి, కాటిపల్లి సరోజన, మారు సాయిరెడ్డి, జడ్పీ సభ్యులు కంటం భారతి, సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ నేమూరి లత, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, నాయబ్ తాసిల్దార్ ఖాదర్, ఎంపీడీవో కోటేశ్వర్‌రావు, ఏవో లావణ్య, వైద్యాధికారి రాధ పాల్గొన్నారు.

### వలస కూలీలందరికీ సాయం : జగిత్యాల ఎమ్మెల్యే



జగిత్యాల : బియ్యం అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**జగిత్యాల, నమస్తే తెలంగాణ :** నియోజకవర్గంలో వలస కూలీలందరికీ ప్రభుత్వ సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 39వ వార్డులో వలస కార్మికులు ఎమ్మెల్యేను కలువగా, స్థానిక తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లి వారికి అవసరమైన సాయం అందించాలని సూచించారు. సమిండ్ల వాణితో కలిసి బియ్యం, నగదు అందించారు.

### సామాజిక దూరం పాటించాలి : జగిత్యాల జడ్పీ అధ్యక్షురాలు



కథలాపూర్ : వాహనదారులకు దండంపెట్టి వేడుకుంటున్న జడ్పీ అధ్యక్షురాలు వసంత, టీఆర్‌ఎస్ నేత లోక బాపురెడ్డి

**కథలాపూర్ :** కరోనా నివారణకు ప్రజలు సామాజిక దూరం పాటించాలని జగిత్యాల జడ్పీ అధ్యక్షురాలు దావ వసంత కోరారు. బుధవారం అంబారిపేట, కలికోటలో టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు లోక బాపురెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. అంబారిపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులకు మాస్కులు, పలు రేషన్‌షాపుల్లో ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు. బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని పిలిచి బయటకు రావద్దని దండం పెట్టి వేడుకున్నారు. తుర్తికి చెందిన వనితకు ₹45వేల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు.

### అదనంగా 30 కొనుగోలు కేంద్రాలు : సిరిసిల్ల జడ్పీ అధ్యక్షురాలు

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తేతెలంగాణ/చందుర్తి:** రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో అదనంగా 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జడ్పీ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ వెల్లడించారు. జడ్పీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని, ముందుగా టోకెన్లు పంపిణీ చేసి కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వేణు, సీఈవో గౌతంరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జడ్పీ అధ్యక్షురాలు జిల్లా వైద్యశాలను సందర్శించారు.

### రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు..

**వేములవాడ కల్చరల్:** ఉగాది పర్వదినం నుంచి ప్రారంభమైన శ్రీరామనవమి నవరాత్రోత్సవాలు రాజన్న క్షేత్రంలో కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం తొలుత పార్వతీ రాజరాజేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నేడు గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని సాదాసీదాగా నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. రథోత్సవం కూడా ఉండబోదని తెలిపారు.

### కమిషనరేట్ వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

**కరీంనగర్ క్రైం :** లాక్‌డౌన్, కర్ఫ్యూ అమలులో భాగంగా కమిషనరేట్ వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. ప్రభుత్వ ఆదేశాలు, నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### ఐసోలేషన్ వార్డు కోసం వసతిగదుల పరిశీలన

**వేములవాడ, నమస్తేతెలంగాణ:** కరోనా నేపథ్యంలో రాజన్న ఆలయ వసతి గదుల సముదాయాన్ని ఐసోలేషన్ వార్డులుగా వినియోగించుకోవాలని యోచిస్తున్నారు. అందులో భాగంగా వేములవాడ పీహెచ్‌సీ వైద్యుడు మహేశ్‌రావుతో కలిసి నందీశ్వర వసతి గదుల సముదాయాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ఉన్నారు.

### వైద్య పరీక్షల కోసం యువకుడి తరలింపు

**రాయికల్ రూరల్ :** రాయికల్ పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన ఓ యువకుడిని అధికారులు బుధవారం పొలాస ఐసోలేషన్‌కు తరలించారు. సదరు యువకుడు హర్యానాలో రెండు నెలలు ఉండి మార్చి 5న వచ్చాడు. కోరుట్ల పట్టణంలో మత బోధకుడిగా ఉన్నాడు. మార్చి 28న రాయికల్‌కు రాగా చుట్టు పక్కలవారి సమాచారంతో అధికారులు ఐసోలేషన్ వార్డుకు పంపారు.

### వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

**ధర్మపురి, నమస్తేతెలంగాణ/ మల్లాపూర్ :** జిల్లాలో వేర్వేరు కారణాలతో వేర్వేరు చోట్ల బుధవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ధర్మపురి మండలం రాయపట్నంలో వ్యవసాయ కూలీ శాట్ల మల్లేశం (37) అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఇంట్లోనే పురుగుల మందు చనిపోయినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన సంగ లతిక అలియాస్ నందిని (22) ఆత్మహత్య చేసుకున్నది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం గోవింద్‌పేటకు చెందిన నాగరాజుతో రెండేళ్ల క్రితం ఆమెకు పెళ్లికాగా తనతో సరిగా ఉండడం లేదన్న కారణంతో భర్త పుట్టింటి వద్ద వదిలి వెళ్లాడు. దీంతో మనస్తాపానికిలోనైన నందిని ఇంట్లోనే ఉరేసుకున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ముత్యంపేటకు చెందిన రైతు అజ్మీర సీతారం (36) బుధవారం తన పొలంలో పంటకు మందులు చల్లాడు. చేతులను శుభ్రం చేసుకోకుండనే నీళ్లు తాగడంతో అస్వస్థతకులోనై స్పృహ కోల్పోయాడు. దవాఖానకు తరలించే క్రమంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

# అభాగ్యులకు ఆపన్నహస్తం

**లాక్ డౌన్ నేపథ్యంలో ఉపాధి లేక అవస్థలు పడుతున్న వలస కార్మికులు, అభాగ్యులు, యాచకులకు పలువురు దాతలు ఆపన్నహస్తం అందిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునందుకొని మానవతామూర్తులు ముందుకొస్తున్నారు. తమకు తోచిన సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. కొందరు కడుపునిండా భోజనం పెడితే, మరికొందరు నిత్యావసర సరుకులు, నగదు పంచుతూ అక్కున చేర్చుకుంటున్నారు.**

### • కరీంనగర్ జిల్లాలో..

**కరీంనగర్ నెట్‌వర్క్ :** కరీంనగర్ బైపాస్ రోడ్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం, డీర్ పార్కు సమీపంలోని వెంకటరమణ అనాథ బాలల ట్రస్టు, యజ్ఞ వరాహస్వామి ఆలయం వద్ద ఉన్న మాతాపిత వృద్ధాశ్రమంతోపాటు జిల్లా కోర్టులో జూనియర్ న్యాయవాదులకు జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి పలువురి సాయంతో నిత్యావసర సరుకులు, పండ్లు అందించారు. ఇక్కడ కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు ఉన్నారు. తెలంగాణ జాగృతి నియోజకవర్గ కన్వీనర్ రవికాంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానలో రోగులకు బాయిల్డ్ ఎగ్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. జమ్మికుంట సీఐ సృజన్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 మంది వలస కూలీలకు ఒక్కొక్కరికి పది కిలోల బియ్యాన్ని హుజూరాబాద్ ఆర్డీవో బెన్ షాలోం, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. హుజూరాబాద్ పట్టణంలో 11మంది వలస కూలీలకు వారానికి సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను రొంటాల ప్రవీణ్ అందజేశాడు. వీణవంకకు చెందిన విద్యార్థులు వెల్ది భరద్వాజ్, రణధీర్ వలస కూలీ కుటుంబాలకు 2 క్వింటాళ్ల బియ్యం, 10 నూనె ప్యాకెట్లను అందజేశారు. తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో గ్రామస్తులకు రూ.20వేల విలువగల మాస్కులను ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ పంపిణీ చేశారు. మానకొండూర్ మండలం గంగిపల్లి ధనలక్ష్మి విత్తన సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో దాదాపు 50 మందికి పైగా కార్మికులు, సిబ్బంది, రైతులకు మాస్కులు, డెటాల్ సబ్బులు, విటమిన్ సీ బిల్లలను అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ రెడ్డి అందజేశారు. కొత్తపల్లి మండలం చింతకుంటలో 70 మంది వలస కూలీలకు ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్ బియ్యం పంపిణీ చేశారు. కరీంనగర్ మండలం మొగ్దుంపూర్, బొమ్మకల్ గ్రామాల్లో కూలీలకు ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య బియ్యం అందజేశారు.



కరీంనగర్ : జిల్లా కోర్టులో జూనియర్ న్యాయవాదులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న జిల్లా జడ్జి అనుపమ చక్రవర్తి



జగిత్యాల : కూలీలకు భోజన సదుపాయం కల్పించిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో అదనపు కలెక్టర్ రాజేశం

### • రాజన్న సిరిసిల్ల జిల్లా..

**వేములవాడ, నమస్తేతెలంగాణ/ ఎల్లారెడ్డిపేట/ వేములవాడ రూరల్ / కోనరావుపేట/ సిరిసిల్ల రూరల్ / ముస్తాబాద్ :** వేములవాడ వాసవీ సేవాసమితి ఆధ్వర్యంలో న్యూఅర్బన్ కాలనీలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వాసవీ సేవాసమితి అధ్యక్షుడు జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, అగ్రహారం జీపీల్లో పలువురికి ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు మామిండ్ల తిరుపతిబాబు మాస్కులను పంపిణీ చేశారు. గొల్లపల్లిలో రెడ్డిసంఘం ఆధ్వర్యంలో ఎంపీటీసీ ల్యాగల శ్రీనివాస్‌రెడ్డి వలస కూలీలకు నిత్యావసర సరుకులను అందించారు. వేములవాడ మండలం హన్మాజీపేటలోని వలస కూలీలకు బియ్యం, నగదును జడ్పీటీసీ వాణి, తాసిల్దార్ మునీందర్, కోనరావుపేట మండలం మర్తనపేట, కోనరావుపేట, నాగారం, సుద్దాల గ్రామాల్లోని వలస కూలీలకు తాసిల్దార్ రమేశ్‌బాబు, సర్పంచ్‌లు అందజేశారు. తంగళ్లపల్లి మండలంలోని విద్యార్థి ప్రజ్ఞా సంస్థ ఆధ్వర్యంలో ₹లక్ష విలువైన నిత్యావసర వస్తువులను వలస కార్మికులకు ఎంపీపీ పడిగెల మానస, ఎస్ఐ అభిలాష్, సర్పంచ్ అనితతో కలిసి డీఎస్పీ చంద్రశేఖర్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రవికిరణ్‌రెడ్డి, ఆదిత్యారావు, రాజు పాల్గొన్నారు. జిల్లెల్లలోని 201 మంది వలసకార్మికులకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికీ 12 కిలోల బియ్యం, ₹500 నగదును ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు అందజేశారు. ముస్తాబాద్ మండలంలో వలస కార్మికులకు పీపుల్స్ అధినేత డాక్టర్ చింతోజు బ్రదర్స్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జడ్పీటీసీ నర్సయ్య, ఆర్బీఎస్ కన్వీనర్ గోపాల్‌రావు పాల్గొన్నారు. పోతుగల్‌లో సర్పంచ్ గౌతంరావు బియ్యం, నగదు పంపిణీ చేశారు.



సిరిసిల్ల రూరల్: వలసకార్మికులకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న డీఎస్పీ చంద్రశేఖర్

### • జగిత్యాల జిల్లా..

**జగిత్యాల / ధర్మపురి, నమస్తే తెలంగాణ / మెట్‌పల్లిటౌన్ / కోరుట్లటౌన్ / మేడిపల్లి / కథలాపూర్ :** జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం 120మంది వలస కూలీలకు భోజన సదుపాయం కల్పించగా, సొసైటీని అదనపు కలెక్టర్ బేతి రాజేశం అభినందించారు. ఇక్కడ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో యూత్ సభ్యుల సహకారంతో నిరుపేద కుటుంబాలకు వార్డు కౌన్సిలర్ తోట మల్లికార్జున్ ₹15వేల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ధర్మపురి గోదావరి ఒడ్డున వలసకూలీలకు, యాచకులకు బుధవారం ఎల్ఎమ్ కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు అన్నదానం చేశారు. ట్రస్ట్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత మాట్లాడుతూ లాక్‌డౌన్ ఎత్తిసే వరకూ వలస కూలీలకు, యాచకులకు భోజనం అందిస్తామన్నారు. ఇక్కడ డీసీఎమ్మెస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షురాలు సంగి సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న తదితరులు పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని 4వ వార్డులో మన్నే గంగాధర్ ఇంటింటికీ తిరుగుతూ కూరగాయలను ఉచితంగా పంపిణీ చేశాడు. కోరుట్లలో 20 మంది ఒంటరి మహిళలు, నిరాశ్రయులకు నెల రోజులకు సరిపడా సరుకులను ప్రభుత్వోపాధ్యాయులు అందె శివకుమార్, బోగ శ్రీధర్ అందించారు. పట్టణానికి చెందిన వ్యాపారులు అల్లాడి ప్రవీణ్, మహేశ్ సోదరులు సైతం నిరాశ్రయులకు సరుకులు పంపిణీ చేశారు. పట్టణంలోని కోరుట్ల క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు 100 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకుల కిట్లను అందించారు. మేడిపల్లి మండలంలోని బీమారంలో ప్రతి కుటుంబానికీ కూరగాయలు, కోడిగుడ్లను జగిత్యాల జడ్పీ ఉపాధ్యక్షుడు వొద్దినేని హరిచరణ్‌రావు అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, ఎంపీటీసీ పల్లి అర్జున్, తదితరులు ఉన్నారు. మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ ఆధ్వర్యంలో వలస కూలీలకు అన్నం ప్యాకెట్లను అందించారు. లాక్‌డౌన్ ముగిసేదాకా పంపిణీ చేస్తామని తెలిపారు. కథలాపూర్ మండలం సిరికొండలో వలస కార్మికులకు కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు నిత్యావసర సరుకులను అందించారు.



మెట్‌పల్లిలో సీఐ రవికుమార్‌కు చెక్కు అందజేస్తున్న పౌల్ట్రీ ఫాం సభ్యులు



సిరిసిల్ల కలెక్టర్‌కు ₹50 వేల చెక్కు అందిస్తున్న ఇల్లంతకుంట వైన్స్ యజమానులు

# విరాళాల వెల్లువ

**కరోనా నియంత్రణ కోసం ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలకు తోడ్పాటునందించేందుకు పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. తమకు తోచిన సహాయాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.**

**ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/మారుతీనగర్/బుగ్గారం/ మెట్‌పల్లి రూరల్ / జగిత్యాల రూరల్ :** సీఎంఆర్‌ఎఫ్ కోసం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో జీవన్ ట్రేడర్స్ అధినేత ₹లక్ష, లక్ష్మి ట్రేడర్స్ యజమాని ₹70 వేల చెక్కు, సర్పంచులు ₹80 వేలు, ఎంపీటీసీలు ₹20వేలు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు అందించారు. మల్లాపూర్‌లో బీడీ టేకేదార్ల సంఘం ఆధ్వర్యంలో ₹10 వేలు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ₹10వేల చెక్కును కల్వకుంట్లకు ఇచ్చారు. లయన్స్‌క్లబ్ అందించిన మాస్కులు, శానిటైజర్లు, గ్లౌస్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కోరుట్ల, మెట్‌పల్లి డివిజన్లలోని పోలీసుల సంక్షేమానికి రెండు డివిజన్ల పరిధిలోని ఆరు మండలాల పౌల్ట్రీ ఫాం అసోసియేషన్ ఆధ్వర్యంలో ₹లక్ష విరాళం అందించారు. కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో అసోసియేషన్ అధ్యక్షుడు వేముల రవీందర్‌రెడ్డి, సభ్యులు బెజ్జారపు శ్రీనివాస్, నర్సింహారెడ్డి కోరుట్ల సీఐ రాజశేఖర్‌రాజు, మెట్‌పల్లి సీఐ రవికుమార్‌కు సర్కిల్ కార్యాలయాల్లో ₹50వేల చొప్పున అందజేశారు. సీఎం సహాయ నిధికి బుగ్గారం మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు తమవంతుగా ₹1.15లక్షల విరాళాన్ని బుధవారం ఎంపీడీవో తిరుపతికి అందజేశారు. ఎంపీపీ బాదినేని రాజమణి ₹10వేలు, జడ్పీ సభ్యుడు బాదినేని రాజేందర్ ₹10వేలు, ఆర్బీఎస్ మండలాధ్యక్షుడు తాండ్ర సత్యనారాయణ ₹10వేలు, వైస్ ఎంపీపీ జోగినపల్లి సుచేందర్ ₹5వేలు, యశ్వంతరావుపేట సర్పంచ్ కోల రాజు ₹5వేలు, బుగ్గారం సర్పంచ్ మూల సుమలత శ్రీనివాస్ గౌడ్ ₹5వేలు, గంగాపూర్ సర్పంచ్ దొరగండ్ల జగన్ ₹5వేలు, వెల్గొండ సర్పంచ్ గాదె తిరుపతి ₹5వేలు, సందయ్యపల్లి సర్పంచ్ చల్ల రజిత–రవీందర్ ₹5వేలు, మద్దునూర్ సర్పంచ్ బత్తుల తిరుపతి ₹5వేలు, శెకల్ల సర్పంచ్ వెల్గటూరి మమత–రమేశ్ ₹5వేలు, గోపులాపూర్ సర్పంచ్ కొమ్మినేని సుశీల–నారాయణ ₹5వేలు, బీర్సాని సర్పంచ్ కే రాధ–సత్తన్న ₹5వేలు, సిరికొండ సర్పంచ్ చెర్లపల్లి దివ్య–ప్రవీణ్ ₹5వేలు, చిన్నాపూర్ సర్పంచ్ దమ్మ లతాశ్రీ–నర్సింగం ₹5వేలు, యశ్వంతారావుపేట ఎంపీటీసీ ఊరమట్ల లక్ష్మి–బుచ్చన్న ₹5వేలు, వెల్గొండ ఎంపీటీసీ రౌండ్ల లక్ష్మి– రవీందర్ ₹5వేలు, సిరికొండ ఎంపీటీసీ నోముల శ్రీలత–చుక్కారెడ్డి ₹5వేలు, మద్దునూర్ ఎంపీటీసీ గాదెపెల్లి మహేశ్ ₹5వేలు, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సిరినేని మల్లేశం ₹5వేలు అందించారు. మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట సర్పంచ్ కాట శ్రీధర్ ₹5 వేలు, వెల్లుల్ల సర్పంచ్ గూడూరు రజని–తిరుపతి ₹5 వేలను ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుకు అందించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో దళిత, గిరిజన కూలీల కోసం ఎస్సీ సంక్షేమ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, అఖిల భారత అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి ముద్దం ప్రకాశ్ ₹25వేల చెక్కును కలెక్టర్ రవికి అందజేశారు. జగిత్యాల రూరల్ ఎంపీపీ గాజర్ల గంగారాం గౌడ్ ₹10వేలు, వైస్ ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్, పొరండ్ల ఎంపీటీసీ ఆరె సౌజన్య, గుల్లపేట ఎంపీటీసీ దమ్మ సురేందర్ రెడ్డి, నర్సింగాపూర్ ఎంపీటీసీ మంగళారపు మహేశ్, తాటిపెల్లి ఎంపీటీసీ పూదరి శ్రీనివాస్, అనంతారం ఎంపీటీసీ వూరడి జమున, అంతర్గాం ఎంపీటీసీ భూపెల్లి శ్రీనివాస్, తిమ్మాపూర్ ఎంపీటీసీ గిద్దె లక్ష్మి, జాబితాపూర్ ఎంపీటీసీ చిత్తారి స్వరూప, బాలపల్లి ఎంపీటీసీ రత్న, వెల్దుర్తి ఎంపీటీసీ బందెల మమత, హబ్సీపూర్ ఎంపీటీసీ చెవుల లక్ష్మి, కల్లెడ ఎంపీటీసీ చెట్కూరి పరశురాం, లక్ష్మీపూర్ ఎంపీటీసీ నలువాల సునీత, మోరపెల్లి ఎంపీటీసీ కర్నె భూమారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ జావిద్ ₹5వేల చొప్పున మొత్తం ₹90వేలను విరాళంగా ఇచ్చారు.



జగిత్యాల రూరల్ : కలెక్టర్ రవికి చెక్కు అందిస్తున్న ముద్దం ప్రకాశ్



సిరిసిల్ల టౌన్ : మున్సిపల్ కమిషన్‌కు ₹లక్ష చెక్కు అందిస్తున్న రవి

**కలెక్టరేట్/ముస్తాబాద్ / సిరిసిల్ల టౌన్ :** సిరిసిల్లలోని వివేకవర్ధిని పాఠశాల పూర్వ విద్యార్థులు ₹30,500, ఇల్లంతకుంటకు చెందిన వైన్స్ షాపుల యజమానులు ₹50 వేలు, సిరిసిల్ల మెహర్‌నగర్‌కు చెందిన నర్సింగారావు, బైరి శ్రీహరిరెడ్డి ₹10,116 విరాళాల చెక్కులను కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు అందించారు. ముస్తాబాద్‌కు చెందిన ప్రేమానందం, గందె రామలింగం సీఎం సహాయ నిధికి ₹10 వేలు విరాళాన్ని ప్రకటించారు. సంబంధిత చెక్కును ఎంపీపీ శరత్‌రావు, సర్పంచ్ గౌతంరావు, గోపాల్‌రావు, సంతోష్‌రావు, శ్రీనివాస్, శ్రీకాంత్‌కు అందజేశారు. అదేవిధంగా సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్రవ్యాపారి గోవిందు రవి ముఖ్యమంత్రి సహాయనిధికి ₹లక్ష విరాళాన్ని ప్రకటించారు. సంబంధిత చెక్కును మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్యకు అందజేశారు. వేములవాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నపూర్ణ భోజనం పథకానికి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు తన వంతుగా ₹15వేలను అందజేశారని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

### స్వచ్ఛందంగా ముందుకు రావాలి

కరీంనగర్ జిల్లా కలెక్టర్, సీపీ



డీఎంఅండ్‌హెచ్‌వోతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

**కరీంనగర్‌హెల్త్/ టవర్‌సర్కిల్:** ఢిల్లీలోని తబ్లిగీ జమాత్ మసీదులో మత ప్రార్థనలకు వెళ్లిన వారు జిల్లాలో ఇంకా ఎవరైనా ఉంటే రేపటిలోగా స్వచ్ఛందంగా ముందుకు రావాలని, సమయం ముగిసిన తర్వాత గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కె శశాంక, సీపీ కమలాసర్‌రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉదయం ముకరంపుర, కశ్మీర్‌గడ్డలో 50 వైద్య బృందాలతోపాటు ఐఎంఏ వైద్యులు చేపట్టిన డోర్ టూ డోర్ సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐఎంఏ, ప్రైవేట్ నర్సింగ్ హోం డాక్టర్ల అసోసియేషన్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఇండోనేషియా బృందం పర్యటించి 14 రోజులు ముగిసిందని, గతంలో వారు తిరిగిన ప్రాంతంలో బుధవారం డీఎంహెచ్‌వో, ఐఎంఏ సహకారంతో 50 వైద్య బృందాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించామని, ఎవరికీ కరోనా లక్షణాలు కనిపించలేదని తెలిపారు. మిగతా వారికి మరో 50 బృందాలతో గురువారం పరీక్షలు చేస్తామన్నారు. చల్మెడలోని హోం క్వారంటైన్‌లో ఉన్న 17 మందికి వైరస్ లక్షణాలు కనిపించలేదన్నారు. వీరు మరో 14 రోజులు హోం క్వారంటైన్‌లో ఉండాలని, జిల్లాలో ఇప్పటివరకు పరిస్థితి అదుపులోనే ఉన్నదని, రాబోయే రెండు, మూడు వారాలు జిల్లా ప్రజలు సామాజిక దూరాన్ని పాటిస్తూ మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండో విడత సర్వే సమర్థవంతంగా పూర్తి చేయాలని వైద్యాధికారులకు సూచించారు. సమావేశాల్లో డీఎంహెచ్‌వో సుజాత, ఐఎంఏ సీనియర్ వైద్యుడు జగన్ మోహన్‌రావు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వసంత్‌రావు, డాక్టర్ రమణాచారి, విజయలక్ష్మి, బీఎన్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### జగిత్యాల డీఏవోగా సురేశ్ కుమార్

**జగిత్యాల టౌన్ :** జగిత్యాల ఏడీఏగా పనిచేస్తున్న సురేశ్ కుమార్ జిల్లా వ్యవసాయాధికారిగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు డీఏవోగా పని చేసిన అమీనాబీ విధులను నిర్లక్ష్యం చేశారన్న కారణంతో ఆమెను బాధ్యతల నుంచి తొలగించాలని కలెక్టర్ రవి ప్రభుత్వానికి విన్నవించగా, కోరుట్ల ఏడీఏగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నమస్తే తెలంగాణ
# నిపుణ
[ హైదరాబాద్ ]
గురువారం 2 ఏప్రిల్ 2020



పదోతరగతి పూర్తికాగానే అత్యధికశాతం విద్యార్థులు ఇంటర్మీడియట్‌పైనే దృష్టి సారిస్తారు. భవిష్యత్తులో ఉన్నత విద్యకైనా, ఉద్యోగానికైనా ఇంటర్ చదవడం తప్పసరి కావడమే దీనికి కారణం. అందుకే ఇది కెరీర్‌ను నిర్దేశించే కీలకమైన మలుపులాంటిది. ఒకరకంగా విద్యార్థి జీవితం ఇక్కడి నుంచే మొదలవుతుంది. అందుకే ఇంటర్‌లో ఏ గ్రూపు తీసుకోవాలనే అంశానికి చాలా ప్రాధాన్యం ఉంది. మొత్తం జీవితగమనాన్నే నిర్దేశించే గ్రూప్ ఎంపికకు ముందు విద్యార్థులు కొంత సమయాన్ని కేటాయించి వాటిని గూర్చిన అవగాహన పెంచుకోవాలి. ఏ రంగంలో తాము బాగా అభివృద్ధిలోకి రాగలమో బేరీజు వేసుకోవాలి. ఆ తరువాతే ముందడుగు వేయాలి. ఏ గ్రూప్‌లో చేరాలనే విషయమై విద్యార్థులు ఆలోచించడం, సన్నిహితులను, తల్లిదండ్రులను సలహాలు అడగడం మామూలే. అయినా తమకు తామే ఇంటర్లో ఏ గ్రూపు తీసుకోవాలో నిర్ణయించుకోవడం ఉత్తమం. దీనికోసం నిపుణులు, విద్యావేత్తల సూచనలు..

# టెన్త్ తర్వాత ఏ గ్రూప్ తీసుకోవాలి?

- ఏ గ్రూప్‌లో ఏయే సబ్జెక్టులు ఉంటాయో, వాటి పరిధి ఏమిటో సీనియర్ల ద్వారా లేదా అధ్యాపకుల ద్వారా తెలుసుకోవాలి.
- ఏ గ్రూప్‌లో చేరితే భవిష్యత్‌లో ఏయే రంగాల్లో ప్రవేశించవచ్చో తెలుసుకోవడం కీలకం.
- తల్లిదండ్రులు, స్నేహితులతో చర్చించాలి. కానీ వారి సలహాల మీద పూర్తిగా ఆధారపడటం కూడా మంచిది కాదు. సొంతంగా ఆలోచించిన తరువాతే నిర్ణయం తీసుకోవాలి.
- సొంతంగా నిర్ణయం తీసుకునేంత వయస్సు, అనుభవం లేకపోవడం కూడా ఒక ప్రతిబంధకమే. దాన్ని అధిగమించేందుకు ముందుగానే గ్రూపులపై అవగాహన పెంచుకోవడం అవసరం.
- అయోమయ పరిస్థితుల్లో ఏదో ఒక గ్రూపును ఎంచుకుంటే తరువాత ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అన్నింటికీ మించి విలువైన కాలం వృథా అవుతుంది.
- తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను బలవంతంగా పిల్లలపై రుద్దకూడదు. విద్యార్థి అభిరుచి, సామర్థ్యాన్ని రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ఏ గ్రూపులో చేరాలనే విషయంపై సలహా మాత్రమే ఇవ్వడం ఉత్తమం.

### ఎంపీసీ



- గణితానికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా ఈ గ్రూపునకు విపరీతమైన ప్రాధాన్యం ఉంది. ప్రధానంగా ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్, సైంటిస్ట్ తదితర వృత్తుల్లో స్థిరపడాలనుకునేవారు తీసుకోవాల్సిన గ్రూపు ఇది. ఈ గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన తర్వాత ఇంజినీరింగ్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఏరోనాటికల్, అగ్రికల్చర్, ఇండస్ట్రియల్, కెమికల్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేసేందుకు ఎంపీసీ తొలిమెట్టుగా ఉపయోగపడుతుంది. జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు ఈ గ్రూపులో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావాలి. తర్వాత ఆయా ఎంట్రెన్స్‌లలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఐఐటీలతోపాటు ఎన్ఐటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్, బిట్స్‌పిలాని వంటి సంస్థల్లో ప్రవేశం కూడా ఎంపీసీ గ్రూపు ద్వారానే సాధ్యం. ఆయా సంస్థల్లో ఇంజినీరింగ్ డిగ్రీ, పీజీ కోర్సులు చేసేందుకు అవకాశం ఉంది. ప్రతిష్ఠాత్మకమైన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్)లో చేరేందుకు బిట్‌శాట్ రాయాలి. తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ తమ సంస్థలో ప్రవేశం కోసం ఐశాట్ (ఐఎస్‌టీ అడ్మిషన్ టెస్ట్)ను నిర్వహిస్తుంది. ఇవే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఐసర్, నైసర్‌లలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలన్నింటికీ ప్రాథమిక అర్హత ఎంపీసీయే. ఫార్మసీ వంటి డిప్లొమాలు, మ్యాథమెటిక్స్‌తో డిగ్రీ చేసేందుకు కూడా ఎంపీసీ దోహదం చేస్తుంది. ఎంసెట్ ద్వారా రాష్ట్రస్థాయి ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

### బైపీసీ

- డాక్టర్, వెటర్నరీ వైద్యుడిగా, వైద్య సంబంధిత ఇతర వృత్తుల్లో స్థిరపడాలనుకునే వారు నీట్/ఎంసెట్‌ను దృష్టిలో పెట్టుకుని బైపీసీని ఎంచుకుంటారు. ఓపిగ్గా చదవడం, చక్కగా బొమ్మలు వేయడం ఆ గ్రూపులో చేరే విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలు. వైద్యులు ఎక్కువగా తమ పిల్లల్ని వైద్యులుగా తీర్చిదిద్దాలని ఆశిస్తారు. దేశంలోని, రాష్ట్రంలోని వైద్యకళాశాలల్లో ప్రవేశాల కోసం నీట్ రాయాలి. దానిలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా దేశంలోని మెడికల్ కాలేజీల్లో 15




శాతం సీట్లలో లేదా రాష్ట్రంలో మెడికల్ కాలేజీల్లో 85 శాతం సీట్లలో ప్రవేశం పొందవచ్చు. నీట్‌లో ర్యాంకు సాధించడం ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ (బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్) తదితర కోర్సుల ద్వారా వైద్య వృత్తిలో స్థిరపడవచ్చు. జాతీయ స్థాయిలో ఎయిమ్స్, జిప్‌మర్ తదితర కాలేజీల్లో కూడా గతేడాది నుంచి నీట్ ర్యాంక్‌తో ప్రవేశాలు కల్పిస్తున్నారు.
- బైపీసీ చేసిన తర్వాత ఉన్నత విద్యావకాశాలకు కొదువ లేదు. నీట్ ద్వారా ఎంబీబీఎస్ లేదా ఆయుష్ కోర్సుల్లో డిగ్రీ చేసిన తర్వాత ఎండీ (–డాక్టర్ ఆఫ్ మెడిసిన్), ఎంఎస్ (మాస్టర్ ఆఫ్ సర్జరీ), డీఎం (మెడిసిన్ సూపర్ స్పెషాలిటీ ప్రోగ్రామ్) ఫోరెన్సిక్ మెడిసిన్‌లో పీజీ, ఏరోస్పేస్ మెడిసిన్, ఏవియేషన్ మెడిసిన్, డెర్మటాలజీ, పిడియాట్రిక్ వంటి ప్రత్యేక కోర్సులు చేయవచ్చు.
- వైద్య కోర్సులే కాకుండా బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో డిగ్రీ, పీజీ చేస్తే పలు అవకాశాలు లభిస్తాయి. సైన్స్‌లో ఉన్నత విద్యను చదవాలనుకునేవారు కూడా బైపీసీని ఎంచుకోవచ్చు. ఉదాహరణకు నర్సింగ్ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారికి విదేశాల్లో విపరీతమైన డిమాండ్ ఉంది. మన రాష్ట్రంలో నర్సింగ్ ఫ్యాకల్టీకి కొరత ఉంది. హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్య చేసిన వారికి మంచి భవిష్యత్ ఉంటుంది. బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, ఫార్మసీ, జెనెటిక్స్, అగ్రికల్చర్, ఆక్వాకల్చర్, ఆస్ట్రానమీ, బయో ఇన్ఫర్మాటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ అండ్ ప్రాసెసింగ్, ఫారెస్ట్ రేంజర్, జియాలజీ, హార్టికల్చర్, హోంసైన్స్, మాలిక్యులర్ బయాలజీ, ఓషనోగ్రఫీ, ప్లాంట్ పాథాలజీ తదితర రంగాల్లో అవకాశాలుంటాయి.

### ఎంఈసీ / సీఈసీ


- ఎవర్‌గ్రీన్ రంగాల్లో కామర్స్, ఎకనామిక్స్‌లు ముందు వరుసలో ఉంటాయి. ప్రపంచంలో నిత్యం మారుతున్న కాలంలో కామర్స్ గ్రాడ్యుయేట్లకు ఎన్నెన్నో అవకాశాలున్నాయి. సేవల రంగం వైపు చేరేవారు సైన్స్, ఆర్ట్స్ గ్రూపులపై పెద్దగా ఆసక్తి లేనివారు లెక్కలు, గణాంకాలు, కామర్స్ సబ్జెక్టులతో కూడిన ఎంఈసీ, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులున్న సీఈసీలో చేరవచ్చు. చార్టెర్డ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ లాయర్లు, బ్యాంకు మేనేజర్, చార్టెర్డ్ ఫైనాన్షియల్ అనలిస్ట్, ట్యాక్స్ ఆడిటర్ వంటి వృత్తుల్లో స్థిరపడాలనుకునేవారు, ఇన్సూరెన్స్ సంస్థల్లో, స్టాక్ మార్కెట్లో ఉద్యోగాలు పొందాలనుకునేవారు. ఈ గ్రూపులను ఎంచుకోవచ్చు. మ్యాథమెటిక్స్, కామర్స్ సబ్జెక్టులు రెండూ అధ్యయనం చేయడం మరింత మెరుగైన ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుంది. సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఐసీఎస్ఐ తదితర సంస్థలు కామర్స్ విద్యార్థులకు పలురకాల కోర్సులను అందిస్తున్నాయి. అంతేకాకుండా ఎకనామిక్స్‌లో స్పెషలైజేషన్, పీజీలతో ఎన్నోరకాల ఉపాధి అవకాశాలు పొందవచ్చు.

... ✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

## విద్య, ఉద్యోగ సమాచారం

### నాటా వాయిదా

- జాతీయస్థాయిలో ఆర్కిటెక్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నాటా (I)ను వాయిదా వేసినట్లు కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రకటించింది.




నాటాను ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు. దీనిలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆర్కిటెక్చర్ కాలేజీల్లో ఐదేండ్ల బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మొదటి నాటా టెస్ట్‌ను ఏప్రిల్ 19న, రెండో నాటా టెస్ట్‌ను మే 31న నిర్వహించాల్సి ఉంది.
- కొత్త తేదీని లాక్‌డౌన్ ముగిసిన తర్వాత వెల్లడిస్తామని కౌన్సిల్ తెలిపింది. ఈ పరీక్ష దరఖాస్తు దాఖలు చేసుకునే గడువును 15వ తేదీ వరకు పొడిగించింది. రుసుమును 19వ తేదీ వరకు చెల్లించవచ్చని కౌన్సిల్ పేర్కొంది. పూర్తి వివరాల కోసం http://www.nata.in చూడవచ్చు.

### తిరుపతి సంస్కృత విద్యాపీఠానికి సెంట్రల్ హోదా !



- తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠానికి సెంట్రల్ యూనివర్సిటీ హోదాను ఇస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డీమ్డ్ యూనివర్సిటీ హోదాలో ఉన్న సంస్కృత విద్యాపీఠం స్వతంత్ర (సెంట్రల్ యూనివర్సిటీ) సంస్కృత విశ్వవిద్యాలయంగా మారింది. ఇప్పటికే ఈ విశ్వవిద్యాలం డీమ్డ్ యూనివర్సిటీలలో మూడోస్థానంలో ఉంది. ప్రస్తుతం ఇచ్చిన సెంట్రల్ యూనివర్సిటీ హోదాతో మరిన్ని కోర్సులు, పరిశోధనలకు ఈ సంస్థ వేదిక కానున్నది అని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### ఎకనామిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ కోర్సులు

- బెంగళూర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కింది కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.
- **కోర్సు:** ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు
- **అర్హతలు:** ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత
- **కోర్సు:** ఎమ్మెస్సీ ఎకనామిక్స్
- **అర్హతలు:** బీఎస్సీ (ఆనర్స్) ఇన్ ఎకనామిక్స్ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 20
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ. 300/–, ఎస్సీ, ఎస్టీలకు, వికలాంగులకు రూ. 150/–
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** https://base.ac.in




### బీహెచ్ఈఎల్‌లో అప్రెంటిస్


- **భోపాల్‌లోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్)లో కింది అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**
- అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 229
- **విభాగాల వారీగా ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–138, డిప్లొమా అప్రెంటిస్–91
- **విభాగాలు:** కెమికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఇండస్ట్రియల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెటలర్జీ, మెకానికల్ ఇంజినీరింగ్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజినీరింగ్), బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 3
- **వెబ్‌సైట్:** http://careers.bhelbpl.co.in

# Depreciation is equal to?

1. **Observe the following?**
   1.CAG is a constitutional body
   2.CAG is a Statutory body
   3.CAG submits its report to the Lok Sabha
   4. CAG submits its report to the President of India
   **Which of the above is true**
   A) 2,3 B) 1,3 C) 2,4 D) 1,4
2. **The period of 'International Decade for Action': Water for sustainable development is?**
   A) 2016-2026 B) 2017-2026
   C) 2018-2030 D) 2018-2028
3. **Economic liberalization in India started with?**
   A) Substantial changes in industrial licensing policy
   B) The convertibility of Indian rupee
   C) doing away wit procedural formalities for foreign direct investment
   D) Significant reduction in Tax rates
4. **Depreciation is equal to?**
   A) Gross National Product-Net National Product
   B) Net National Product-Gross National Product
   C) Gross National Product-Personal Income
   D) Personal Income-Personal Taxes
5. **In India, Tertiary Sector includes?**
   1. Trade and Transport
   2. Finance and Real Estate
   3. Forestry and Fishing
   A)1 B)1,2 C) 2,3 D) 3
6. **Which one of the following is the central theme of the Chipko Movement , started by Sunderlal Bahuguna in 1973?**
   A) Conservation of River water
   B) Protection of Birds
   C) Protection of Cheetas
   D) Conservation of Forests
7. **The National forest policy aims at maintaining how much of the total geographical area under forests?**
   A) Half B) One-third
   C) one-fourth D) One-fifth
8. **Assertion:** If High Liquidity in market causes inflation, then RBI reduces Reporate?
   **Reason:** During high liquidity in market, RBI designs monetary policy, so that money enters into banking sector
   A) Both A and R are true and R is the correct explanation of A
   B) Both A and R are true but R is not the correct explanation of A
   C) A is true but R is false
   D) A is false but R is true
9. **Which of the following provides the largest credit to agriculture and allied sectors?**
   A) Regional Rural Banks
   B) Co-operative banks
   C) Commercial banks
   D) None
10. **Match the following?**
    1. Indian Council Act 1909 — a. Mountbatten Plan
    2. Govt of India Act, 1919 — b. Simon Commission Report and Joint Select Committee
    3. Govt of India Act, 1935 — c. Montague-Chelmsford Reforms
    4. Indian Independence Act, 1947 — d. Morley-Minto Reforms
    A) 1-a,2-b,3-c,4-d
    B) 1-d,2-c,3-b,4-a
    C) 1-d,2-c,3-a,4-b
    D) 1-d,2-a,3-b,4-c
11. **Which of the following is correct?**
    A) The Nehru Report (1928) had advocated the inclusion of Fundamental Rights
    B) The Government of India Act 1935 referred to Fundamental Rights
    C) The August offer, 1940 included the Fundamental Rights
    D) The Cripps Mission, 1942 referred to Fundamental Rights
12. **Observe the following sentences?**
    1. If a money bill is passed by Lok Sabha but not Rajya Sabha, then President calls for Joint session
    2. If a Constitution amendment bill is passed by Lok Sabha but not Rajya Sabha, then President calls for Joint session
    3. If a ordinary bill is passed by Lok Sabha but not Rajya Sabha, then President calls for Joint session
    4. In state, under article 108, Governor calls for joint session
    **Which of the above are true**
    A) 1, 2, 3 B) 1 C) 2 D) 3
13. **Of the following words in the Preamble of the constitution of India which was not inserted through the Constitution (Forty Second) Amendment Act 1976?**
    A) Socialist B) Secular
    C) Democracy D) Integrity
14. **Match the following ?**
    Schedule in the constitution of India Subject
    1. First schedule — a. States and Union territories
    2. Eighth Schedule — b. Languages
    3. Eleventh schedule — c. Panchayat Raj
    4. Tenth Schedule — d. Anti Defection Law
    A) 1-a,2-b,3-c,4-d
    B) 1-d,2-c,3-a,4-b
    C) 1-a,2-c,3-b,4-d
    D) 1-d,2-a,3-c,4-b
15. **Match the following?**
    Parts of the Indian Constitution Provisions
    1. Part IV A — a. The Fundamental duties
    2. Part VIII — b. The Union Territories
    3. Part IX — c. The Panchayats
    4. Part IX A — d. The Municipalities
    **Codes:**
    A) 1-a,2-b,3-c,4-d
    B) 1-d,2-c,3-a,4-b
    C) 1-c,2-a,3-b,4-a
    D) 1-d,2-c,3-a,4-b
16. **Consider the following Foreign Visitors to India:?**
    1. Alberuni 2. Fahien
    3. HiuenTsang 4. Megasthenes
    **The correct Chronological order in which these persons visited India is:**
    A) 4-3-1-2 B) 2-4-3-1
    C)4-2-3-1 D) 1-2-4-3
17. **Match the following ?**

| **List 1** | **List 2** |
|---|---|
| 1. Lothal | a. Ploughed Field |
| 2. Kalibangan | b. Dockyard |
| 3. Chanhudaro | c. Great Bath |
| 4. Mohenjodaro | d. Undivided city |

18. **Arrange the following Magadhan Dynasities in the chronological order?**
    1. Nandas 2. Sungas
    3. Mauryas 4. Haryanks
    A) 2-1-4-3 B) 4-1-3-2
    C) 3-2-1-4 D) 1-4-3-2
19. **Who among the following introduced gold coins for regular use in India ?**
    A) Vim Kadphises B) Kujula Kadphises
    C) Kanishka D) Hermwes
20. **Match the following?**
    1. Tolkappiyam — a. Tolkappiyar
    2. Silppadikaram — b. Ilango Adigal
    3. Manimekalai — c. Sittalai sattanar
    4. Sivaga Sindamani — d. Tiruttakrdevas
    A) 1-a,2-b,3-c,4-d
    B) 1-d,2-c,3-b,4-a
    C) 1-c,2-d,3-a,4-b
    D) 1-c,2-d,3-b,4-a
21. **Arrange the following in chronological order and select the correct answer from the codes given below?**
    1. Dandi March
    2. Jallianwala Bagh Massacre
    3. Quit India Movement
    4. Champaran Satyagraha
    A)2-4-1-3 B) 4-2-1-3
    C) 2-1-4-3 D) 4-2-3-1




### ADB to invest USD 100 million in India

- Manila based, Multilateral institution Asian Development Bank (ADB) announced a USD 100 million funding for the Indian infrastructure sector through the government-promoted National Investment and Infrastructure Fund. ADB will be investing in the NIIF fund of funds which will ensure that the actual money invested will be a few times more than the USD 100 million.

### RBI announces liquidity boost of Rs 3.74 lakh crore




- In a bid to maintain stability in the financial system in the wake of coronavirus pandemic, RBI announced injection of Rs 3.74 lakh crore liquidity into system through various measures. As part of liquidity infusion measures, the central bank announced a massive 75 basis points cut in repo rates to revival economic growth which has been hit hard by the COVID-19 outbreak. The reverse repo rate has been slashed by 90 basis points to 4 per cent. Besides, the cash reserve ratio (CRR) of all banks has been reduced by 100 basis points to 3 per cent from 4 per cent, with effect from the fortnight beginning 28 March for a period of 1 year. This is expected to release Rs 1.37 lakh crore liquidity in the market.

### ANSWERS

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1- d | 2- d | 3- a | 4- a | 5-b | 6-d |
| 7- b | 8- d | 9-c | 10-b | 11- a | 12-d |
| 13-c | 14- a | 15-a | 16-c | 17-b | 18-b |
| 19-a | 20-a | 21-b | | | |



వి.రాజేంద్రశర్మ
ఫ్యాకల్టీ
9849212411